బుధవారం
02 జనవరి
2019

పేజీలు 12
సంపుటి 1, సంచిక 284

www.vijayakranthinews.com

విజయక్రాంతి


నిజం నిర్భయం నిష్పక్షం

హైదరాబాద్ | PUBLISHED SIMULTANEOUSLY FROM HYDERABAD, NIZAMABAD, KHAMMAM | VIJAYAKRANTHINEWS | రూ. 3.00



కొత్త పోస్టర్లతో కొత్తకొత్తగా.. 11

ఏపీ తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సి.ప్రవీణ్‌కుమార్



- ప్రమాణ స్వీకారం

విజయక్రాంతి, అమరావతి: రాష్ట్రంలో చారిత్రక ఘట్టం ఆవిష్కృతమైంది. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు కొలువుదీరింది. హైకోర్టు తొలి తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సి.ప్రవీణ్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. విజయవాడలో గవర్నర్ నరసింహన్ ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీరమణ హాజరయ్యారు. ప్రధాన న్యాయమూర్తితోపాటు మిగిలిన న్యాయమూర్తులతో గవర్నర్ ప్రమాణస్వీకారం చేయించారు. దీంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం పూర్తి స్థాయిలో కార్యకలాపాలకు శ్రీకారం చుట్టినట్లయింది. ఉమ్మడిహైకోర్టులో 3.4లక్షల వ్యాజ్యాలు ఉండగా అందులో 70శాతం వరకు కేసులు ఏపీకి చెందినవే. ఏపీ హైకోర్టుకు మంజూరైన న్యాయ మూర్తుల పోస్టులు 37 కాగా... ప్రస్తుతం ఉన్న వారు 14 మంది.


కొత్త చరిత్ర మొదలైంది: జస్టిస్ ప్రవీణ్ కుమార్

సీఎం క్యాంప్ ఆఫీస్‌లో నవ్యాంధ్ర తాత్కాలిక హైకోర్టు ఏర్పాటు చేయడం జరిగింది. హైకోర్టు ప్రారంభోత్సవానికి సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఎన్వీ రమణ, చీఫ్ జస్టిస్ ప్రవీణ్ కుమార్ , సీఎం చంద్రబాబు, మంత్రులు కొల్లు రవీంద్ర, దేవినేని ఉమ హాజరయ్యారు. ఈ సందర్భంగా జస్టిస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. ఇదో చరిత్రాత్మక ఘటన కొత్త చరిత్ర మొదలైందని తెలిపారు. సుప్రీంకోర్టు జడ్జిల మార్గదర్శకత్వంలో పనిచేస్తానన్నారు. అద్భుతమైన రాజధాని నిర్మాణం జరుగుతోందని.. అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేయడం బాధ్యతగా భావిస్తున్నానని ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు.

రానున్న లోక్‌సభ ఎన్నికలు
జనం-కూటమి మధ్యే

- 2019 సార్వత్రిక ఎన్నికలు ప్రజలు-మహాకూటమి మధ్య ఉంటుంది
- ఎన్డీయేకు 180 కన్నా ఎక్కువ సీట్లు రావన్న వార్తల్లో పసలేదు
- కొత్త ఏడాదిలో ఏఎన్‌ఐకిచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ప్రధాని మోదీ

నూతన సంవత్సరం తొలిరోజు దేశ ప్రధాని నరేంద్ర మోడీ వివిధ అంశాలపై మనసు విప్పి స్పందించారు. అయోధ్యలో రామమందిర నిర్మాణం మొదలు, సర్జికల్ దాడులు, పాకిస్తాన్‌తో సంబంధాలు, ట్రిపుల్ తలాఖ్, నోట్ల రద్దు, రిజర్వుబ్యాంక్ గవర్నర్ ఉర్జిత్‌పటేల్ రాజీనామా, జీఎస్టీ, శబరిమలలో మహిళల ప్రవేశం సహా పలు అంశాలపై తన అభిప్రాయాలను కుండబద్దలు కొట్టారు. తెలంగాణలో కేసీఆర్ ఫెడరల్ ఫ్రంట్ అంశంపై ఇప్పటి వరకూ తనకు సమాచారం లేదన్నారు. ఇక బీజేపీకి వ్యతిరేకంగా ఏర్పాటయ్యే గట్‌బంధన్ (మహాకూటమి)ని ఆయన తేలిగ్గా తీసుకున్నారు. తెలంగాణలో మహాకూటమికి ఎదురైన పరాభవమే వచ్చే ఎన్నికల్లో గట్‌బంధన్ పార్టీలకు ఎదురవుతుందని ఆయన జోస్యం చెప్పారు. 2019 సార్వత్రిక ఎన్నికలు జనం వర్సస్ గట్‌బంధన్ మధ్యే జరగనున్నాయని మోడీ ఏఎన్‌ఐకిచ్చిన ఇంటర్వ్యూలో స్పష్టం చేశారు.



ఢిల్లీ: బీజేపీ వ్యతిరేక పార్టీల ప్రతిపాదిత 'మహాకూటమి'పై ఏఎన్‌ఐ ప్రతినిధికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టమైన వివరణ ఇచ్చారు. కాంగ్రెస్ కూటమి స్టంట్లపై ఆయన వ్యంగ్యాస్త్రాలు సంధించారు. 2019 సార్వత్రిక ఎన్నికలను 'ప్రజలుమహాకూటమి' మధ్య జరిగే పోటీగా ఆయన అభివర్ణించారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో 543 స్థానాలకు గాను 180 కంటే ఎక్కువ సీట్లు బీజేపీ తెచ్చుకోలేదంటూ కొందరు రాజకీయ విశ్లేషకులు చేస్తున్న వాదనల్లో పస లేదని అన్నారు. 2014లో జరిగిన ఎన్నకల్లోనూ కొద్ది మంది వ్యక్తులు ఇలాంటి అంచనాలే వేశారని అన్నారు. గత నాలుగున్నరేళ్లలో తమ ప్రభుత్వం చేసిన పనులను పరిగణనలోకి తీసుకుని ప్రజలు మరోసారి బీజేపీపై నమ్మకం చాటుకుంటారని తాను బలంగా నమ్ముతున్నట్టు ప్రధాని చెప్పారు.

2019 ఎన్నికలు మోడీ వర్సస్ రాహుల్‌గా ఉండబోతోందా..?

అమెరికా అధ్యక్ష ఎన్నికల తరహాలో ఈ ఎన్నికలు మోదీకి, రాహుల్‌గాంధీల మధ్య జరిగే ఎన్నికలుగా అనుకోవచ్చా అని అడిగినప్పుడు ప్రజల ఆశయాలకు అనుగుణంగా పని చేసే వారికి, వారిని అడ్డుకునే వ్యక్తులకు మధ్యే ఈ ఎన్నికలు జరుగుతున్నానని నేను నమ్ముతున్నాను. 70 (తరువాయి 4లో)

న్యాయ ప్రక్రియ పూర్తి కాగానే రామ మందిరంపై నిర్ణయం

- సుప్రీం తీర్పుకు ముందే ఆర్డినెన్స్ తెచ్చే అంశంపై స్పష్టత ఇచ్చిన ప్రధాని
- సర్జికల్ స్ట్రయిక్స్ నా జీవితంలో ఉద్విగ్న క్షణాలు

4

ట్రిపుల్ తలాక్, శబరిమల అంశాలు వేరువేరు

- ప్రజల మనోభావాలు గౌరవించాలి
- జీఎస్టీతో చిన్న వ్యాపారులకు నష్టం నిజమే
- శబరిమల అంశం సాంప్రదాయానికి సంబంధించింది..

4

కేసీఆర్ కూటమి గురించి తెలియదు

- కేసీఆర్ కూటమి అనేది ఒకటుందని నాకు తెలియదు
- తెలంగాణలో కూటమికి ఎదురుదెబ్బ
- ఇదే రేపు దేశవ్యాప్తంగా జరగబోతోంది..
- తెలంగాణలో ఓడిపోయామన్న బాధతో చంద్రబాబు ఆరోపణలు

4



తెలంగాణ హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా జస్టిస్ రాధాకృష్ణన్ ప్రమాణ స్వీకారం

విజయక్రాంతి, హైదరాబాద్: తెలంగాణ ప్రజల చిరకాల ఆకాంక్ష నెరవేరింది. ప్రత్యేక హైకోర్టు కొలువుదీరింది. జస్టిస్ టీబీఎన్ రాధాకృష్ణన్ తెలంగాణ హైకోర్టు మొదటి ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు. రాజ్‌భవన్‌లో రాధాకృష్ణన్‌తో గవర్నర్ నరసింహన్ మంగళవారం ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి కేసీఆర్ హాజరయ్యారు. అనంతరం తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి.. తెలంగాణకు కేటాయించిన ఇతర న్యాయమూర్తులతో హైకోర్టు ఆవరణలో ప్రమాణ స్వీకారం చేయించారు. విభజన చట్టం ప్రకారం తెలంగాణ హైకోర్టుకు మంజూరైన న్యాయమూర్తులు 24 మంది. అయితే ప్రస్తుతం 13 మంది మాత్రమే పనిచేస్తున్నారు. వీరితో తెలంగాణ ప్రత్యేక హైకోర్టు మంగళవారం ప్రారంభమైంది. ఇందులో తెలంగాణకు కేటాయించిన 10 మంది, ప్రధాన న్యాయమూర్తి, బదిలీపై వచ్చిన ఇతర రాష్ట్రాలవారితో కలిపి.. మొత్తం 13 మంది న్యాయమూర్తులున్నారు.

హైకోర్టు అధికారులు, సిబ్బంది విభజన

ఇంతకాలం ఉమ్మడి హైకోర్టులో పనిచేసిన అధికారులు, సిబ్బందిని ఏపీ, తెలంగాణ హైకోర్టులకు విభజిస్తూ సోమవారం రాత్రి ఉత్తర్వులు వెలువడ్డాయి. వారు ఇచ్చిన ఆప్షన్ల మేరకు విభజన జరిగింది. ఏపీ హైకోర్టు ఆప్షన్ ఎంచుకున్న వారంతా ఈ నెల 4న ఆ రాష్ట్ర హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌ను కలుసుకోవాల్సి వుంటుంది. తెలంగాణ హైకోర్టు ఆప్షన్ తీసుకున్న వారి సంఖ్య ఎక్కువగా ఉన్నందున ఇక్కడ క్యాడర్ పోస్టులు ఖాళీలు లేనందున కొంతమంది ఏపీ హైకోర్టుకు డిప్యూటేషన్‌పై పంపాల్సి వచ్చింది. ఇంకా మిగిలిన వారిని తెలంగాణలోని కింది కోర్టులకు కూడా డిప్యూటేషన్‌పై పంపారు. తెలంగాణ హైకోర్టు ఆప్షన్ తీసుకున్న జాయింట్ రిజిస్ట్రార్ పి.శ్రీధర్‌రావును ఏపీ హైకోర్టుకు డిప్యూటేషన్‌పై పంపారు. ఇదే విధంగా12 మంది అసిస్టెంట్ రిజిస్ట్రార్ (తరువాయి 4లో)



లోక్‌సభ ఎన్నికల్లో ప్రకాశ్‌రాజ్ పోటీ

విజయక్రాంతి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తానని ప్రముఖ నటుడు ప్రకాశ్‌రాజ్ ప్రకటించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. 'అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు. మీ అందరి మద్దతుతో వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తా. ఎక్కడి నుంచి పోటీ చేస్తానో త్వరలో ప్రకటిస్తా. వచ్చేది ప్రజా ప్రభుత్వమే' అని ట్వీట్ చేశారు. ప్రముఖ జర్నలిస్ట్ గౌరి లంకేశ్ హత్య జరిగినప్పటి నుంచి ప్రధానమంత్రి నరేంద్రమోడీపై ప్రకాశ్‌రాజ్ తరచూ విమర్శల బాణాలు ఎక్కు పెడుతున్న విషయం విదితమే. గో హత్యలపై కూడా పలుమార్లు తీవ్రంగా స్పందించారు. రజనీకాంత్, కమల్‌హాసన్ రాజకీయ పార్టీలు ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ప్రత్యక్ష రాజకీయాల్లో వస్తున్నానంటూ ప్రకటన చేయడం ద్వారా ప్రకాశ్‌రాజ్ వారిద్దరి సరసన నిలిచారు. పలు అంశాల్లో తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అనుకూలంగా ప్రకటనలు చేశారు. ఆయనను పలుమార్లు కలిశారు కూడా. ఇటీవల జరిగిన ఎన్నికల సమయంలో కేసీఆర్‌కు మద్దతు ప్రకటించారు. అయితే కర్ణాటకకు చెందిన ప్రకాశ్‌రాజ్ ఎక్కడి నుంచి పోటీ చేస్తారో వేచి చూడాల్సిందే.



మార్చికల్లా కాళేశ్వరం పూర్తి...

- మేడిగడ్డ కాళేశ్వరం బ్యారేజీకి గుండెకాయ
- జూన్‌కల్లా రైతులందరికీ సాగు నీరు అందించాలి
- ప్రాజెక్టులకు నిధుల కొరత లేదు
- కాళేశ్వరం ప్రాజెక్ట్ పరిధిలో పనులను పరిశీలించిన సీఎం కేసీఆర్

విజయక్రాంతి, హైదరాబాద్/మంథని: కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని బ్యారేజిలు, పంపుహౌజుల నిర్మాణాలన్నీ మార్చి చివరి నాటికే పూర్తి చేయాలని ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు ఇరిగేషన్ అధికారులను, వర్క్ ఏజెన్సీలను ఆదేశించారు. గోదావరిలో కాపర్ డ్యామ్ ఏర్పాటు చేసుకుని ఏప్రిల్ నెలలో ట్రయల్ రన్ నిర్వహించాలని చెప్పారు. ఈ వర్షాకాంలోనే గోదావరి నీటిని మిడ్ మానేరు వరకు ఎత్తిపోసేలా ప్రణాళిక వేసుకుని, అమలు చేయాలని సూచించారు. రైతులు సాగునీటి కోసం ఎన్నో ఆశలతో ఎదురుచూస్తున్నారని, వారి ఆకాంక్షలకు అనుగుణంగా కాళేశ్వరం ప్రాజెక్టు పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాల్సిన అవసరాన్ని గుర్తించాలని అధికారులకు సూచించారు. ప్రాజెక్టుల సందర్శనలో భాగంగా ముఖ్యమంత్రి కేసీఆర్ మంగళవారం కాళేశ్వరం ప్రాజెక్టు మేడిగడ్డ బ్యారేజి, కన్నెపల్లి పంపుహౌజులను సందర్శించారు. పనుల పురోగతిని పరిశీలించారు. అక్కడికక్కడే పలు సూచనలు చేశారు.

మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజ్ ల నిర్మాణంతో పాటు పంపుహౌస్‌ల నిర్మాణం పనులు, మోటార్ల ఏర్పాటు పనులన్ని సమాంతరంగా పూర్తి కావాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. మార్చి 31 వరకు ప్రధానమైన పనులన్ని పూర్తిచేసి ఏప్రిల్, మే నెలల్లో ఇతర సమస్యలన్నింటిని పరిష్కరించుకుని ఎట్టి పరిస్థితుల్లోను జూన్ లో సాగునీరు అందించడానికి సిద్ధం కావాలని సీఎం సూచించారు. గోదావరిలో తెలంగాణ వాటా నీళ్లను వీలైనంత త్వరగా ఉపయోగించుకోవాలంటే, పంపు హౌస్ ల నిర్మాణం, మోటార్ల బిగింపు ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. గోదావరికి రెండు వైపుల ఉండే ఫ్లడ్ బ్యాంక్స్ పనులను (తరువాయి 4లో)

మోగిన పంచాయతీల నగారా

- ఎన్నికల షెడ్యూల్ విడుదల
- మూడు విడతల్లో పోలింగ్
- ఈ నెల 30లోగా ప్రక్రియ పూర్తి
- 30న చివరి విడత పోలింగ్
- 21, 25న తొలి, మలి విడతలు
- 12,732 పంచాయతీలకు ఎన్నికలు
- 1,13,170 వార్డులు గుర్తింపు
- 1,13,190 పోలింగు కేంద్రాల ఏర్పాటు
- ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్
- సాయంత్రంలోగా ఫలితాలు
- అదే రోజు ఉప సర్పంచు ఎన్నిక
- బ్యాలెట్‌లో నోటా గుర్తు
- అమల్లోకి వచ్చిన కోడ్



విజయక్రాంతి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలోని గ్రామ పంచాయతీ ఎన్నికలకు నగారా మోగింది. గత 15రోజులుగా ఎదురుచూస్తున్న ఉత్కంఠకు తెర పడింది. రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీల్లో బీసీ రిజర్వేషన్లను తగ్గిస్తూ ఆర్డినెన్స్ తీసుకురావడంతో బీసీ సంఘాలు కోర్టు మెట్లు ఎక్కిన విషయం విదితమే. దీంతో ఎన్నికలపై కోర్టు స్టే ఇస్తుందా? అనే అంశం చర్చానీయాంశంగా మారింది. వీటన్నింటిని పక్కన పెట్టి మంగళవారం రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ నాగిరెడ్డి పంచాయతీ ఎన్నికలకు షెడ్యూల్‌ను ప్రకటించారు. రాష్ట్రంలో ఎన్నికల్లో మూడు విడతలుగా నిర్వహించనున్నట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది. ఈ నెల 30వ తేదీతో ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయనున్నట్లు షెడ్యూల్‌లో పేర్కొన్నది. ఈ నెల 21న తొలి విడత పోలింగ్, 25న మలి విడత, 30న చివరి విడత పోలింగ్ నిర్వహించనున్నది. తొలి విడతకు ఈ నెల 7న ఎన్నికల ప్రక్రియను ప్రారంభించి 21వ తేదీతో ముగిస్తుంది. రెండో విడతకు 11వ తేదీన ప్రక్రియ ప్రారంభమై 25తో పూర్తి కానుంది. చివరి విడతకు ఈ నెల 16వ తేదీన ప్రారంభమై 30వ తేదీతో ముగియనుంది. రాష్ట్రంలో 12,732 గ్రామ పంచాయతీలు, 1,13,170 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. 19 గ్రామ పంచాయతీల్లో పలు కారణాల వల్ల ఎన్నికలు నిర్వహించడం లేదు. మరో 15 గ్రామ పంచాయతీల్లో పదవీకాలానికి ఇంకా సమయం ఉంది. ఆయా గ్రామ పంచాయతీ, వార్డు మెంబర్ల ఓటర్లు ఈ ఎన్నికల్లో పాల్గొని తమ ప్రజాప్రతినిధులను ఎన్నుకోనున్నారు. ఈ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 1,13, 190 పోలింగ్ కేంద్రాలను ఎన్నికల సంఘం ఏర్పాటు చేసింది. పోలింగ్ ఉదయం (తరువాయి 4లో)

దిమాక్ ఖరాబ్



దేశాన్ని నాశనం చేసిన మోదీ

- ఆ పది హామీలేమయ్యాయి?
- రణదీప్ సుర్జేవాలా



విజయక్రాంతి, హైదరాబాద్: గత ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీల్లో ముఖ్యమైన పది హామీల అమలు ఏమయిందో చెప్పాలని ఏఐసీసీ అధికార ప్రతినిధి రణదీప్ సుర్జేవాలా ప్రశ్నించారు. ఢిల్లీలో మంగళవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మోదీ దీర్ఘమైన ఇంటర్వ్యూ ఇచ్చారని, ఆ ఇంటర్వ్యూ నుంచి ప్రజలు ఆశించిన ఫలితం రాలేదన్నారు. దేశం బీజేపీని సాగనంపడానికి సిద్ధమైందన్నారు. 55 నెలల క్రితం మీరిచ్చిన పది ముఖ్యమైన హామీలపై మాట్లాడతారని ప్రజలు భావించినప్పటికీ మోదీ వాటిపై మాట్లాడలేదన్నారు. తాము అడిగే పది ప్రశ్నలకు మోదీ సమాధానమివ్వాలని ఆయన సవాల్ విసిరారు.55 నెలల్లో బీజేపీ నేతలు దేశాన్ని నాశనం చేశారు. ఇక వంద రోజులు మిగిలాయి. దిగిపోవడానికి రోజులు లెక్కబెట్టుకోవాలి. రూ.15 లక్షలు జనం ఖాతాల్లో వచ్చాయా లేదా రాలేదా మోదీ చెప్పాలి. వంద రోజుల్లో 80 లక్షల కోట్ల నల్లధనం తెస్తామని చెప్పినప్పటికీ ఇప్పటి వరకు ఒక్క రూపాయి రాలేదు. ప్రతి సంవత్సరానికి 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. 55 నెలల్లో 9 కోట్ల ఉద్యోగాలు రావాలి. కాని ఇప్పటి వరకు 9 లక్షల ఉద్యోగాలు రాలేదన్నారు. రైతులకు (తరువాయి 4లో)

రాష్ట్ర ప్రభుత్వం బీసీలను నమ్మించి మోసం చేసింది

- బీసీ సంక్షేమ సంఘం

విజయక్రాంతి, హైదరాబాద్: బీసీల రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వం బీసీలను నమ్మించి వంచించిందని, 12 శాతం రిజర్వేషన్లు తగ్గిస్తూ ఏకపక్షంగా పంచాయతీరాజ్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని బీసీ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు జస్టిస్ వంగాల ఈశ్వరయ్య, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ పేర్కొన్నారు. పంచాయతీ నోటిఫికేషన్ విడుదల చేయడంపై నగరంలో బీసీ సంఘాల ఆధ్వర్యంలో అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో బీసీ నాయకులు మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానంపై తీవ్రంగా మండిపడ్డారు. బుధవారం నాడు బీసీ రిజర్వేషన్లపై హైకోర్టులో కేసు విచారణలో ఉండగానే (తరువాయి 4లో)

లోక్‌సభపై అనాసక్తి
పోటీకి జంకుతున్న బీజేపీ నేతలు

- పంచాయతీపై కనబర్చని ఆసక్తి



విజయక్రాంతి, హైదరాబాద్: శాసనసభ ఎన్నికల ఓటమి ప్రభావం ఇంకా బీజేపీని వీడలేదు. ఆ పార్టీ నేతలు నిరాశ నిస్పృహ నుంచి కోలుకోవడం లేదు. లోక్‌సభ ఎన్నికలు ముంచుకొస్తున్నా.. ఆ పార్టీ నేతలు ఇంకా తేరుకోవడం లేదు. ఎన్నికలంటేనే ఉలిక్కి పడుతున్నారు. శాసనసభ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించి కీలక పాత్ర పోషిస్తామని బీజేపీ భావించింది. కానీ ఈ ఎన్నికల్లో ఆ పార్టీ ఘోర వైఫల్యం చవి చూసింది. గతంలో గెలిచిన స్థానాలను కూడా చేజార్చుకొని కేవలం ఒక్క స్థానంతో సరి పుచ్చుకుంది. ఈ ఓటమితో ఆశాభంగం చెందిన బీజేపీ నేతలు ఎన్నికలంటేనే.. ఉలిక్కి పడుతున్నారు. రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల సందడి మొదలైనా.. బీజేపీ నేతలు ఆ వైపు చూసిన దాఖలాలు కనిపించడం లేదు. ఈ ఎన్నికల తర్వాత వరుసగా మున్సిపాలిటీ, జిల్లా పరిషత్ ఎన్నికలు కూడా రానున్నాయి. ఈ విషయంలో బీజేపీ కనీసం ఆసక్తి కూడా చూపడం లేదు. మే నెలలో లోక్‌సభ ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికలపై జాతీయ నేతలు కసరత్తు చేస్తున్నారు. రాష్ట్ర నేతలు మాత్రం పంచాయతీ ఎన్నికలను పట్టించుకోనట్టే.. లోక్‌సభ ఎన్నికల విషయంలోనూ నిరాసక్తంగా ఉన్నారు.

పోటీపై వెనుకడుగు: లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయడానికి బీజేపీ నేతలు ఆసక్తి చూపడం లేదు. శాసనసభ ఎన్నికల్లో కేసీఆర్ పోల్ (తరువాయి 4లో)

శుభోదయం


ఓం శ్రీ గురుభ్యోనమః



శ్రీ వికారి నామ సంవత్సరం	సూర్యోదయం : ఉ. 06:46	కరణం : కౌలవ 13:45 తైతుల 26:10	
దక్షిణాయణం	సూర్యాస్తమయం : సా. 05:53	రాహుకాలం : మ. 12:20, 01:42	
హేమంత ఋతువు	పక్షము : కృష్ణ పక్షం	యమగండం : ఉ. 08:12, 09:35	
మార్గశిర మాసం	తిథి : ద్వాదశి 26:10	వర్జ్యం : మ. 01:54, 03:35	
	నక్షత్రం : విశాఖ 09:40	అమృతకాలం : తె. 12:03, 01:45	
	యోగం : శూల 26:04		



సూక్తి సుధ



మార్గంలేని గతాన్ని గురించి ఆలోచించకుండా, చేతిలో ఉన్న భవిష్యత్తు కోసం శ్రమించు

– డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్

తిరుప్పావై పాశురం–18



ఉన్దు మదకళిత్త ! నోదాద తోళ్వలియన్
నన్ద గోపాలన్ మరుమగళే !
నప్పిన్నాయ్ !
కన్దమ్ కమళుమ్ కుళలీ ! కడై తిరవాయ్
వన్దెఙ్గుమ్ కోళి అళైత్తనకాణ్ మాదవి
ప్పన్దల్ మేల్ పల్ కాల్ కుయిలినఙ్గళ్
కూవినకాణ్
పన్దార్ విరలి! ఉన్ మైత్తునన్ పేర్పాడ
చ్చెన్దామరైక్కైయాల్ శీరార్ వళై యొలిప్ప
వన్దు తిరవాయ్ మగిళిందేలో రెమ్బావాయ్

'మదాన్ని స్రవించు ఏనుగుల బోలిన బలం కలవాడు. వెనుదీయని భుజబలం కలవాడు అయిన నందగోపుని కోడలా! నప్పిన్నా! సువాసన గుబాళిస్తున్న కొప్పు కలదానా! గడియ తీయుము. కోళ్ళు వచ్చి అంతటా కూయుచున్నవి. మాధవి పందరపై పలుసార్లు కోకిల గుంపులు కూయుచున్నవి. బంతితో నిండిన వేళ్ళు కలదానా! ఎర్ర తామరపువ్వు బోలిన చేతితో సౌందర్యభరితాలగు గాజులు ధ్వనించగా వచ్చి నీ బావ పేరును పాడుటకు సంతోషంతో తెరువు'

నందగోపుడనగా = ఆచార్యుడు

గజం = భగవానుడు

భగవానుని వశంలో ఉండుకున్న ఆచార్యులే ఏనుగులను వశీకరించుకొను నందగోపుడు. నందగోపుడు ఆచార్యుడు. అతని పల్లె ఆచార్య కులం. అదియే ప్రేపల్లె.

గడియ తీయుటం అనగా అమ్మ కటాక్షించి కర్మాను గుణంగా కాక కృపాను గుణంగా మనను పరమాత్మ రక్షించినట్లు చేయటం.

కోళ్ళు అనగా భగవత్ కైంకర్యంనందు శ్రద్ధగల భాగవద్భక్తులు ఆచార్యులు. కోకిలలు అనగా మధుర గానం చేసే ఆళ్వారులు. బంతి అనగా లీలా విభూతి చేసే అనగా జ్ఞానం. సౌందర్యం – ఇతర విషయ నివృత్తి, సౌకుమార్యం స్వరూప నివృత్తి. సౌగంధ్యం – నిరతిశయ ప్రేమ, చేతి గాజులు – అనన్యార్హ శేషత్వం, అనన్య శరణ్యత్వం, అనన్య భోగ్యత్వం.



– డా॥ బాలుశర్మ పన్నాల (వేద పండితులు)

రాఘవుడు (శక. 1732)

వేద విజ్ఞానం

భాగం-68

ఖాందేశ్ ప్రాంతంలో, తాపీ నదికి దక్షిణంగా రెండు యోజనాల దూరంలో పారోలా నివాసి రాఘవుడు. అయితే అహ్మద్‌నగర్ జిల్లాలో గోదావరి తీరంలోని 'పుణ్యస్తంభ' (పున్‌తాంబా)లో నివాసం ఉన్నట్లు తెలుస్తోంది. అక్కడ కొన్ని గ్రంథాలను సంకలనం చేయడం జరిగింది. ఇంటిపేరు ఖండేకర్, తండ్రి పేరు అపాపంత. 'ఖేటకృత', 'పంచాంగార్క' అనే సిద్ధాంత గ్రంథాలను, 'పద్ధతి చంద్రిక' అనే జాతక గ్రంథాన్ని అతను సంకలనం చేశాడు. శక.1732లో 'ఖేటకృతి'ని సంకలనం చేయడం జరిగింది. ఇది పూర్తిగా గ్రహలాఘవాన్ని అను సరించినట్లుగా భావించవచ్చును. గ్రహలాఘవంలోని ముఖ్య విషయాలు మాత్రమే ఇందులో చర్చించారు. ఇందులో చూపిన గ్రహగతుల విలువలు, మిగిలిన కొంతల విలువలు గ్రహలాఘవంలో విలువ కంటే ఎక్కువ మెరుగుగా లేవు. గ్రహాల మధ్యస్థితులను సాధించడానికి భిన్నభిన్న పరికరాలను వినియోగించినట్లు తెలుస్తోంది. అయితే కొన్ని విషయాలను సాధించడంలో గ్రహలా ఘవం కంటే సౌకర్యంగా ఉంది. తిథి చింతామణి నుండి కొన్ని శ్లోకాలను ఉదహరిస్తూ తన కాలానికి పంచాంగ నిర్మాణంలో తిథ్యాదులను సాధించే విధానాన్ని తెలియ చేశాడు. మొత్తం మీద, ఇది గ్రహలాఘవం ముందు తీసికట్టని చెప్పవచ్చును. అయితే ఇది రాఘవుని 2వ గ్రంథమైన 'పంచాంగార్క'కంటే ఉన్నతమైనది. శక.1739లో పంచాంగార్క సంకలనం చేశారు. ఆనాటికి ముందుకాలం నాటి పంచాంగకర్తలు పంచాంగ గణితంలో కనిపించే 'అబ్బర' వంటి పదాల విశేషార్థాలను రహస్యంగా ఉంచడం కారణంగా, రాఘవుడు ఈ సంకలనం చేయవలసి వచ్చింది. దీనికి వ్యాఖ్యానం రాఘవునితో స్వయంగా చేయించారు. ఇది 'పున్‌తాంబా' గ్రామంలో చేశారు. లగ్నచింతామణి లేకుండా ఈ గ్రంథం ఉపయోగపడదు. ఎందుకంటే లగ్నచింతామణిలో చెప్పిన 'పరాఖ్యా' సంస్కారం (సూర్యోదయానికి తిథి, యోగ, నక్షత్రభోగ్యాదుల సాధించడం) చేయకుండా ఈ గ్రంథాన్ని ఉపయోగించలేరు. ఇందులో కేవలం మధ్యగ్రహాలను సాధించే విధానమే చెప్పారు. స్పష్టగ్రహ సాధన చెప్పలేదు. ఏ కారణంచేత ఇలా ఉన్నారో తెలియదు. ఇందు సూచించిన సంవత్సర ప్రమాణం 365 రోజులు – 15ఘ – 31ప. 31 విపలు. వర్గణం ఆధారంగా మధ్య గ్రహసాధన చెప్పబడింది. చెప్పబడిన వార్షిక గతులు సూర్య సిద్ధాంతంలో విలువలకు చాలా దగ్గరగా ఉన్నాయి. గతుల విషయంలో ఏమీ మార్పులు చెయ్యలేదు. రెండవ అధ్యాయంలో లగ్నసాధన, నక్షత్రం తెలిసిన పక్షంలో సూర్యచంద్ర గ్రహణ సాధన చేసే విధానం 3,4 అధ్యాయాలలో చెప్పబడింది. ఈ 4 అధ్యాయాలలో మొత్తం 103 శ్లోకాలు ఉన్నాయి.

జాతక విభాగానికి చెందిన 'పద్ధతి చంద్రిక' శక.1740లో సంకలనం చేశారు. ఇది కూడా పుణ్యస్తంభంలోనే పూర్తిచేశారు. శక.1741లో 'లలిత' అనే పేరుతో కృష్ణ, నీరా నదుల మధ్య ప్రాంతంలోని రేవడ గ్రామస్థుడు 'ఖైరె' అనే ఇంటిపేరుగల, రాముని కుమారుడు అప్పాగోస్వామి దీనికి వ్యాఖ్యానం రాశాడు.

శివుడు – తిథిపారిజాతం(1737)

శక.1737లో లక్ష్మేశ్వర గ్రామవాసి, విశ్వామిత్ర గోత్రీకుడు, మహాదేవుని కుమారుడైన శివుడనే సంకలనం చేయబడిన గ్రంథం 'తిథిపారిజాతం'. ఇది గ్రహలాఘవాన్ని అనుసరించిన గ్రంథం. ఈ లక్ష్మేశ్వర గ్రామం, ధార్వాడ్‌లోని ఇదే పేరు గల గ్రామం, ఈ రెండు ఒకటేనా అనేది తెలియలేదు.

-డా॥ రేమెళ్ల అవధానులు

ప్రాణుల మీద పెత్తనం కాలానిదే!

శ్లో॥ కాలః పచతి భూతాని కాలః సంహరతే ప్రజాః।
కాలః సుప్తేషు జాగర్తి కాలో హి దురతిక్రమః॥

కాలం (సమయం) ప్రాణులను పచనం (జీర్ణం) చేస్తున్నది. మింగుతోంది. కాలమే ప్రజలను నాశనం చేస్తుంది. సమస్త పదార్థములను నాశనం చేసినను కాలం మాత్రం నిలిచి ఉంటుంది. నిశ్చయంగా కాలాన్ని ఎవ్వడునూ ఉల్లంఘింపజాలడు. అతిక్రమింపలేడని చాణక్యుల వారు తమ నీతిశాస్త్రంలో తెలుపుతున్నారు. ఇంకా కాలానికి సంబంధించి వేదవచనంలో ఇలా ఉంది.

శ్లో॥ కాలో అశ్వో వహతి సప్తరశ్మిః సహస్రాక్షో అజరో భూరిరేతాః!
తమరోహన్తి కవయో విపశ్చితస్తస్య చక్రా భువనాని విశ్వా॥

ఈ శ్లోకం అథర్వణ వేదంలో ఉన్నది. దీని భావం ఏమిటంటే కాలరూపమైన గుర్రం విశ్వరూపమైన రథాన్ని లాగుతోంది. ఏడు రోజులు లేక ఏడు ఋతువులు అనేవి ఈ గుర్రమునకు ఏడు పగ్గాలు కలవు. లెక్కలేనన్ని ప్రాణుల శరీరాలను నశింపచేస్తుంది. కాని తానెప్పుడూ జీర్ణం కాక బలమైనదిగా ఉంటుంది. కవులు మేధావులు దానిపై స్వారీ చేస్తున్నారు. అనగా దాన్ని తగినట్లుగా సమయోచితంగా ఉపయోగించుకుంటారు. లోకంలోని అంతరాలన్నీ దాని చక్రాలు, అనగా కాలం ద్వారానే లోకలోకాంతరాలు చక్రం వలె తిరుగుతోంది. మహాభారతంలో యక్షుడు ధర్మరాజును ఇలా అడుగుతున్నాడు. 'కావార్తా' – సమాచారం ఏమి చెబుతోంది? ధర్మరాజు సమాధానం:–

చాణక్యం

అస్మిన్ మహామోహమయే కటాహే సూర్యాగ్ని నా రాత్రి దివేన్ధనేన।
మాసర్తుదర్వీ పరిఘట్టనేన భూతాని కాలః పచతీతి వార్తా॥

ఈ మహా మోహరూప కళాయినందు (ప్రపంచంలో), కాలం సమస్త ప్రాణులను మాసం, ఋతువుల రూపమనే తెడ్డుతో కలియద్రిప్పుచు, సూర్య రూపాగ్నిని, రాత్రింబవళ్లను కట్టెలతో మండించి పచనం చేయడం అంటే వండుతోంది. అంటే కాలచక్ర గమనంలో ప్రాణులు జన్మిస్తుంటాయి. వాటిని కాలమే నడిపిస్తుంటుంది. తర్వాత వాటి సారం అయిపోయిన తర్వాత వాటి ప్రాణాలను హరింపచేస్తుందంటున్నారు. దీనిలో బలమైనవి, బలహీనమైనవి అంటూ ఉంటాయి. బలమైనవి ఎక్కువ కాలం ఉంటాయి. బలహీనమైనవి తక్కువ కాలగమనంలో కలిసిపోతుంటాయి అంటున్నారు. మొత్తానికి ఈ ప్రాణులను చరింపచేయడం, వాటితో పనులు చేయించడం, తదుపరి తనలో కలిపేసుకోవడం అన్నీ కాలమే చేస్తుందని చాణక్యుల వారు తమ నీతిశాస్త్రంలో తెలియచెబుతున్నారు.

–యామిజాల సుబ్రహ్మణ్యం

పురాణ క్విజ్

తెలిసినవేంటో తేల్చుకోండి! తెలియనివన్నీ తెలుసుకోండి..

1. సహస్రాక్షుడు అని ఎవరికి పేరు?
2. త్రిమూర్తులను సృజించింది ఎవరు?
3. అసోం ప్రాంతాన్ని పురాణేతిహాసాల కాలంలో ఏమని పిలిచేవారు?
4. కౌరవుల సోదరి దుశ్శల ఎవరిని పెళ్లి చేసుకుంది?
5. రావణుని భార్య మండోదరి ఎవరి కుమార్తె?
6. మన్మథుని వాహనం ఏది?
7. ద్రుపదుని చిన్ననాటి స్నేహితుడు?
8. కంసుని తండ్రి?
9. భీష్మకుడు శ్రీకృష్ణునికి ఏమవుతాడు?
10. ధృతరాష్ట్రుని భావమరిది?

సమాధానాలు

1. ఇంద్రుడు
2. ఆదిపరాశక్తి
3. కామరూప దేశం
4. జయద్రథుడు
5. మయాసురుడు
6. రామచిలుక
7. ద్రోణాచార్యుడు
8. ఉగ్రసేనుడు
9. మామ
10. శకుని




ఆదిత్యాయ నమో నమః

'సూర్యనారాయణ మూర్తి' ప్రత్యక్షదైవం. సూర్యునితోనే ఈ సృష్టి ముడిపడి ఉంది. సూర్యుడు లేని జగత్తును ఊహించలేం. సకల జీవకోటికి ప్రాణాధారం సూర్యభగవానుడు. సూర్యనారాయణుడు త్రిమూర్తుల ప్రతిరూపం.

సూర్యుడు సవిత్రుడు. అనంతశక్తుడు. పాపాలను, శత్రువులను, భయాలను, రోగాలను హరించే దేవుడు, సర్వలోకాలకు గ్రహణ, జ్ఞాన, ఆదానక్రియలు సలిపే కాలమూర్తిస్వరూపుడు. ప్రాతఃకాలమందే గోవులను బంధనాల నుండి విడిపించే ఆదిదేవుడు.

కశ్యప, అదితిల పుత్రుడు ఆదిత్యుడు. పితృమూర్తి పేరుమీదుగా కాశ్యపేయుడు అని, తల్లి అదితి ఐనందువల్ల ఆమె పేరు మీదుగా 'ఆదిత్యుడు' అని సూర్య భగవానుని పిలుస్తారు. ఆదిత్యులు పన్నెండుగురు. వీరిని 'ద్వాదశ ఆదిత్యులు' అందురు.

"ఆదిత్య అంటే దేవత, గణదేవత, సూర్యుడు" అని అర్థాలు.



సప్తాశ్వ రథమారూఢం ప్రచండం కశ్యపాత్మజం
శ్వేతపద్మ ధరందేవం తం సూర్యం ప్రణమామ్యహం

ద్వాదశాదిత్యులు:

ఇంద్రుడు: 1. ఐశ్వర్యం గలవాడు, సురపతి, వాసవుడు 2. ద్వాదశాదిత్యులలో ఒకడు 3. పరమేశ్వరుడు 4. సమాసమునందుత్తర పదమైనపుడు మహద, మహద్భావాలననుసరించి 'ఇంద్రుడు, ఇంద్రం' అను రూపాలతో ఉండి అధిపతి, శ్రేష్ఠుడు, శ్రేష్ఠం అను అర్థాల ఉదా: నరేంద్రుడు, మృగేంద్రం, యోగేంద్రుడు, కవీంద్రం మొ॥

ధాత: 1. ధరించువాడు 2. పోషించువాడు 3. సృజించువాడు 4. త్రాగువాడు 5. 1. బ్రహ్మ 2. ఆత్మ 3. ఒకానొక ఆదిత్యుడు 4. ఒకానొక సంవత్సరం.

పర్జన్యుడు: 1. ఇంద్రుడు 2. విష్ణువు 3. ఒకానొక వామదేవుడు

త్వష్ట: కఱ్ఱలు మొదలైనవి చెక్కువాడు 1. వడ్లవాడు 2. దేవశిల్పి విశ్వకర్మ 3. ద్వాదశాదిత్యులలోనొకడు.

పూషుడు: ద్వాదశాదిత్యులలో నొకడు.

ఆర్యముడు (ఆర్యకుడు): పూజ్యుడు, శ్రేష్ఠుడు, పితామహుడు.

భగుడు: ద్వాదశాదిత్యులలో నొకడు 1. సూర్యుడు 2. చంద్రుడు 3. శివుడు

వివస్వంతుడు: 1. సూర్యుడు 2. అనూరుడు (సూర్యసారథి) 3. దేవత, వేల్పు

విష్ణువు: 1. అంతటను వ్యాపించువాడు, ఐన్నుడు, త్రిమూర్తులలో రెండవవాడు.(ఇతడు సత్వగుణ ప్రధానుడై లోకస్థితి కర్తయై తన పని నిర్వహించే అనేక అవతారాలు ఎత్తినవాడు 2. అగ్ని 3. పుణ్యపురుషుడు 4. విష్ణుస్మృతి రచించిన ఒకానొక ముని.

అంశుమంతుడు: 1. సూర్యుడు 2. ఒకానొక రాజు (ఇతడు సగరుని మనుమడు, దిలీపుని తండ్రి)

వరుణుడు: 1. మిత్రునితో కలసి ఉండు రాత్ర్యభిమానియైన ఆదిత్యుడు 2. పశ్చిమాదిగధిపతి, సముద్రాధిపతి అను దిక్పాలకుడు 3. సూర్యుడు.

మిత్రుడు: 1. సూర్యుడు 2. స్నేహితుడు అష్టవసువులలో నొకడు, శ్రవణ నక్షత్రం.

త్రిసంధ్యలలో సూర్యుని ఆరాధిస్తే త్రిమూర్తులను ఆరాధించిన ఫలితం లభిస్తుంది. సూర్యోపాసన కారణంగా ద్విగుణీకృత ఉత్సాహం లభిస్తుంది. సకల వ్యాధులు నశిస్తాయి. పరిపూర్ణమైన ఆరోగ్యం లభిస్తుంది. ప్రాతఃకాలాన లేచి లేలేత కిరణాల ఛాయలో సూర్యనమస్కారాలు చేసేవారికి అనారోగ్యం ఆమడ దూరంలో ఉంటుంది. వ్యాధులన్నీ మటుమాయమవుతాయి. అద్వితీయమైన తేజస్సుతో ప్రకాశించే శక్తి లభిస్తుంది.

శ్లో॥ 'ఆదిత్యం ప్రథమం నామ ద్వితీయం తు దివాకరః
తృతీయం భాస్కరః ప్రోక్తం చతుర్థం తు ప్రభాకరః
పంచమంతు సహస్రాంశుః షష్ఠం చైవ త్రిలోచన
సప్తమం హరిదశ్వ శ్చ అష్టమం తు విభావసుః
నవమం దినకృత్రోక్తం దశమం ద్వాదశాత్మకమ్
ఏకాదశం త్రయీమూర్తి ర్ద్వాదశం సూర్య ఏవచ
ద్వాదశాదిత్య నామాని ప్రాతః కాలే పఠేన్నరః
ఆధిప్రణాశనం చైవ సర్వ దుఃఖం చ నశ్యతి
దద్రు కుష్ఠ హరం చైవ దారిద్ర్యం హరతే ధ్రువమ్
సర్వతీర్థ ప్రదం చైవ సర్వ కామ ప్రవర్ధనమ్॥


పై విధంగా అనునిత్యం ప్రాతఃకాలాన సూర్యభగవానుని ఆరాధిస్తే దుఃఖం దూరమవుతుంది.

–బ్రహ్మశ్రీ పంచయజ్ఞం అగ్నిహోత్రావధానులు

ఆత్మస్వరూపం – చిరంజీవులు

మొన్న యడవల్లి రామశాస్త్రిగారు వచ్చారిక్కడికి. వారు భగవానుని ఇట్లా అడిగారు. "స్వామీ! పరమమైన ఆత్మ స్వరూపం కోటి సూర్య ప్రభాభాసిత మంటారే నిజమేనా?" "అవునండీ. కోటిసూర్యసమ కాంతి గలదేననుకోండి. ఎట్లా నిర్ణయిస్తారు? ఈ కళ్ళతో ఒక్క సూర్యుణ్ణే చూడలేమే, కోటి సూర్యుల నెట్లా చూడగలం? ఆ కన్ను వేరండి. ఆ కంటితో చూడగలిగినప్పుడు ఆ పరాత్పరమైన ఆత్మస్వరూపానికి ఏ పేరైనా పెట్టుకోండి. కోటి సూర్యులో, కోటిచంద్రులో, ఏదో ఒకటి" అన్నారు భగవాన్.

ఇట్లాగే ఆ మధ్యనొకరు "అశ్వత్థామ విభీషణుడు మొదలైన వారంతా చిరంజీవులనీ, వారిప్పటికీ ఎక్కడో ఉన్నారనీ అంటారే నిజమేనా?" అంటే. "ఆహా నిజమే. చిరంజీవులంటే ఏమని మీ తాత్పర్యం? ఎప్పుడూ చెడనిస్థితి ఏదో అది తెలుసుకొన్నారు అని. తమ నిజస్థితిని తెలుసుకున్న వారికి మరణమేది, జననమేది? వారు చిరంజీవులై ఎప్పుడూ ఎక్కడా ఉంటారు. మనమిప్పుడు వారిని గురించి మాట్లాడుతున్నాం గనుక వారిక్కడున్నట్లే గదా? అట్లాగే ఎప్పుడు, ఎవరు ఎక్కడ తలుచుకుంటే అక్కడే ఉంటారు. వారు కీర్తికేయులు. చిరంజీవితమంటే పాంచభౌతికమైన యీ జడశరీరానికా? దీన్ని వారు లక్షింపరు. బొమ్మరిళ్ళలాగా బ్రహ్మకల్పాలే తారుమారవుతుంటే ఆ కల్పాలలోని కల్పిత చిత్రాలకు స్థిరత్వం కల్పించటం పొసగుతుందా!" అన్నారు భగవాన్.



– సూరి నాగమ్మ (రమణ మహర్షి లేఖలు)

ధర్మ సందేహాలకు సమాధానాలు


వినాయకుడు వ్యాసునికి లేఖకుడిగా మారి మహాభారత రచనలో సహాయం చెయ్యడం నిజమేనా? ఆ వివరాలు తెల్పండి?

నిజమే. ఇది జనశ్రుతిగా వస్తున్నకథ. వ్యాసమహర్షి మహాభారత ఇతిహాసాన్ని రాయాలని సంకల్పించాడు. ఇంతగొప్ప ఇతిహాస రచనకు లేఖకుడు దొరకడం లేదని బ్రహ్మముందు విచారం వ్యక్తం చేస్తాడు వ్యాసుడు.

ఈ కావ్యానికి లేఖకుడిగా ఉండేందుకు గణేశుణ్ణి స్మరించు అని బ్రహ్మదేవుడు వ్యాసునికి చెప్పాడు. వ్యాసమహర్షి గణపతిని స్మరిస్తే ఆయన ప్రత్యక్షమై

'నేను రాసేటప్పుడు నా లేఖిని ఒక్కక్షణమైనా ఆగడానికి వీల్లేదు. అట్లైతేనే నేను రాస్తాను' అనే షరతు విధించాడు గణపతి. అందుకంగీరించిన వ్యాసముని కూడా ఓ షరతు విధించాడు.

'నేను చెప్పేటప్పుడు నీవు అర్థం చేసుకోకుండా రాయకూడదు. నీవు అర్థం చేసుకొంటూ రాస్తేనే నేను ఆగకుండా చెప్పగలను' అన్నాడు వ్యాసుడు.



ఈ విధంగా ఇద్దరు మహనుభావులు గొప్ప ఆలోచనతో మహాభారతం రచించారు. అంత ఆలోచించి రాసారు కాబట్టే భారతం ప్రపంచంలోనే గొప్ప గ్రంథంగా ప్రాచుర్యం పొందింది.

మహాభారతం రాసేటపుడు వినాయకుడు 8800 చోట్ల తన లేఖినిని ఆపడం జరిగిందట. మహాభారతాన్ని అన్ని చోట్ల అర్థం చేసుకోవడానికి కొంతసమయం అవసరమన్న మాట. పూర్వం గ్రంథానలు 'ముడి' వేసేవాళ్లు. (గ్రంథి అంటే ముడి అని అర్థం – ముడి వేసేది కాబట్టి గ్రంథం) అందుకే రచనలకు 'గ్రంథాలు' అన్న పేరు వచ్చింది. మహాభారతంలో ఆ 8800 చోట్లనే చిక్కుముడులు కన్పిస్తాయట. ఏదైనా విషయం భారతంలో అర్థం కాకుండా ఆగిపోయామంటే ఆ ఎనిమిదివేల ఎనిమిదివందల చోట్లనే అని గుర్తుంచుకోవాలి.

– డా॥ పి.భాస్కరయోగి

ఏపీ ముఖ్యమంత్రి దృష్టికి న్యాయవాదుల సమస్యలు

విజయక్రాంతి, ఉప్పల్: ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం మంగళవారం విజయవాడలోని ఇందిరాగాంధీ స్టేడియంలో జరిగింది. కాప్రా సర్కిల్ కమలానగర్‌కు చెందిన హైకోర్టు న్యాయవాది సుంకర నరేష్ ఆధ్వర్యంలో పలువురు న్యాయవాదులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడును ఈ సందర్భంగా కలిసి పలు సమస్యలను విన్నవించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు పి.శశికిరణ్, డి.ప్రవీణ్‌రెడ్డి, శ్రీనాథ్, జూపల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న ఉప్పల్ టీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు బండారి లక్ష్మారెడ్డి (విజయక్రాంతి, ఉప్పల్)

'పంచాయతీ' షెడ్యూల్ విడుదల

- మూడు దశల్లో ఎన్నికలు
- ఈనెల 7, 11, 16న నోటిఫికేషన్లు 21, 25, 30న పోలింగ్
- షెడ్యూల్ విడుదల చేసిన ఎన్నికల సంఘం
- మొదటి దశలో 6 మండలాలు.. 188 పంచాయతీలు.. 1736 వార్డులు
- ఏర్పాట్లు చేస్తున్న అధికారులు



విజయక్రాంతి, పాలేరు: నూతన సంవత్సరం రోజు ఎన్నికల సంఘం ప్రజలకు తీపి కబురందించింది. పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసింది. మంగళవారం నూతన సంవత్సరం రోజే ఎన్నికల సంఘం అధికారి నాగిరెడ్డి షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఇప్పటికే ఓటర్ల గణన పూర్తి చేసిన అధికారులు, రిజర్వేషన్ ప్రక్రియను పూర్తి చేశారు. కాగా ప్రభుత్వ అనుమతితో గెజిట్ విడుదల చేసిన ఎన్నికల సంఘం నిమిషం ఆలస్యం చేయకుండా షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా మూడు దశలో ఎన్నికలను నిర్వహిస్తున్నట్లు ప్రకటించగా, ఖమ్మం జిల్లాలో మూడు దశలో ఎన్నికలను నిర్వహిస్తున్నట్లు ప్రకటించింది. జనవరి 10లోపు పంచాయతీ ఎన్నికలను నిర్వహించాలని హైకోర్టు ఆదేశించిన సందర్భంలో ఆ తేదిలోపు ఎన్నికలను నిర్వహించాలని ఎలక్షన్ కమిషన్ భావించినప్పటికి బీసీ గణన, ఓటర్ల జాబితాలో తప్పిదాలు, సవరణలు, రిజర్వేషన్ల ప్రక్రియ, సాధారణ ఎన్నికల నేపథ్యంలో కొంత సమయాన్ని తీసుకుంది. ఈ మేరకు హైకోర్టు ఆదేశించిన సమయం ప్రకారం ఎన్నికల షెడ్యూల్ ప్రకటించి, ఎన్నికలకు వెళ్తున్నామని ఆలోచనతో షెడ్యూల్‌ను ప్రకటించింది.

మూడు దశలో ఎన్నికలు

రాష్ట్ర వ్యాప్తంగా మూడు దశలోనే పంచాయతీ ఎన్నికలను పూర్తి చేయాలని ఎన్నికల సంఘం భావించి షెడ్యూల్ విడుదల చేసింది. ఈనెల 21, 25, 30న పోలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపింది. అందుకు గాను మొదటి దశకు ఈనెల 7న, రెండవ దశకు ఈనెల 11న, మూడవ దశకు 16న నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఈనెల 7న తొలి దశకు నోటిఫికేషన్ విడుదల చేసి, అదే రోజు నుంచి నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం ఉంటుంది. అలాగే 21న ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పోలింగ్, ఆ తరువాత మధ్యాహ్నం 2గంటల నుంచి లెక్కింపు ఉంటుంది. అదే రోజున చేతుల ఎత్తే పద్దతి ద్వారా ఉప సర్పంచ్ ఎంపిక ఉంటుంది. అలాగే రెండవ దశకు ఈనెల 11న నోటిఫికేషన్ విడుదల చేసి, అదేరోజు నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఈనెల 25న ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పోలింగ్, ఆ తరువాత మధ్యాహ్నం 2గంటల నుంచి లెక్కింపు ఉంటుంది. అదే రోజున చేతుల ఎత్తే పద్దతి ద్వారా ఉప సర్పంచ్ ఎంపిక ఉంటుంది. అలాగే మూడవ దశలో ఈనెల 16న నోటిఫికేషన్ ప్రకటన విడుదల చేయగా, 30న ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పోలింగ్, ఆ తరువాత మధ్యాహ్నం 2గంటల నుంచి లెక్కింపు ఉంటుంది. అదే రోజున చేతుల ఎత్తే పద్దతి ద్వారా ఉప సర్పంచ్ ఎంపిక ఉంటుంది.

జిల్లాలో 584 పంచాయతీల్లో ఎన్నికలు

ఖమ్మం జిల్లాలో మొత్తం 20 మండలాలు ఉండగా, అందులో 584 పంచాయతీలకు, 5338 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. వాటన్నంటికి గాను మూడు దశల్లో ఎన్నికలను నిర్వహించేందుకు అధికారులు ప్రకటించారు. మొదటి దశలో 6 మండలాల్లోని 188 పంచాయతీలకు, 1736 వార్డులకు ఎన్నికలను నిర్వహించనున్నారు. అలాగే రెండవ దశలో 7 మండలాల్లోని 204 పంచాయతీలు, 1862 వార్డులకు, మూడవ దశలోని 7 మండలాల్లో 192 పంచాయతీలు, 1740 వార్డులకు ఎన్నిలకను నిర్వహించనున్నారు. మొదటి దశలో కూసుమంచి, తిరుమలాయపాలెం, ఖమ్మం రూరల్, ముదిగొండ, నేలకొండపల్లి, కామేపల్లి మండలాల్లో, రెండవ దశలో ఏన్కూరు, తల్లాడ, కల్లూరు, పెనుబల్లి, సత్తుపల్లి, వేంసూరు, సింగరేణి, మూడవ దశలో రఘునాథపాలెం, కొణిజర్ల, వైరా, ఎర్రుపాలెం, మధిర, బోనకల్లు, చింతకాని పంచాయతీల్లో ఎన్నికలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. అందుకు గాను విడతల వారిగా ఎన్నికలకు సంబంధించిన బ్యాలెట్ పత్రాలను ఆయా మండలాలకు పంపిణి చేసినట్లు తెలుస్తోంది. అందుకు కావాల్సిన ఏర్పాట్ల ఎన్నిక ల సంఘం నిమగ్నమైనట్లు తెలుస్తోంది.

బీసీలను మోసం చేసిన టీఆర్ఎస్

- టీటీడీపీ ఆరోపణ

విజయక్రాంతి, హైదరాబాద్: గ్రామా పంచాయతీ ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్లను 22.78 శాతానికి తగ్గించడాన్ని తెలంగాణ తెలుగుదేశం తీవ్రంగా ఖండించింది. రిజర్వేషన్లు 50 శాతానికి మించి ఉండరాదనే సుప్రీ కోర్టు తీర్పును సాకుగా చూపి టీఆర్ఎస్ బీసీలకు అన్యాయం చేసిందని తెలంగాణ టీడీపీ ప్రధాన కార్యదర్శి జి. బుచ్చిలింగం, బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు కూన వెంకటేష్‌గౌడ్ అభిప్రాయపడ్డారు. స్థానికంగా బీసీ నాయకత్వాన్ని రాజకీయంగా నిర్వీర్యం చేసే కుట్రలో భాగంగానే రిజర్వేషన్లు తగ్గించారని వారు విమర్శించారు. రాష్ట్ర జనాభాలో 50 శాతం పైగా వున్న బీసీలకు జనాభా నిష్పత్తిన రిజర్వేషన్లు అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. కనీసం గతంలో ఇచ్చిన 34 శాతంకూడా కాకుండా 23 శాతం రిజర్వేషన్లు అమలుచేయడం దారుణమని వారు మండిప డ్డారు. బీసీలను రాజకీయంగా అణిచివేయాలని చూస్తే ముఖ్యమంత్రి కేసీఆర్‌కు టీఆర్ఎస్‌కు ప్రభుత్వానికి సరైనసమయంలో బుద్ధి చెబుతామని హెచ్చరిస్తూ, రిజర్వే షన్లపై ప్రభుత్వం జారీ చేసిన ఆర్డినెన్సును వెంటనే వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కొత్త ఆలోచనలతో యువత ముందుకు రావాలి

- బీజేవైఎం రాష్ట్ర నాయకుడు విజిత్ వర్మ



విజయక్రాంతి, కూకట్‌పల్లి: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని కూకట్‌పల్లి బీజేవైఎం నాయకులు రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా బీజేవైఎం రాష్ట్ర సెక్రటరీ విజిత్ వర్మను కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా బీజేవైఎం రాష్ట్ర నాయకులు విజిత్ వర్మ మాట్లాడుతూ ఈ కొత్త సంవత్సరంలో ప్రతి ఒక్కరు కూడా ఆయురారోగ్యలతో ఉండాలని ఆకాంక్షించారు. యువతపైనే దేశ భవిష్యత్ ఆధార పడి ఉందని, యువత అన్ని రంగాలలో రాణించాలంటే బాగా చదువుకొని మీలో ఉన్న విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని అన్నారు. దేశ అభివృద్ధికి దోహదపడాలని సూచించారు. అదేవిధంగా ఈ కొత్త సంవత్సరంలో ప్రజలకు ఉపయోగపడే విధంగా మీ సేవలు ఉండాలని అన్నారు. తాను ఎప్పుడు మీకు అందుబాటులో ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ వినోద్, భాను, అఖిల్, యశ్వంత్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరు సంతోషంగా ఉండాలి



- ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

విజయక్రాంతి, ఎల్బీనగర్: నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా మంగళవారం ఎల్బీనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి చైతన్యపూరి డివిజన్‌లోని భవానినగర్ కాలనీకి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు విప్పర్తి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ నూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరు సంతోషంగా ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బద్దూరి వెంకటేశ్వరెడ్డి, శశిధర్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, రేణు, చారి, సాయి, యాదగిరి, ఆనంద్, ఆ ల్వాల్ రెడ్డి, సుధాకర్, దిలీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్‌లో విద్యావంతులే ఉండాలి

- ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్

విజయక్రాంతి సికింద్రాబాద్: ప్రపంచ దేశాలకు ధీటుగా భారతదేశం అభివృద్ధి చెందాలంటే విద్యావంతులు పార్లమెంట్‌లో ఉండాలి అలాగే విద్యావంతులే వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేస్తే దేశ అభివృద్ధిలో ముందుకు పోతుందని ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ, తార్నాకలో ఉన్న బస్తీ ప్రజల మధ్య ఆయన కేక్ కట్ చేసి నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల అభిప్రాయం మేరకే తాను సికింద్రాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి ఇండిపెండెంట్‌గా పార్లమెంట్ ఎన్నికలకు పోటీ చేయనున్నట్లు ప్రకటించారు.ప్రపంచ దేశాల్లో ప్రజాస్వామ్య ఎన్నికల్లో ఎక్కువగా విద్యావంతులు పోటీలో నిలబడి ఆ దేశాన్ని అభివృద్ధి చేసే విధంగా సూచనలు, సలహాలు ఇవ్వడం వలన ఆదేశాలు అభివృద్ధిలో ముందున్నాయన్నారు. విద్యావంతులు వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో నిలబడి ఆదర్శ భారతదేశం వైపుగా నిలవడం వలసిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు.



సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో హోంమంత్రి మహమూద్ అలీ చేతుల మీదుగా ఉత్తమ విద్యార్థిగా మెరిట్ అవార్డును అందుకున్న బర్ల మహతి. చిత్రంలో ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, టీఎస్‌పీఎస్సీ చైర్మన్ చక్రపాణి, క్లబ్ అధ్యక్షుడు విజయకుమార్‌రెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ సతీష్ చందర్ తదితరులు

నేటి నుంచి మలక్‌పేటలో ట్రాఫిక్ మళ్లింపులు

విజయక్రాంతి, హైదరాబాద్: చాంద్రాయణగుట్ట నుంచి ఇమ్లీబన్ 33/11కేవీ విద్యుత్ ఫీడర్‌కు విద్యుత్ సరఫరా చేసే అండర్ గ్రౌండ్ కేబుల్ మరమ్మతుల కారణంగా మలక్‌పేటలో జనవరి 2వ తేదీ నుంచి 16వ తేదీ వరకు ట్రాఫిక్‌ను మళ్లించేందుకు చర్యలు చేపట్టినట్లు మలక్‌పేట ట్రాఫిక్ అధికారులు తెలిపారు. రోడ్డుపై తవ్వకాలు చేయనున్నందున ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా ఉండేందుకు దిల్‌షుక్‌నగర్ నుంచి మలక్‌పేట నల్గొండ చౌరస్తా నుంచి చాదర్‌ఘట్ వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులను, ఇతర వాహనాలను ముసారాంబాగ్ చౌరస్తా గోల్నాకా బ్రిడ్జి మీదుగా అంబర్‌పేట వైపు నుంచి మళ్లించనున్నట్లు తెలిపారు. దిల్‌షుక్‌నగర్ నుంచి ఎంజీబీఎస్ వైపు వెళ్లే ఆర్టీసీ జిల్లా బస్సులు, సిటీ బస్సులను, ఇతర ప్రైవేటు వాహనాలన్నింటినీ ముసారాంబాగ్ చౌరస్తా నుంచి వయా గోల్నాకా న్యూ బ్రిడ్జి, నింబోలి అడ్డ, చాదర్‌ఘట్ చౌరస్తా మీదుగా ఎంజీబీఎస్‌ను చేరుకుంటాయి. సైదాబాద్ నుంచి చాదర్‌ఘట్ వైపు వెళ్లే ఆర్టీసీ జిల్లా బస్సులు, సిటీ బస్సులు, ఇతర వాహనాలను వయా చంచల్‌గుడా జైలు చౌరస్తా, డబీర్‌పురా ఫ్లైవర్ బ్రిడ్జి, ఏపీఏటీ, సాలర్‌జంగ్ చౌరస్తా నుంచి చాదర్‌ఘట్ వైపు నుంచి నడుస్తాయి.



అంబర్‌పేట్‌లో మహాపడి పూజ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి, టీఆర్ఎస్ సీనియర్ రాష్ట్ర నాయకుడు సి.కృష్ణాయాదవ్ తదితరులు (విజయక్రాంతి, అంబర్‌పేట్)

2018లో పూర్తికాని అభివృద్ధి పనులు

సమస్యలతో ప్రజల ఇబ్బందులు





- కొత్త ఏడాదిలో అయినా పెండింగ్ పనులకు మోక్షం లభించేనా...?

విజయక్రాంతి, రాజేంద్రనగర్: కొత్త సంవత్సరం (2019)లో పెండింగ్ సమస్యలు తీరి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందుతాయని ప్రజలు ఆశిస్తున్నారు. గడిచిన ఏడాది (2018)లో రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలో పూర్తి కావాల్సిన అనేక పెండింగ్ పనులు, ఇతర సమస్యలు సత్వరమే పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించాలని నియోజకవర్గ ప్రజలు కోరుకుంటున్నారు. ఎన్నో ఏళ్ల నుంచి నియోజకవర్గంలో దీర్ఘకాలిక సమస్యలు ప్రజల్ని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలో గత ఏడాది (2018) ప్రారంభించిన మోడల్ మార్కెట్లు, బస్‌బేలు, మోడ్రన్ మినీ ఫంక్షన్ హాల్స్, బస్తీ దవాఖానాలు, మిషన్ అర్బన్ భగీరథ (ఇంటింటికి నల్లా నీరు), డబుల్ బెడ్‌రూం నివాసాలు, పూర్తిస్థాయిలో భూగర్భ మురుగునీటి వ్యవస్థ, రహదారుల విస్తీర్ణం తదితర అభివృద్ధి పనులు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే చందంగా మారింది. అదే విధంగా మైలార్‌దేవ్‌పల్లిలో వంద పడకల ప్రభుత్వ దవాఖాన నిర్మాణాకి స్థలాన్ని ఎంపిక చేసినప్పటికీ నేటికీ ఆ దవాఖాన ఊసేలేదు. అదే విధంగా కాటేదాన్‌లో డబుల్‌బెడ్ రూం ఇళ్ల నిర్మాణానికి స్థలం ఎంపిక జరుగలేదు. ఇక పదేళ్ల క్రితం కాటేదాన్‌లో ప్రారంభించిన మినీ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నేటికీ పూర్తి కాలేదు. అదే విధంగా లక్ష్మీగూడ, గంధంగూడ, శంషాబాద్, కాటేదాన్ తదితర ప్రాంతాల్లో నిర్మించిన రాజీవ్‌గృహకల్ప, జేఎన్ఎన్‌యూఆర్ఎం నివాసాల నిర్మాణం పూర్తైన నేటికీ లబ్ధిదారులకు అప్పగించలేదు. కాటేదాన్‌లో ఏడాది క్రితం నిర్మించిన ఆసుపత్రి ఇంకా ప్రారంభం కాలేదు. ఇక శంషాబాద్, గండిపేట మండలాల పరిధిలో గ్రామజ్యోతి, ఇంటింటికి నల్లా నీరు, క్రీడా ప్రాంగణాలు, పూర్తిస్థాయి భూగర్భ మురుగునీటి వ్యవస్థ వంటి అనేక అభివృద్ధి పనులు పూర్తి కాలేదు. నియోజకవర్గం పరిధిలో పూర్తిస్థాయిలో ప్రభుత్వ ఆసుపత్రి లేకపోవడంతో ప్రజలు వైద్యసేవల కోసం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్ల విస్తరణ పనులను కూడా వెంటనే పూర్తిచేయాల్సిన అవసరముంది.సీసీ కెమెరాలే నేరాల నియంత్రణకు ప్రధానమని నమ్మే పోలీసులు అన్ని బస్తీలో నిరంతరం ప్రత్యేక పెట్రోలింగ్, నిఘాను పెంచాల్సిన అవసరం ఎంతైన ఉంది. రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలో అధికారుల నిర్లక్ష్యంతో పాటు రాజకీయ నాయకుల అండదండలతో ప్రభుత్వ భూములు, పార్కు స్థలాలు, స్మశానవాటికలు ఇతర ఖాళీ స్థలాలు కబ్జాదారుల పాలయ్యాయి. ఇక కొత్త ఏడాదిలో అయి నా అధికారులు అక్రమాలను అరికట్టడంతో పాటు అభివృద్ధికి పెద్దపీట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

రాజస్థాన్‌లో విద్యార్థినులకు ఉచిత కానుక

రాజస్థాన్ : రాజస్థాన్ ప్రభుత్వం విద్యార్థినులక ఉచిత కానుక ప్రకటించింది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి కళాశాల విద్యార్థినులకు ఉచితంగా శానిటరీ నాప్‌కిన్‌లు అందిస్తామని తెలిపింది. ఈ మేరకు అన్ని ప్రభుత్వ కళాశాలల్లో వెండింగ్ మిషన్లు ఏర్పాటు చేస్తామని పేర్కొంది. రాజస్థాన్‌లో మొత్తం 189 ప్రభుత్వ కళాశాలలు ఉన్నాయి. 2019 జులై నాటికి వీటన్నింటిల్లో శానిటరీ ప్యాడ్ వెండింగ్ మిషన్లు అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఉన్నత విద్యాశాఖ వెల్లడించింది. ఈ పథకాన్ని 2018 ఫిబ్రవరిలో అప్పటి ముఖ్యమంత్రి వసుంధరా రాజె ప్రకటించారు. మహిళల కోసం వాటిని ఉచితంగా అందించేందుకు వసుంధరాజే ఈ పథకాన్ని ప్రకటించారు. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు శానిటరీ నాప్కిన్స్ అందించేందుకు రూ.76 కోట్లు కూడా కేటాయించారు. కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేయనుంది.

రానున్న లోక్‌సభ ఎన్నికలు

జనం–కూటమి మధ్యే



(మొదటి పేజీతరువాయి) ఏళ్ల అనుభవం ఉన్న ప్రజలే న్యాయనిర్ణేతలు' అని మోదీ జవాబిచ్చారు. ఎజెండాను నిర్ణయించేది ఓటర్లేనని, ఓటర్ల తెలివిపై తనకు నమ్మకం ఉందని ఆయన అన్నారు. ఎవరు ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తారో, ఎవరు చేయరో అదే ప్రజల ఎజెండా అవుతుందన్నారు.

అవినీతి శక్తులకు వ్యతిరేకంగా ప్రజలిప్పటికే ఏకమయ్యారు

గతంలో అవినీతి వ్యవస్థీకృతమైన విషయం ప్రజలందరికీ తెలుసునని, రాష్ట్రాల్లో కూర్చున్న వ్యక్తులు రాష్ట్రాలను, కేంద్రంలో కూర్చున్న వ్యక్తులు కేంద్రాన్ని దోచుకున్నారని మోదీ ఆరోపించారు. అవినీతి శక్తులంతా ఏకతాటిపైకి వచ్చినప్పుడు వారి వెంట ఉండాలో వద్దో ప్రజలే నిర్ణయించుకుంటారని అన్నా రు. బీజేపీ వ్యతిరేక విపక్ష 'మహాకూటమి'పై మాట్లాడుతూ, ఇప్పటికీ వారు భిన్న గొంతులతో మాట్లాడుతున్నారని, వీళ్లంతా తమను తాము కాపాడుకునేందుకు ఒకరి వైపు మరొకరి ఆశగా చూస్తున్నవారేనని అన్నారు. 'చేతులు చేతులు కలపడం ఓ గేమ్. వీరందరి ఎజెండా మోదీనే. దేశానికి ఏదైనా చేయాలనేది మాత్రం కాదు' అంటూ మోదీ ఎద్దేవా చేశారు. విపక్ష నేతలంతా ఒకటి కావచ్చు కానీ, దాని అర్థం ప్రజలంతా వారితో కలిసి ఉన్నట్టు మాత్రం కాదని ఆయన తేల్చిచెప్పారు.

ట్రిపుల్ తలాక్, శబరిమల అంశాలు వేరువేరు

"ట్రిపుల్ తలాక్ ఆర్డినెన్స్ సుప్రీం కోర్టు తీర్పు తర్వాత తెచ్చాం. ఆర్డినెన్స్ ఆపేందుకు అనేక విధాలుగా ప్రయత్నాలు చేశారు. కోర్టుకు వెళ్లారు. ప్రజల మనోభావాలు గౌరవించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంటుంది. ప్రజలందరు కలిసి మెలసి జీవించాలి. ఎలాంటి ద్వేషభావం ఉండకూడదు. సబ్ కా సాథ్ సబ్ కా వికాస్ కు కట్టుబడి పురోగమిస్తున్నాం. దేవాలయానికి వెళ్తారా... గురుద్వారా కు వెళ్తారా అనవసరం. హింసాత్మక ప్రవృత్తిని ప్రభుత్వం సహించదు. భారత్ దేశంలో హింసకు తావుండ కూడదు. ఎన్నికల సమయంలోనే హింస గురించి ఆలోచించడం సరికాదు. ప్రపంచంలో ఇస్లామిక్ దేశాలు ట్రిపుల్ తలాఖ్ ను నిషేధించాయి. ఇది సాంప్రదాయం కాదు. సాంప్రదాయం అయితే ప్రపంచమంతా నడిచేది. పాకిస్తాన్ లో కూడా ట్రిపుల్ తలాఖ్ నిషేధించారు".

శబరిమల అంశం సాంప్రదాయానికి సంబంధించింది..

"ట్రిపుల్ తలాక్ లింగ సమానత్వానికి చెందిన అంశమైతే, శబరిమలలో మహిళల ప్రవేశం సంప్రదాయానికి సంబంధించిందని నా అభిప్రాయం. శబరిమల లో మహిళల ప్రవేశాన్ని సుప్రీం కోర్టు మహిళా న్యాయమూర్తి సైతం వ్యతిరేకించారు".

రుణ మాఫీతో రైతులందరికీ లబ్ధి జరగదు..

రుణాలు మాఫీ చేయడం ద్వారా ఎంత మంది రైతులకు లబ్ధి చేకూరుతుంది. ఎంత మంది రైతులు బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుంటారు. చాలా తక్కువ మంది మాత్రమే... ఎక్కువ శాతం వడ్డీ వ్యాపారుల వద్ద తీసుకుంటారు. అలాంటి రైతులే ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. వ్యవసాయ రంగాన్ని పరిపుష్టం చేసే దిశగా చర్యలు తీసుకుంటాం.

జీఎస్టీతో గందరగోళం నిజమే, చిన్న వ్యాపారులకు నష్టం జరిగింది

దేశవ్యాప్తంగా ఒకే విధమైన పన్నులు ఉండాలన్న నిర్ణయంతోనే జీఎస్టీ (గూడ్స్ సర్వీస్ ట్యాక్స్)ను అమల్లోకి తీసుకొచ్చాం. దీనిపై విపక్షాలు అనేక విమర్శలు గుప్పించాయి. అయినా, వెనక్కి తగ్గకుండా జీఎస్టీని దేశవ్యాప్తంగా అమల్లోకి తీసుకొచ్చాం. అంతకు ముందు పన్నులు ఎలా ఉండేవో ప్రజలు పరిశీలించాలి. తెలిసి వేసే పన్నులు, తెలియక వేసే పన్నులు ఉండేవని.. దీనివల్ల ప్రజలపై చాలా భారం పడేదని చెప్పారు. ఇప్పుడా పరిస్థితి లేదని స్పష్టం చేశారు. జీఎస్టీకి అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలు ఆమోదం తెలిపాయని మోదీ చెప్పారు. ఈ కౌన్సిల్లో అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలు భాగస్వాములుగా ఉంటాయని చెప్పారు. అయితే జీఎస్టీ వల్ల చిన్న వ్యాపారులకు ఇబ్బంది కలిగిన మాట వాస్తమేనన్నారు ప్రధాని మోదీ. ఈ విషయాన్ని అంగీకరించడంలో తమకెలాంటి భేషజం లేదన్నారు. ఈ అంశంపై కూర్చుని చర్చించుకోవాలని, పన్నులు సవరించుకోవాలని సూచించారు. ఇళ్ల నిర్మాణంపై జీఎస్టీని తగ్గించామని, రెస్టారెంట్లలో జీఎస్టీని తగ్గించామని గుర్తు చేశారు. ఇంత పెద్ద దేశంలో ఇలాంటి అంశాన్ని ఇంత తక్కువ సమయంలో విజయవంతంగా అమలు చేయడం గొప్ప విషయమన్నారు. జీఎస్టీపై కాంగ్రెస్ పార్టీ.. రాజకీయం కోసమే రాద్ధాం తం చేస్తోందని మోదీ విమర్శించారు. జీఎస్టీ అనేది కాంగ్రెస్ పార్టీ ప్రతిపాదనేనని, ప్రణబ్ ముఖర్జీ ఆర్థికమంత్రిగా ఉన్నప్పుడే.. దీన్ని అమల్లోకి తీసుకొ చ్చేందు కు ప్రయత్నించారని చెప్పారు. ఇప్పుడు రాహు ల్‌గాం ధీ, జీఎస్టీని గబ్బర్ సింగ్ టాక్స్ అని పిలవడం ఆయన వ్యక్తిగత అభిప్రాయమన్నారు. జీఎస్టీకి ముం దు సమ్మతం తెలిపి, ఆ తర్వాత వ్యతిరేకించడమంటే వారి నాయకత్వాన్ని వారే అవమానిం
చుకోవడమేన్నారు.

నోట్ల రద్దు హఠాత్తుగా తీసుకున్న నిర్ణయం కాదు..

పెద్ద నోట్ల రద్దు అంశంపై కూడా ఆయన క్లారిటీ ఇచ్చారు. పెద్ద నోట్ల రద్దు హఠాత్తుగా తీసుకున్న నిర్ణయం ఏమీ కాదని ప్రధాని నరేంద్రమోదీ తెలిపారు. ఇది ముందుగా తీసుకున్న నిర్ణయం ప్రకారమే జరిగిందని వెల్లడించారు. ఈ అంశంపై ఏడాది ముందు నుంచే ప్రజలకు సంకేతాలు ఇచ్చామని అన్నారు. ఎవరి దగ్గరైనా నల్లధనం ఉంటే ముందుగానే బ్యాంకుల్లో డిపాజిట్ చేయాలని తాను సూచించానని తెలిపారు. కొద్దిపాటి జరిమానాలు కడితే సరిపోతుందని చెప్పానని అన్నారు. అయితే అందరిలాగే తాను కూడా చేస్తానని చాలామంది భావించారని... కాబట్టి కొద్దిమం ది మాత్రమే ఈ విషయంలో ముందుకు వచ్చారని తెలిపారు. గతంలో దేశ ఆర్థిక వ్యవస్థను నల్లధనం కుంగదీసిందని, అందుకు పెద్ద నోట్లు రద్దు చేసినట్లు తెలిపారు.అవినీతి లేనందునే దొంగలు దేశం విడిచి పారిపోతున్నారని చెప్పారు. వారిని తిరిగి దేశానికి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. గత పాలకులే అధికారంలో ఉండి ఉంటే దేశంలో అవినీతి, అక్రమాలు ఇంకా కొనసాగేవన్నారు. అవినీతి, నల్లధనం నిర్మూలనకు తమ ప్రభుత్వం పలు చర్యలు తీసుకుందని వివరించారు. జీ20 దేశాల సదస్సులోనూ నల్లధనం నిర్మూలన గురించి చర్చించినట్లు గుర్తుచేశారు.

ఉర్జిత్ పటేల్ రాజీనామా ఆయన వ్యక్తిగత నిర్ణయం

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ పదవికి ఉర్జిత్ పటేల్ రాజీనామా చేయడం ఆయన వ్యక్తిగత నిర్ణయం అని ప్రధాన మంత్రి మోదీ అన్నారు. వాస్తవానికి కొన్ని నెలల ముందే ఉర్జిత్ పటేల్ వ్యక్తిగత కారణాలతో రాజీనామాకు సిద్ధమయ్యారని, చివరకు డిసెంబర్లో రాజీనామా చేశారని ఏఎన్ఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ఆయన రాజీనామాకు రాజకీయ ఒత్తిళ్లు లేవన్నారు.ఉర్జిత్ పటేల్ వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తానని చాలా సార్లు చెప్పారు. ఈ విషయాన్ని నేను మొదటిసారి బయటపెడ్తున్నా. 67 నెలల ముందు నుంచే రాజీనామా గురించి ఆయన మాట్లాడారు. ఆయన రాతపూర్వకంగానే ఈ విషయం తెలిపారు. వ్యక్తిగతంగా నాకు లేఖ రాశారు. ఆర్బీఐ గవర్నర్‌గా పటేల్ గొప్ప సేవలు అందించారు.

ఒక యుద్ధంతో పాకిస్తాన్ దారిలోకి రాదు

దాయాది దేశం పాకిస్థాన్ తీరును ఎండగట్టారు ప్రధాని నరేంద్ర మోదీ. ఒక యుద్ధంతో పాకిస్థాన్ దారిలోకి వస్తుందని భావించడం పొరబాటే అవతుందన్నారు. పాక్ గడ్డపై భారత సేనలు సర్జికల్ ఆపరేషన్ నిర్వహించాలన్న నిర్ణయం కఠినమైనదిగా పేర్కొన్నారు.

బీజేపీని ఇద్దరు నడుపుతున్న పార్టీ అనడం తప్పు

ప్రపంచంలో అతిపెద్ద రాజకీయ పార్టీగా బీజేపీ అవతరించిందని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. పార్టీని బూత్ స్థాయి నుంచి బలోపేతం చేస్తున్నట్లు చెప్పారు. బీజేపీని ఇద్దరు వ్యక్తులు నడుపుతున్న పార్టీగా విపక్షాలు చేస్తున్న విమర్శలను తిప్పికొట్టారు. బీజేపీ గురించి తెలియని వారే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని చెప్పారు.బీజేపీ కార్యకర్తలు ప్రస్తుతం పూర్తి విశ్వాసంతో ఉన్నారని అన్నారు.

ఐదు రాష్ట్రాల ఎన్నికలు నా పాలనకు రెఫరెండం కాదు..

గత నవంబర్, డిసెంబర్ ఎన్నికల్లో జరిగిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలపై ప్రధాని నరేంద్రమోదీ స్పందించారు. ఐదు రాష్ట్రాల్లోని తెలంగాణ, మిజోరాంలో బీజేపీ అధికారంలో లేదని వివరించిన ప్రధాని మోదీ... తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుందని తాము ఎప్పుడూ అనుకోలేదని స్పష్టం చేశారు. మిగిలిన మూడు రాష్ట్రాలైన రాజస్థాన్, చత్తీస్ గఢ్, మధ్యప్రదేశ్లో బీజేపీ అధికారంలో ఉండేదన్న మోదీ... చత్తీస్గఢ్‌లో తాము ఓడిపోయామని అంగీకరించా రు. అయితే రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో హంగ్ అసెంబ్లీ వచ్చిందని ఆయన గుర్తు చేశారు. మధ్యప్రదేశ్లో తాము 15 ఏళ్ల నుంచి అధికారంలో ఉన్నామని... అందుకే ప్రభుత్వ వ్యతిరేకతను ఎదుర్కోవాల్సి వచ్చిందని అన్నారు. అయితే ఈ ఫలితాలు తమ ప్రభుత్వ పాలనకు పూర్తిస్థాయి రిఫరెండం కాదన్నారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల తరువాత జరిగిన హర్యానా స్థానిక సంస్థల ఎన్నికలు, త్రిపురలో జరిగిన ఎన్నికల్లో తాము భారీ విజయం సాధించామని మోదీ గుర్తు చేశారు.

ఉత్తరాదే కాదు..దక్షిణాదిన కూడా విస్తరిస్తాం..

బీజేపీ ఉత్తర భారతదేశానికి చెందిన పార్టీ అనే అపవాదు ఎప్పుడో తొలగించుకుందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. అలాంటి భ్రమలను మీడియా కూడా వీడాలని ఆయన సూచించారు. దక్షిణ భారత దేశంలోని గోవా, కర్ణాటకలో కూడా బీజేపీ ప్రభుత్వాలను ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. బీజేపీ కేవలం అగ్ర వర్ణాల పార్టీ అనే నింద కూడా వేశారని... తనతో పాటు బీజేపీలోని అనే మంది ఎక్కడి నుంచో వచ్చారో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదన్నారు. బీజేపీ గ్రా మాల్లో ఉందని... పట్టణాల్లో ఉందని మోదీ తెలిపారు. తమిళనాడు మొదలుకుని జమ్మూ కశ్మీర్ వరకు బీజేపీ ఉందని స్పష్టం చేశారు. బీజేపీలో అన్ని వర్గాలకు చెందిన నాయకులు ఉన్నారు. తాము బలంగా ఉన్న రాష్ట్రాల్లో ఇతర పార్టీలతో కలిసి పని చేస్తామని... అదే రకంగా బలంగా లేని చోట కూడా ఇతర పార్టీలతో కలిసి పని చేస్తామని అన్నారు. అందరిని కలుపుకుని వెళ్లే విషయంలో తమకు ఎలాంటి అభ్యంతరాలు ఉండబోవని మోదీ అన్నారు.

కేసీఆర్ కూటమి గురించి తెలియదు



"కేసీఆర్ కూటమి ప్రయత్నాల గురించి నాకు తెలియదు. మహా కూటమి ఎందుకు ఏర్పాటవుతోంది? మహా కూటమి మోదీని దించేందుకు తప్ప..దేశం కోసం కాదు. ఎవరికి వాళ్లు కాపాడుకునే చర్యనే కూటముల ఏర్పాటు. వీళ్లంతా మోదీని నిందిస్తున్నారు. దేశం గురించి ఎవరూ మాట్లాడటం లేదు. మోది ప్రజల ఆశలకు అనుగుణంగా పని చేస్తున్నారు. ఆశలు, ఆకాంక్షలకు నెరవేర్చేవాళ్లను ప్రజలు ఆశీర్వదిస్తారు. తెలంగాణలో మహాకూటమి ఓడిపోయిన దేశమంతా తెలుసు.తెలంగాణలో కాంగ్రెస్ కూటమి ఏర్పాటు చేస్తే ఏం జరిగిందో అందరికీ తెలుసు. తెలంగాణలో కూటమికి తొలి ఎదురుదెబ్బ తగిలింది. నాయకులు కలిసినంతమాత్రాన ఓటర్లు కలవరని తేలిపోయింది. చంద్రబాబుకు తెలంగాణలో ఘోర పరాజయం ఎదురైంది. తెలంగాణలో ఓడిపోయామన్న ఆక్రోశంతోనే చంద్రబాబు ఆరోపణలు చేస్తున్నారు. చంద్రబాబు తెలంగాణను వ్యతిరేకించారు. అందుకే ఓడిపోయారు. అందుకే ప్రజలు బుద్ధి చెప్పారు. మనుగడ కోసం మహాకూటమి పేరుతో రాజకీయాలు చేస్తున్నారు.

న్యాయ ప్రక్రియ పూర్తి కాగానే రామ మందిరంపై నిర్ణయం

దేశంలో రగులుతున్న మరొక ప్రధాన అంశం అయోధ్యలో రామాలయ నిర్మాణంపై ప్రధాని నరేంద్ర మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. అయోధ్యలో రామాలయ నిర్మాణంపై దేశవ్యాప్తంగా జరుగుతున్న చర్చ, కోర్టుల తీర్పు నిర్ణయంలో జరుగుతున్న జాప్యానికి ప్రతిగా కేంద్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ తేవాలంటూ వస్తున్న డిమాండ్లపై ప్రధాని నరేంద్ర మోదీ తొలిసారి వ్యాఖ్యానించారు. లీగల్ ప్రక్రియ పూర్తికాగనే ఆర్డినెన్స్ అంశాన్ని పరిశీలిస్తామని చెప్పారు. ఏఎన్ఐకి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చిన ప్రధాని మోదీ...అయోధ్యలో రామాలయ నిర్మాణం కోసం ప్రత్యేక ఆర్డినెన్స్ తీసుకొస్తారా? అన్న ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. అయోధ్యలో రామాలయ నిర్మాణం విషయంలో న్యాయ ప్రక్రియ ముగిసిన తర్వాతే ఆర్డినెన్స్ తీసుకొచ్చే అంశాన్ని పరిశీలిస్తామన్నారు. అంటే అయోధ్య వివాదంలో సుప్రీంకోర్టు తీర్పుకు ముందుగా ప్రత్యేక ఆర్డినెన్స్ చేసే యోచన ప్రభుత్వానికి లేదని ప్రధాని మోదీ క్లారిటీ ఇచ్చారు.

కోర్టు కేసులు నెమ్మదించడానికి కాంగ్రెసే కారణం

న్యాయ ప్రక్రియ నెమ్మదిగా సాగడానికి కాంగ్రెస్ న్యాయవాదులు సుప్రీంకోర్టులో ఆటంకాలు కల్పించడమే కారణమని మోదీ ఆరోపించారు. 'రాజ్యాంగ పరిధిలో సమస్యకు పరిష్కారం కనుగొంటామని బీజే పీ మేనిఫెస్టోలో మేము చెప్పాం' అని అన్నారు. సుప్రీంకోర్టు విచారణ ముందు రామాలయం అంశం ఉంద ని, అది తుది దశకు చేరుకునే అవకాశాలున్నాయని చె ప్పారు. జ్యుడిషియల్ ప్రక్రియ పూర్తికాగానే ప్రభు త్వం పరంగా తమపై ఎలాంటి బాధ్యతలు ఉన్నాయో ఆ బాధ్యతలు పూర్తి చేసేందుకు, తగిన చర్యలు తీసుకునేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ప్రధాని స్పష్టం వివరించారు.

సర్జికల్ దాడులు నా జీవితంలో ఉద్విగ్న క్షణాలు..

'ఆపరేషన్ విజయవంతమైనా, విఫలమైనా సూర్యోదయానికి ముందే వెనక్కి రావాలి'. ఇండియన్ ఆర్మీ ప్రత్యేక కమెండోలకు 2016 సెప్టెంబర్ 28న ఎల్ ఓసీ వెంబడి పాక్ ఉగ్ర స్థావరాలపై సర్జికల్ దాడుల సందర్భంగా ప్రధాని మోదీ ఇచ్చిన సందేశమిది. ఇంటర్వ్యూలో తొలిసారి సర్జికల్ దాడులపై మోదీ పెదవి విప్పారు. భద్రతా దళాల భద్రతను దృష్టిలో ఉంచుకుని సర్జికల్ దాడుల తేదీల్లో రెండుసార్లు మార్పులు చేసినట్టు చెప్పారు. ఉరిలో చోటుచేసుకున్న ఉగ్రదాడుల్లో సైనికులు సజీవసమాధి కావడంతో సైన్యంలో ఉద్వేగం పెల్లుబుకిందని, తాను సైతం ఉగ్వేగానికి గురయ్యానని అన్నారు. ఆ నేపథ్యంలోనే సర్జికల్ దాడుల వ్యూహం రూపొందిందని చెప్పారు...

"విజయం సాధించినా, వైఫల్యమే ఎదురైనా పట్టించుకోను. సూర్యోదయానికి ముందే వెనక్కి వచ్చేయాలి అని సైన్యానికి స్పష్టమైన ఆదేశాలిచ్చాను" అని మోదీ పేర్కొన్నారు. ఈ ఆపరేషన్లో మన సైనికులెవరూ మరణించకూడదనే స్థిరనిశ్చయం కారణంగానే తాను ఆపరేషన్ విఫలమైనా గడువు మాత్రం పొడిగించకుండా ముగించుకుని రావాలని కోరడం జరిగిందన్నారు. ""సర్జికల్ స్ట్రైక్స్ అనే ఆపరేషన్ చాలా రిస్క్‌తో కూడిందని నాకు తెలుసు. రాజకీయ రిస్క్ గురించి నేనెప్పుడూ పట్టించుకోను. అయితే సర్జికల్ దాడుల విషయంలో మాత్రం ఆపరేషన్ సక్సెస్, వైఫల్యాలతో సంబంధం లేకుండా సైనికుల భద్రత విషయానికే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చాను" అని మోదీ తెలిపారు. "ఆ రోజు ఉదయం ఒక గంటపాటు సమాచారం ఆగిపోయింది. దాంతో నాలో ఆతృత పెరిగిపోతూ వచ్చింది. సూర్యోదయమైన గంట తర్వాత కూడా నా పరిస్థితిలో మార్పు రాలేదు. రెండు నుంచి మూడు యూనిట్లు సురక్షిత జోన్లోకి వచ్చినా ఆపరేషన్లో పాల్గొన్న అందరూ అప్పటికి ఇంకా వెనక్కి రాలేదు. ఆపరేషన్ పూర్తయి అంతా సురక్షితంగా వెనక్కి వచ్చేంతవరకూ నేను ఊపిరిపీల్చుకునేది లేదని చెప్పా" అంటూ మోదీ అప్పటి ఉద్విగ్న పరిస్థితిని వివరించారు.

లోక్‌సభపై అనాసక్తి
పోటీకి జంకుతున్న బీజేపీ నేతలు

(మొదటి పేజీతరువాయి) మేనేజ్‌మెంట్‌తో పాటు చేసిన ఖర్చును గమనించిన బీజేపీ నేతలు హడలిపోయారు. కేసీఆర్ పోల్ మేనేజ్‌మెంట్‌ను బీజేపీ సహా ఏ పార్టీ కూడా పసిగట్టలేక పోయిన సంగతి తెలిసిందే. అదే తరహాలో లోక్‌సభ ఎన్నికల్లోనూ కేసీఆర్ ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారని ప్రచారం జరుగుతోంది. తాము కచ్చితంగా 16లోక్‌సభ స్థానాలు గెలిచి తీరుతామని ప్రకటిస్తోంది. టీఆర్ఎస్ చేస్తున్న ప్రచారాన్ని గమనిస్తున్న బీజేపీ నేతలు.. ఓడిపోవడానికి పోటీ చేయడమెందుకని వ్యాఖ్యానిస్తున్నారు. గతంలో ఇతర పార్టీలకు చెందిన వారు ఎన్నికల సమయంలో పోటీ చేయడానికి బీజేపీలో చేరడానికి ప్రయత్నాలు చేశారు. ఈసారి మాత్రం బయటివారు వచ్చే అవకాశాలు ఎంత మాత్రం లేవు. ఉన్నవారు కూడా పోటీ చేయడానికి జంకుతున్నారు.

సికింద్రాబాద్ మినహాయింపు.?

ఒక్క సికింద్రాబాద్ లోక్‌సభ స్థానంలో పోటీ చేయడానికి బీజేపీ ముఖ్య నేతలు ఆసక్తి చూపుతున్నట్టు సమాచారం. గతంలో ఈ స్థానంలో పోటీ చేయడానికి చివరి నిమిషంలో పార్టీ మాజీ అధ్యక్షుడు జి. కిషన్‌రెడ్డి ఆసక్తి చూపినా.. దత్తాత్రేయకు అవకాశమిచ్చారు. అంబర్‌పేట నియోజవకర్గంలో ఓడిపోయిన కిషన్‌రెడ్డి ఈసారి సికింద్రాబాద్ లోక్‌సభ స్థానంలో పోటీ చేయడానికి ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తోంది. పార్టీ అధ్యక్షుడు కె. లక్ష్మణ్ కూడా ఇదే స్థానంపై దృష్టి సారించినట్టుగా పార్టీలో ప్రచారం జరుగుతోంది.

మోగిన పంచాయతీల నగారా

(మొదటి పేజీతరువాయి) 7గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతుందని, అదే రోజు ఓట్ల లెక్కింపు పూర్తిచేసి ఫలితాలు ప్రకటిస్తామని నాగిరెడ్డి వివరించారు. ఈ ఎన్నికలు బ్యాలెట్ ద్వారానే నిర్వహించనున్నారు. బ్యాలెట్ పేపర్‌లో నోటా గుర్తు ఉంటుంది. వార్డు మెంబర్ల ఓట్ల లెక్కింపు పూర్తయిన తర్వాత సర్పంచ్ అభ్యర్థుల ఓట్లు లెక్కించనుంది. మంగళవారం నుంచి రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందని నాగిరెడ్డి ప్రకటించారు. పంచాయతీ ఎన్నికలను తొలి విడతలో 4480 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరగనున్నాయి. రెండో విడతలో 4137 పంచాయతీలకు, మూడో విడతలో 4115గ్రామపంచాయతీలకు పోలింగ్ నిర్వహించనున్నది. గ్రామ సర్పంచులుగా పోటీ చేసిన అభ్యర్థులు (జనరల్) స్థానాల్లో రూ.2000, రిజర్వుడు కేటగిరీ కింద రూ.1000, వార్డు మెంబర్ (జనరల్) రూ.500, రిజర్వుడు అభ్యర్థి అయితే రూ.250 చొప్పున ధరావత్తుగా చెల్లించాల్సి ఉంటుంది. ఎన్నికల ఖర్చుకు పరిమితి ఎన్నికల సంఘం విధించింది. 5వేల జనాభా దాటిన గ్రామ పంచాయతీల్లో పోటీ చేసే అభ్యర్థులు రూ.2.50లక్షలు, వార్డు మెంబర్లు రూ.50 వేలు మించి ఖర్చు చేయరాదని, 5వేలు కంటే తక్కువ జనాభా కలిగిన గ్రామ పంచాయతీల్లో పోటీ చేసే అభ్యర్థులు తమ ఖర్చును రూ.1.50లక్షలు, వార్డు మెంబర్లు రూ.30వేలుగా నిర్ణయించినట్టు నాగిరెడ్డి వెల్లడించారు. ఎన్నికల సంఘం నిర్ధేశించిన పరిమితి కంటే ఎక్కువగా ఖర్చుచేస్తే సర్పంచు, వార్డు మెంబర్లు తమ పదవులను కోల్పోవాల్సి వస్తుంది. అన్ని రాజకీయ పార్టీలకు ఓటర్ల జాబితాలను పంపిణీ చేయనున్నట్లు ప్రకటించారు.

ఫలితాల నాడే ఉపసర్పంచ్ ఎన్నిక

గ్రామ పంచాయతీలకు మధ్యాహ్నం వరకూ పోలింగ్ పూర్తికాగానే సాయంత్రంలోగా ఓట్ల లెక్కింపు పూర్తి చేసి ఫలితాలను ప్రకటించనున్నారు. ఈ ప్రక్రియ పూర్తికాగానే అదే రోజు ఉప సర్పంచ్ ఎన్నిక జరగనున్నది. ఫలితాల రోజున ఎన్నికైన వార్డు మెంబర్లు చేతులెత్తి ఉప సర్పంచ్‌ను ఎన్నుకుంటారు. గతంలో ఉప సర్పంచ్ ఎన్నికకు చాలా జాప్యం జరిగేది. సర్పంచ్ ఫలితాలు ప్రకటించిన వారం రోజులకు కూడా ఎన్నిక చేయకుండా కాలయాపన చేసిన సంఘటనలు అనేకం ఉన్నాయి. నూతన పంచాయతీరాజ్ చట్టం ప్రకారం గ్రామ సర్పంచ్‌తో పాటు ఉప సర్పంచ్‌కు జాయింట్ చెక్ పవర్‌ను కల్పించింది. దీంతో ఉప సర్పంచ్ ఎన్నిక కూడా సర్పంచ్ ఫలితాల రోజే పూర్తి చేయాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది.

తొలివిడత

ఈ నెల 7న నోటీస్ ఇవ్వనున్న రిటర్నింగ్ అధికారులు

- 7 నుంచి 9 వరకు నామినేషన్ల స్వీకరణ
- 10న నామినేషన్ల పరిశీలన
- 11న ఆర్డీవోలకు అప్పీలు చేసేందుకు అవకాశం
- 12న ఆర్డీవోలతో అప్పీలు పరిష్కారం
- 13న నామినేషన్ల ఉపసంహరణ
- 21 పోలింగ్, ఓట్ల లెక్కింపు

రెండో విడత ఎన్నికలు

11న నోటీస్ ఇవ్వనున్న రిటర్నింగ్ అధికారులు

- 11 నుంచి 13 వరకు నామినేషన్ల స్వీకరణ
- 14న నామినేషన్ల పరిశీలన
- 15న ఆర్డీవోలకు అప్పీలు చేసేందుకు అవకాశం
- 16న ఆర్డీవోలతో అప్పీలు పరిష్కారం
- 17న నామినేషన్ల ఉపసంహరణ
- 25న పోలింగ్, ఓట్ల లెక్కింపు

మూడో విడత ఎన్నికలు

16న నోటీస్ ఇవ్వనున్న రిటర్నింగ్ అధికారులు

- 16 నుంచి 18 వరకు నామినేషన్ల స్వీకరణ
- 19న నామినేషన్ల పరిశీలన
- 20న ఆర్డీవోలకు అప్పీలు చేసేందుకు అవకాశం
- 21న ఆర్డీవోలతో అప్పీలు పరిష్కారం
- 22న నామినేషన్ల ఉపసంహరణ
- 30 పోలింగ్, ఓట్ల లెక్కింపు

మూడు విడతల్లో పోలింగు వివరాలు

క్రమ సంఖ్య	మండలాలు	పంచాయతీలు	వార్డు మెంబర్లు
తొలివిడత	197	4480	39832
రెండో విడత	172	4137	36620
చివరి విడత	166	4115	36718
మొత్తం	535	12,732	113170

తెలంగాణ హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా
జస్టిస్ రాధాకృష్ణన్ ప్రమాణ స్వీకారం

(మొదటి పేజీతరువాయి) స్థాయి అధికారులను, 51 మంది సహాయ అధికారులను, 13 మంది డిప్యూటీ సెక్షన్ స్థాయి అధికారులను, 36 మంది అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్లు, ఏడుగురు ఎగ్జామినర్ క్యాడర్ అధికారులను ఏపీ హైకోర్టుకు డిప్యూటేషన్‌పై పంపారు. ఇంతేకాకుండా 67 మంది అసిస్టెంట్ క్యాడర్ పోస్టులు, 151 ఆఫీస్ సబార్డినేట్ క్యాడర్ పోస్టుల్లోని వారి తెలంగాణ రాష్ట్రంలోని సబార్డినేట్ కోర్టుల్లో పనిచేయాలని ఉత్తర్వులు జారీ అయ్యాయి. డిప్యూటేషన్‌పై ఏపీ హైకోర్టుకు వెళ్లిన వారి సర్వీసులకు అనుగుణంగా తగిన పోస్టుల్లో నియామకాలు జరుగుతాయి. వీరంతా వారి క్యాడర్ పోస్టులు ఖాళీ అయినప్పుడు తిరిగి తెలంగాణ రాష్ట్రానికి వస్తారు. గతంలో ఉన్న మార్గదర్శకాలకు అనుగుణంగా పోస్టుల భర్తీ జరుగుతుంది.

దేశాన్ని నాశనం చేసిన మోడీ

(మొదటి పేజీతరువాయి) మేలు చేసేందుకు 50 శాతం ఆదాయం పెంచుతామన్నారు. వ్యాపారవకాశాలను పెంచేందుకు సరళీకరిస్తామని జీఎస్టీ అమలు చేసి మరింత కఠినతరం చేశారు. నోట్ల రద్దుతో బ్లాక్ మనీని వైట్ మనీగా మార్చారు. ప్రజలను ఇబ్బందుల పాలు చేసి బడాబాబులకు మేలు చేశారన్నారు. జాతీయ భద్రత పణంగా పెట్టడంతో వందలాది మంది ప్రాణాలు కోల్పోయారని, గాయాలపాలయ్యారన్నారు. అవినీతి పెచ్చు మీరిందని ఆయన విమర్శించారు. రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలు ఒప్పందంలో రూ.38 వేల కోట్లకు పైగా అవినీతి జరిగింద న్నారు. తప్పు జరిగకుంటే పార్లమెంటరీ సంయుక్త కమిటీ వేయడానికి ఎందుకు వెనుకడుగు వేశారు. గంగానది ప్రక్షాళన అన్నారే తప్ప ఆ నది నిండా ఇంకా కాలుష్యం ఉందని కేంద్ర కాలుష్య ని యంత్రణ మండలే చెబుతుందన్నారు.

ఏదో చేయబోతున్నట్టు స్టార్టప్ ఇండియా, స్కిల్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా అంటూ ఊదరగొట్టిన మోడీ ఇప్పుడు ఆ ఊసేందుకు మరిచారో చెప్పాలన్నారు. అంతర్జాతీయంగా ధరలు తగ్గినా పెట్రోల్, ఇతర ఇంధనాల ధరలు ఎందుకు పెరిగాయని ఆయన ప్రశ్నించారు. మోదీ చెప్పిన మంచి రోజులంటే ఇవేనా అని ఆయన నిలదీశారు.


మార్చికల్లా కాళేశ్వరం పూర్తి...



(మొదటి పేజీతరువాయి) పరిశీలించిన కేసీఆర్, మట్టిపని రివిట్ మెంట్ పనులను పూర్తి జలాశయ మట్టం దాకా పూర్తి చేయాలని సూచించారు. మేడిగడ్డ బ్యారేజ్ గేట్ల ఏర్పాటు పనులను, గేట్లను ఆపరేట్ చేసే విధానాన్ని పరిశీలించారు. మేడిగడ్డ బ్యారేజికి సంబంధించిన రాఫ్ట్ ఫౌండేషన్ పనులను జనవరి నెలాఖరు లోపల పూర్తి చేయాలని సీఎం సూచించారు. మేడిగడ్డ బ్యారేజ్ కాంక్రిటు వర్క్ రోజుకు 10 వేల క్యూబిక్ మీటర్లకు తగ్గకుండా చేయాలని వర్కింగ్ ఏజెన్సీని ఆదేశించారు. కన్నేపల్లి పంపు హౌస్ ఫోర్ బే, హెడ్ రేగ్యులేటర్ పనులను పరిశీలించిన సందర్భంగా, హెడ్ రేగ్యులేటర్ పనుల్లో ఉన్న సాంకేతిక లోపలను సవరించాలని సూచించారు.

నిధుల కొరత లేదు–నిర్మాణ పనుల్లో రాజీ పడొద్దు

నిధుల పరంగా ఎలాంటి ఇబ్బంది లేదని ప్రాజెక్టు పనులు వేగంగా పూర్తిచేసే విషయంలో ఏమాత్రం రాజీపడవద్దని సీఎం సూచించారు. రాష్ట్రంలో ప్రజలు గత ఎన్నికల్లో భారీ మెజార్టీతో మళ్ళీ టీఆర్ఎస్ ప్రభుత్వానికి పట్టం కట్టారని, సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రభుత్వం కూడా చిత్తశుద్ధి చాటుకుంటుందని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు పనులను సీఎంవో సెక్రటరీ ప్రతి పది రోజులకు ఒకసారి పర్యవేక్షిస్తారని సీఎం తెలిపారు. సబ్ స్టేషన్ పనులను పూర్తిచేయాలని ట్రాన్స్ కో సీఎండీ ప్రభాకర్ రావును సీఎం ఫోన్ లో ఆదేశించారు. ముఖ్యమంత్రి వెంట చీఫ్ సెక్రటరీ ఎస్.కె. జోషీ, డీజీపీ మహేందర్ రెడ్డి, ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యేలు వేముల ప్రశాంత్ రెడ్డి, దివాకర్ రావు, శ్రీధర్ బాబు, టీఎస్ ఎండీసీ ఛైర్మన్ శేరి సుభాష్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు వివేక్, సీఎం సెక్రటరీ స్మితా సబర్వాల్, భూపాలపల్లి జిల్లా కలెక్టర్ వాసం వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి, మాజీ ఎంపీ వివేక్, మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు, నీటి పారుదల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ వి. ప్రకాష్, ఐడీసీ ఛైర్మన్ ఈద శంకర్ రెడ్డి, ఇంజనీరింగ్ ఇన్ చీఫ్ మురళీధర్ రావు, సీఈ వెంకటేశ్వర్లు, సీఎం ఓఎస్ డి శ్రీధర్ రావు దేశ్ పాండే, లిఫ్ట్ సలహాదారు పెంటారెడ్డి, ఎల్ అండ్ టి సీఎండి సుబ్రామ్మణ్యన్, మెగా ఎండీ కృష్ణారెడ్డి, డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.



రాష్ట్ర ప్రభుత్వం
బీసీలను నమ్మించి మోసం చేసింది

(మొదటి పేజీతరువాయి) మంగళవారం నోటిఫికేషన్ విడుదల చేయాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. బీసీలపై చిత్తశుద్ధి లేదని వారు విమర్శించారు. బీసీలకు న్యాయం జరిగేంతవరకూ ఎట్టి పరిస్థితుల్లోనూ ఉద్యమాన్ని ఆపే ప్రసక్తి లేదని, టీఆర్ఎస్‌ను ప్రజల్లో దోషిగా నిలబెట్టి రిజర్వేషన్లు రక్షించుకుంటామని వారు వెల్లడించారు. బీసీలకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రజాక్షేత్రంలోకి తీసుకెళ్తామన్నారు. సంచార జాతుల వారికి ఈ నోటిఫికేషన్ నిరాశే మిగిల్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం హైదరాబాద్‌లో బీసీ సంఘాల ఆధ్వర్యంలో సమావేశాన్ని ఏర్పాటు చేసుకుని భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామని వెల్లడించారు. ఈ సమావేశంలో మాజీ ఐఆర్ఎస్ అధికారి పీ.ఎస్.ఎస్. మూర్తి, ప్రొఫెసర్లు వెంకటేశం, తిరుమలి, రామకృష్ణయ్య, శివ, రంజిత్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీలో వణికిస్తున్న చలి

విజయక్రాంతి, భద్రాచలం: భద్రాచలం ఏజెన్సీని చలి వణికిస్తోంది. పెథాయ్ తుఫాన్ వచ్చినప్పటి నుంచి మన్యంలో ఉష్ణోగ్రతలు బాగా తగ్గాయి. చలికితోడు ఈదురుగాలులు కూడా వీస్తుండటంతో పిల్లలు, వృద్ధులు చలికి తట్టుకోలేకపోతున్నారు. గతంలో ఎన్నడూ ఇంత చలిని చూడలేదని పెద్దలు చెబుతున్నారు. పొద్దుపోకుండానే చలిమంటలు వేసుకొంటున్నారు. తీవ్ర చలి ప్రభావం ఈ ఏడాది న్యూ ఇయర్ వేడుకలపై పడింది. ఉదయం మంచు దుప్పటి కప్పుకొంటోంది. రోజురోజుకి ఏజెన్సీలో ఉష్ణోగ్రతలు తగ్గడంతో మన్యంవాసులు ఆందోళన చెందుతున్నారు. బడికిపోయే చిన్నారులు తీవ్ర చలికి ఇబ్బందులు పడటమే కాకుండా అనారోగ్యంబారిన పడుతున్నారు. ఆలస్యంగా వ్యాపార దుకాణాలు తెరిచి, పొద్దు పోతుండగానే చలికి తట్టుకోలేక మూసివేస్తున్నారు. రగ్గులు, దుప్పట్లు, స్వెట్టర్లు, మఫ్లర్స్ వంటి చలి రక్షణ సరంజామా లేకుండా ప్రయాణాలు చేయడం కష్టంగా ఉంది.



‘జిల్లా సమాఖ్య’లో మొక్కలు నాటిన కలెక్టర్

విజయక్రాంతి, మానకొండూర్: తిమ్మాపూర్ మండల కేంద్రంలోని డీఆర్‌డీఏ జిల్లా సమాఖ్యకు చెందిన ఖాళీ స్థలంలో కలెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్ మంగళవారం మొక్కలు నాటారు. గతంలో జిల్లా సమాఖ్యకు తిమ్మాపూర్ మండల కేంద్రంలో దాదాపు 23గుంటల స్థలాన్ని కేటాయించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ వెంకటేశ్వర్ రావు, డీఎఫ్ఓ శ్రీనివాసరావు, డీపీఎం ఎస్ వెంకటరమణ, ఎంపీపీ బూడిద ప్రేమలత, జడ్పీటీసీ ఉల్లెంగుల పద్మ, వైస్ ఎంపీపీ పొన్నాల భూలక్ష్మి, స్వచ్ఛ భారత్ జిల్లా కో ఆర్డినేటర్ కిషన్‌స్వామి, ఎస్‌బీహెచ్ రిసెట్ డైరెక్టర్ దత్తాద్రి, ఎంపీడీఓ హరిప్రియ, ఏపీఓ రాధ, ఏపీఎం రాంమోహన్, జిల్లా సమాఖ్య ప్రతినిధులు రేణుక, మమత, సుజాత తదితరులు పాల్గొన్నారు.

నేడు కోరుట్లకు ముఖ్యమంత్రి రాక..

విజయక్రాంతి, కోరుట్ల: రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు బుధవారం జగిత్యాల జిల్లా కోరుట్ల నియోజకవర్గానికి రానున్నారు. సెగ్మెంట్‌లోని రాజేశ్వర్‌రావుపేట శివారులో నిర్మిస్తున్న కాళేశ్వరం రివర్స్ పంపింగ్ వాటర్ సిస్టమ్ పంప్‌హౌజ్ పనులను పరిశీలించేందుకు కేసీఆర్ వస్తున్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కాళేశ్వరం రివర్స్ పంపింగ్ వాటర్ సిస్టమ్ ఏర్పాటులో భాగంగా మల్యాల మండలం రాంపూర్‌లో, ఇబ్రహీంపట్నం మండలం రాజేశ్వర్‌రావుపేటలో, బాల్కొండ నియోజకవర్గంలో పంప్‌హౌజ్‌లు నిర్మిస్తున్నారు. నీటి ఎద్దడి సమయంలో కాళేశ్వరం ప్రాజెక్ట్ నీటిని ఈ పంప్‌హౌజ్‌ల ద్వారా లిఫ్ట్‌చేసి ఎస్సారెస్పీకి తరలించి ఎస్సారెస్పీ ఆయకట్టుకు అందించే యోచనతో ఈ పథకం రూపుదిద్దుకున్నది. అయితే నిర్మాణ పనులను పరిశీలించే నేపథ్యంలో సిఎం పర్యటన గతంలో సైతం ఖరారైనప్పటికీ అనివార్య కారణాలవల్ల వాయిదా పడింది. మంగళవారం కరీంనగర్ జిల్లా కేంద్రానికి చేరుకోనున్న సిఎం బుధవారం మొదట మల్యాల పంప్‌హౌజ్ పనులు చూసి, తదుపరి కోరుట్ల సెగ్మెంట్‌కు రానున్నారు. కాగా సీఎం రాక సందర్భంగా సంబంధిత అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసి సమీక్షిస్తున్నారు.



ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

విజయక్రాంతి, సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. సంవత్సరం ముగిస్తున్నందున సోమవారం అర్ధరాత్రి వరకు యువకులు పట్టణంలోని వివిధ వార్డులలో యువకులు మ్యూజిక్ సిస్టంతో సందడి చేశారు. రోడ్లపై తిరుగుతూ కేరింతలు కొడుతూ నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తును నిర్వహించారు. ఎప్పటి కప్పుడు జిల్లా ఎస్పి రాహుల్ హెగ్డే గస్తీ నిర్వహిస్తు పరిస్థితులపై సమీక్షించి పోలీసులను అప్రమత్తం చేశారు. స్తానిక అంబేడ్కర్ చౌక్ వద్ద పోలీసులు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఎస్పీ, ట్రైనీ కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం కేక్‌ను సిబ్బందికి అందిస్తు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ వెంకటరమణ, ఎస్‌ఐ శేఖర్ తదితర సిబ్బంది ఉన్నారు.



ప్రజలకు మరింత మేలు జరగాలి

- కలెక్టర్ శ్రీదేవసేన

విజయక్రాంతి, పెద్దపల్లి: కొత్తసంవత్సరంలో ప్రజలకు మరింత మేలు చేసే విధంగా అధికారులు కృషిని కొనసాగించాలని జిల్లా కలెక్టర్ శ్రీదేవసేన పేర్కొన్నారు. పెద్దపల్లి కలెక్టర్ శ్రీదేవసేనను మంగళవారం జిల్లాలోని పలువురు అధికారులు, ప్రముఖులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేయాలని కోరారు. పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు. అలాగే పెద్దపల్లి నియోజకవర్గంలో గ్రామగ్రామాన, వీదివీదిన నూతన సంవత్సర వేడుకలను నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. రాత్రి ఇలాంటి అవంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసు అధికారులు, సిబ్బంది. గస్తీని ముమ్మరం చేశారు.



మహిళా స్వావలంబనే ప్రభుత్వ లక్ష్యం

- ప్రభుత్వం అందిస్తున్న పథకాలతో మహిళలు అన్ని రంగాల్లో ప్రతిభ

విజయక్రాంతి, సూర్యాపేట: బంగారు తెలంగాణలో ఆడబిడ్డలు సుఖసంతోషాలతో, ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారిత పథకాలను ప్రవేశపెడుతుందని సూర్యాపేట శాసన సభ్యులు గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంనందు సూర్యాపేట నియోజకవర్గ పరిధిలోని 101 మంది లబ్దిదారులకు రూ. 89లక్షల విలువ గల కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్‌తో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సూర్యాపేట శాసన సభ్యులు గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి కళ్యాణలక్ష్మి, షాదీ ముభారాక్ లబ్దిదారులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి మాట్లాడుతూ.. ప్రపంచంలో ఏ రాష్ట్రంలో లేని ఆలోచన చేసి ముఖ్యమంత్రి కేసిఆర్ కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ఆడపిల్ల పెళ్లి చేస్తే అప్పు చేసి ఆర్థిక భారాలు మోయలేక ఆత్మహత్యలు చేసుకోవడం గమనించిన ముఖ్యమంత్రి కేసిఆర్ ఏ ఇంట్లో ఆడ పిల్ల పుట్టిన ప్రభుత్వం సాయం అందించేలా పథకాలను ప్రవేశ పెట్టడం జరిగిందని వివరించారు. ప్రస్తుతం పెళ్ళిళ్ళు భారమై ఖర్చులు పెరిగినందున ప్రభుత్వ సాయాన్ని ఈ ఆర్థిక సంవత్సరం నుంచి రూ. 1లక్ష 116లు పెంచడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ డి. సంజీవరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వై. వెంకటేశ్వర్లు, ఆర్‌డిఓ మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

మంథని నియోజకవర్గ ఆయకట్టుకు కాళేశ్వరం నీళ్లు అందించాలి..!

- చిన్న కాళేశ్వరాన్ని పూర్తి చేయాలి, భూ నిర్వాసితులకు డబుల్ బెడ్‌రూం ఇండ్లు ఇవ్వాలి..!
- మంథనికి పీజీ కళాశాల, బీఎస్‌సీ నర్సింగ్ కాలేజీ మంజూరు చేయాలి..!
- సీఎం కేసీఆర్‌ను కలిసి వినతి పత్రాలను సమర్పించిన మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు




విజయక్రాంతి, మంథని: కాళేశ్వరం ప్రాజెక్టు నీళ్లని మంథని నియోజకవర్గంలోని ఆయకట్టుకు మొదటగా అందించాలని మంథని కాంగ్రెస్ ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సీఎం కేసీఆర్‌ను కోరారు. కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శనలో భాగంగా మంగళవారం మేడిగడ్డకు వచ్చిన సీఎం కేసీఆర్‌ను కలిసిన శ్రీధర్‌బాబు వెనుకబడిన మంథని నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. ఎస్సారెస్పీ చివరి ఆయకట్టు, కొత్త ఆయకట్టు కలుపుకోని మొత్తం 18 లక్షల ఎకరాలకు కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి సాగునీరు అందించే విధంగా అన్నారం బ్యారేజీ వద్ద, సుందిల్ల బ్యారేజీ వద్ద మినీ ఎత్తిపోతల పథకాలు, కెనాల్స్ నిర్మించాలని కోరారు. మంథని నియోజకవర్గానికి ఒక పీజీ కళాశాల, బీఎస్‌సీ నర్సింగ్ కళాశాలను ఏర్పాటు చేయాలని కోరారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందుల దృష్ట్యా కాటారం రెవిన్యూ డివిజన్ కేంద్రంగా చేయాలని, కాళేశ్వరం, గుంజపడుగు గ్రామాలకు మండలాలుగా ఏర్పాటు చేయాలన్నారు.

నిర్వాసితులకు నష్టపరిహారం అందించాలి..

పెద్ద కాళేశ్వరంతో పాటు చిన్న కాళేశ్వరం ప్రాజెక్టును సైతం పూర్తి చేసి, రెండు, మూడు నెలల్లో ప్రారంభించుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కాళేశ్వరం భూనిర్వాసితులందరికి సమానంగా నష్టపరిహారం ఇవ్వడంతో పాటు భూ నిర్వాసితులకు డబుల్ బెడ్‌రూం ఇండ్లు మంజూరు చేయాలని శ్రీధర్‌బాబు సీఎం కేసీఆర్‌ను కోరారు. ఇసుక లారీలతో రోడ్లు ధ్వంసం కావడంతో పాటు భూగర్భ జలాలు అడుగంటి బోరు, బావుల్లో నీరు లేక ఇటు పంటలకు, అటు తాగేందుకు నీరు దొరకని పరిస్థితులు నెలకొంటున్నాయని, ఇసుక లారీలను అదుపు చేయాలని కోరారు. తమ విన్నపాలకు సీఎం కేసీఆర్ సానుకూలంగా స్పందించినట్లు మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు ఈ సందర్భంగా తెలిపారు.

కరీంనగర్ కమిషనరేట్‌లో హైవే పెట్రోలింగ్ వాహనాలు ప్రారంభం

విజయక్రాంతి, కరీంనగర్: కరీంనగర్ కమిషనరేట్‌లో హైవే పెట్రోలింగ్ వాహనాలను పోలీస్ కమిషనర్ వి.బి కమలాసన్‌రెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్ మంగళవారం ప్రారంభించారు. హైవే పెట్రోలింగ్ నిర్వహణకు కరీంనగర్‌కు మూడు వాహనాలు మంజూరు కాగా వాటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు రహదారి నియమాలను తప్పకుండా పాటించాలని అన్నారు. రహదారి నిబంధనలు పాటించక వాహనాలను అతివేగంగా అజాగ్రత్తగా నడపటం వల్లనే ఎక్కువ శాతం ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. వాహనదారుల రక్షణ కోసం సీటు బెల్ట్, హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. పోలీసుల తనిఖీ సందర్భంగా పట్టుకుంటారనే భయంతోనే తనిఖీలు ఉన్న ప్రాంతాల్లో సీటుబెల్ట్, హెల్మెట్‌లను ధరిస్తున్నారని ఇది సరైంది కాదని తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణకోసం పోలీసులు తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని అన్నారు.



పోలీస్ కమిషనర్ కమలాసన్‌రెడ్డి మాట్లాడుతూ పెట్రోలింగ్ విధులు నిర్వహించే పోలీసులు ప్రమాదాలు జరిగేందుకు ఆస్కారం ఉన్న ప్రాంతాల్లో ఎక్కువ దృష్టి కేంద్రీకరించాలని అన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే బాధితులకు ప్రథమ చికిత్స చేసి ఒక గంట వ్యవధిలోపు మెరుగైన ఆసుపత్రుల్లో చేర్పించినట్లయితే 50శాతం ప్రమాద బాధితులను కాపాడవచ్చన్నారు. పెట్రోలింగ్ విధులు నిర్వర్తించే పోలీసులు అంకితభావంతో పనిచేసి పోలీస్‌శాఖ పేరుప్రతిష్టలను పెంపొందించాలని కోరారు. విధి నిర్వహనను సంతృప్తికరంగా కొనసాగించాలని భాధ్యతలు విస్మరించే వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీసీపీలు శ్రీనివాస్, సంజీవ్‌కుమార్, ఏసీపీలు రామారావు, అశోక్, శ్యాంసుందర్, శోభన్‌కుమార్, కృపాకర్, రాగ్యానాయక్‌లతో పాటు పలువురు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

పంచాయతీల పర్వం.. ఆశావహుల్లో ఉత్కంఠ

- రిజర్వేషన్ల ఖరారుతో గ్రామాల్లో ఎన్నికల సందడి..
- పదవి కోసం తప్పని పాకులాటలు..

విజయక్రాంతి, నాగార్జునసాగర్: అన్న నమస్తే... బాబాయ్ బాగున్నవానే.. పెద్దయ్య ఏడికిపోయినవ్ కనపడట్లే ఊళ్లో ఓటుందికదా! ఇప్పుడు గ్రామాల్లో వినిపిస్తున్న మాటలు ఇవి. మరి ఇదేమిటనుకుంటున్నారా! త్వరలో పంచాయతీలకు జరుగనున్న ఎన్నికల్లో పోటీలో నిలబడబోయే అభ్యర్థులు ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు వాడుతున్న భాష ఇది. మరో రెండు రోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనుండటంతో గ్రామాల్లో ఎన్నికల కోలాహలం ప్రారంభమైంది. రిజర్వేషన్లు ఖరారు కావడంతో పోటీలో నిలబడబోయే అభ్యర్థులు ఎవరి ధీమాలో వారున్నారు. నాగార్జునసాగర్ నియోజకవర్గంలో ఉన్న ఆరు మండలాల్లో పంచాయతీ ఎన్నికలు జరుగనున్నాయి.

నాయకుల ప్రతిష్ఠకు సవాలు..

రిజర్వేషన్లు తేలడంతో పోటీల్లో నిలబడే ఆశావాహులు వారివారి ప్రయత్నాల్లో బిజీగా ఉన్నారు. అయితే నిన్న, మొన్నటి వరకు ఆయా పార్టీలకు పనిచేసిన ద్వితీయశ్రేణి నాయకులు త్వరలో జరుగనున్న పంచాయతీ ఎన్నికల్లో తమ అభ్యర్థులను నిలపాలనుకుని ప్రణాళికలు రచించుకున్నారు. కాని రిజర్వేషన్లు కొందరికి అనుకూలంగా రాకపోవడంతో తీవ్ర నిరాశ చెందారు. అయినా వారికి బదులు వారి సతీమణులను నిలిపేందుకు సిద్ధమయ్యారు. వ్యక్తిగత పేరుకు అధిక ప్రాధాన్యత కలిగిన పంచాయతీ ఎన్నికలు కొందరికి ఇబ్బందికరంగా మారాయి. వ్యకిగత ప్రవర్తనతోనే విజయాలను సాధించిపెట్టే ఈ పంచాయతీ ఎన్నికలు నాయకుల ప్రతిష్ఠకు సవాలుగా నిలువనున్నాయి. నియోజకవర్గంలో హాలియా, నాగార్జునసాగర్‌లు మున్సిపాలిటీలుగా రూపాంతరం చెందాయి. వీటికి మినహా మిగిలిన ఆరు మండలాల్లో పంచాయతీ ఎన్నికలు జరుగనున్నాయి. ఈఎన్నికల్లో పార్టీ ప్రమేయం లేకున్నా వారివారి మద్ధతుదార్లకు ప్రధాన పార్టీలు కొమ్ముకాయనున్నాయి. ఇందులో కాంగ్రెస్ పార్టీ నాయకులు తమ ప్రతిష్ఠను పెంచుకునేందుకు తహతహలాడుతుండగా అధికార టీఆర్ఎస్ పార్టీ తమ బలాన్ని మరింత పటిష్ఠం చేసుకునేందుకు సమాయత్తం అవుతుంది. ఇందుకు అనుగుణంగా అభ్యర్థుల ఎంపికలో ఇరుపార్టీల నాయకులు తలమునకలయ్యారు. గ్రామాలపై కనీస అవగాహన కలిగి ఉండటం కూడా అభ్యర్థులకు ఈఎన్నికల్లో కొంత ఉపయుక్తంగా ఉంటుందనేది సీనియర్ రాజకీయ నాయకుల అభిప్రాయం. మరో రెండు రోజుల్లో ఎన్నికల నగారా మోగనుండటంతో గ్రామాల్లోని రచ్చబండల వద్ద గుంపులుగా చేరుతున్న ఓటర్లు తాము ఉత్తముడైన నాయకున్నే ఎన్నుకుంటామని అందుకు ఫలానా గుణగణాలు కలిగిన వారై ఉండాలని చెప్పుకుంటున్నారు. ఇవి వింటున్న ఆశావాహుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ఏదేమైనా నామినేషన్లు సమర్పించే వరకు పోటీచేసే అభ్యర్థుల్లో ఎడతెగని ఉత్కంఠ నెలకొంటుందనడంలో సందేహం లేదేమో.

కొండమల్లేపల్లి సర్పంచ్ స్థానాన్ని ఆర్యవైశ్యులకు కేటాయించాలి

విజయక్రాంతి, దేవరకొండ: మేజర్ గ్రామపంచాయతీ అయిన కొండమల్లేపల్లి స్థానాన్ని అన్నిపార్టీలు ఆర్యవైశ్యులకు కేటాయించాలని ఆర్యవైశ్య సంఘం మండలాధ్యక్షుడు జిన్నం రామ్మూర్తి డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ ఆవరణలో నిర్వహించిన మండల సంఘ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ప్రస్తుతం సర్పంచ్ స్థానం జనరల్‌కు కేటాయించటంతో అన్నివర్గాల ప్రజలు సహకరించాలని కోరారు. అనంతరం నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ ఆలంపల్లి నర్సింహ్మా, సంఘం నాయకులు కొమిరిశెట్టి పాండరయ్య, నీలా లక్ష్మయ్య, మారంవెంకన్న, ముచ్చర్ల కరుణాకర్, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు వీరమళ్ల వెంకటయ్య, సముద్రాల ధనయ్య, కోశాధికారి తెరటిపల్లి బుచ్చిరాములు పాల్గొన్నారు.

వైభవంగా ‘అయ్యప్ప’ పుష్పయాగం

విజయక్రాంతి, కోరుట్ల: జగిత్యాల జిల్లా కోరుట్ల నియోజకవర్గ కేంద్రంలోని శ్రీఅయ్యప్ప జ్ఞానసరస్వతి సహిత శనైశ్చరాలయంలో పవిత్ర ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని మంగళవారం ‘పుష్పయాగం’ వైభవంగా జరిగింది. ఉదయం మూలవిరాట్లు, ఉత్సవ మూర్తులకు అభిషేకార్చనల అనంతరం లోకకళ్యాణార్థం పలు రకాల పుష్పాలతో స్వామి వారికి లక్ష పుష్పార్చనను ఆలయ ప్రధానార్చకులు పాలెపు రామకృష్ణశర్మ నేతృత్వంలో సశాస్త్రీయంగా నిర్వహించారు.

దేశంలోనే అగ్రగామిగా సింగరేణి సంస్థ

- సింగరేణిలో ఇల్లందు ఏరియా నంబర్ వన్
- ఇల్లందు ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ లక్ష్మీనారాయణ



విజయక్రాంతి, ఇల్లందు: భారత దేశంలో బొగ్గు ఉత్పత్తి చేస్తున్న మొత్తం సంస్థలన్నింటిలోనూ సింగరేణి కంపెనీ రూ.25 వేల కోట్ల టర్నోవర్‌తో దేశంలోనే అగ్రగామిగా నిలిచిందని ఇల్లందు ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ (జీఎం) కందూరి లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. బొగ్గు ఉత్పత్తిలో ఒక లక్ష్యంతో పని చేస్తున్న సంస్థ సింగరేణి' అని ఆయన తెలిపారు. నూతన సంవత్సరం ఆరంభం నాడు మంగళవారం ఆయన టేకులపల్లి సింగరేణి క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఇతర అధికారులతో కలిసి జీఎం మాట్లాడారు. 2017–18 ఆర్థిక సంవత్సరంలో 64.62 మిలియన్ టన్నుల బొగ్గు రవాణా చేసి, సింగరేణి యాజమాన్యం ఇండియాలోని బొగ్గు సంస్థల్లో ముందు వరుసలో స్థానం దక్కించుకుందని ఆయన తెలిపారు. అదేవిధంగా ఈ ఏడాది 2018–19 సంవత్సరానికి గాను 68 మిలియన్ టన్నుల వార్షిక ఉత్పత్తి లక్ష్యంతో సింగరేణి ముందుకు వెళుతోందని ఆయన పేర్కొన్నారు.

సింగరేణిలో ఇల్లందు ఏరియా నంబర్ వన్

జీఎం లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. తెలంగాణలోని సింగరేణిలో ఇల్లందు ఏరియా నంబర్ వన్‌లో ఉందని ఆయన అన్నారు. సింగరేణిలోని అన్ని ఏరియాల్లోకెల్లా, 117 శాతం బొగ్గు ఉత్పత్తి, రవాణా చేసి ఇల్లందు ఏరియా ప్రథమ స్థానంలో నిలిచిందని ఆయన చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరం 2019 మార్చి చివరినాటికి 70 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసి రవాణా చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని, ఇప్పటికే 50 లక్షల టన్నుల బొగ్గు రవాణా చేయడం జరిగిందని, ఇంకా ఈ సంవత్సరానికి సంబంధించి మూడు నెలల కాలం మిగిలి ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ మూడు మాసాల వ్యవధిలో మిగిలిన 20 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయనున్నట్లు ఆయన చెప్పారు. సింగరేణిలో పని చేస్తున్న కార్మికులు, అధికారుల పరస్పర సహకారం, సమిష్టి కృషితో తాము నిర్ధేశించుకున్న లక్ష్యాన్ని నెరవేర్చడం జరుగుతుందని ఆయన అన్నారు. కాగా ఇల్లందు ఏరియాలో వచ్చే రెండు సంవత్సరాల కాలంలో రెండు ఓపెన్‌కాస్టులు (ఓసి) నూతనంగా ప్రారంభం కానున్నాయని ఆయన పేర్కొంటూ, అందుకు సంబంధించిన ప్రణాళికలు రూపొందించే సన్నాహాలు యుద్ధ ప్రాతిపదికన సాగుతున్నాయని ఆయన తెలిపారు.

చురుగ్గా సోలార్ పవర్‌ప్లాంట్ నిర్మాణం

ఇల్లందులో సింగరేణి సంస్థ 39 మెగా వాట్ల సామర్థ్యం గల సోలార్ పవర్ ప్లాంట్ నిర్మాణం చేపట్టిందని, గత ఏడాది డిసెంబర్ 28న ప్లాంట్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని జీఎం పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన నిర్మాణ పనులు వేగంగా చకచకా సాగుతున్నాయని ఆయన చెప్పారు. మరో 9 నెలల కాలంలో ప్లాంట్ నిర్మాణ పనులు పూర్తిస్థాయిలో ముగుస్తాయనున్నాయని, ఈ ఏడాది సెప్టెంబర్ నెలలో విద్యుత్ ఉత్పత్తి ప్రారంభం జరుగనుందని జీఎం లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ఈ విలేకరుల సమావేశంలో ఇల్లందు ఏరియా ఇంజనీర్ జానకీరాం, సేఫ్టీ అధికారి శ్రీనివాస్, సర్వే అధికారి గోవర్ధన్‌రెడ్డి, సివిల్ ఇంజనీర్ రవి కుమార్, కోయగూడెం ఓసి ప్రాజెక్టు అధికారి కాకురు వేణుగోపాల్, మేనేజర్ కృష్ణయ్య, తావుర్యా తదితరులు పాల్గొన్నారు.



ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

- టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్ రెడ్డి

విజయక్రాంతి, హుజూర్‌నగర్: తెలంగాణలోని ప్రజలంతా నూతన సంవత్సరంలో సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆకాంక్షించారు. గడిచిన సంవత్సరంలో మంచిని కొనసాగిస్తూ కొత్త సంవత్సరంలో మరింత మంచిగా ఉండాలని ఆయన అన్నారు. కాంగ్రెస్ నాయకులు నూతన ఉత్తేజంతో వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయం కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు.

మంగళవారం మేళ్ళచెరువు మండల కేంద్రంలో కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న ఉత్తమ్ నూతన సంవత్సర సందర్భంగా కేక్ కట్‌చేసి కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హుజూర్‌నగర్ నియోజకవర్గాన్ని వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి చేశానని, రాబోయే రోజుల్లో ప్రజలందరికి అందుబాటులో ఉంటూ నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని, హుజూర్‌నగర్ పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టానని, కొన్ని మిగిలి ఉన్నాయని, వాటినికూడ త్వరలోనే పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తానని అన్నారు. రాబోయే గ్రామపంచాయతీ ఎన్నికల్లో అన్ని ప్రాంతాలకు మండలాల వారీగా సమన్వయ కమిటీ వేసి వాటి ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సాముల శివారెడ్డి, మంజునాయక్, నిజాముద్దీన్, జడ్పిటిసి లక్ష్మీప్రతాపరెడ్డి, మాజీ ఎంపిపి లక్ష్మి రామకృష్ణారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కాకునూరి భాస్కర్‌రెడ్డి, సీనియర్ నాయకులు కర్ణాట లక్ష్మీనర్సింహారెడ్డి పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



యాదాద్రికి పోటెత్తిన భక్తులు

- కిక్కిరిసిపోయిన ఆలయ క్యూలైన్లు
- సందడిగా మారిన ఆలయ పరిసరాలు

విజయక్రాంతి, యాదగిరికొండ: యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దర్శనార్థం మంగళవారం భక్తులు పోటెత్తారు. ఏకాదశి, నూతన సంవత్సరం పురస్కరించుకుని సోమవారం సాయంత్రమే కొండకు చేరుకున్న భక్తులు మంగళవారం ఉదయం స్వామి వారిని దర్శించుకునేందుకు గంటల తరబడి ఓపికతో క్యూలైన్లలో వేచియుండి శ్రీవారిని దర్శించుకున్నారు. కొండపైన ఎటు చూసినా భక్తులతో సందడిగా మారింది. దర్మదర్శనం, ప్రత్యేక దర్శనం, ప్రసాదాలు, విష్ణుపుష్కరిణి, వద్ద భక్తులతో కిక్కిరిసి పోయాయి. కొండకింద తులసీవనం, గోశాల, యోగానంద నిలయ చెంత భక్తులతో సందడిగా మారింది రద్దీని దృష్టిలో ఉంచుకుని భక్తుల రవాణా సౌకర్యార్థం కొండపై నుండి బస్టాండ్ వరకు ఆర్టీసీ, దేవస్థానం వారు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఉదయం బాలాలయంలో స్వామివారిని మేల్కొలిపి అభిషేకం అర్చనలు నిర్వహించారు. మండపంలో అష్టోత్తరం, సుదర్శన నృసింహ హోమంతోపాటు శ్రీవారి కల్యాణోత్సవంలో భాగంగా కల్యాణ మూర్తులకు ఊరేగింపు సేవ నిర్వహించిన అర్చకులు నిత్య కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. కల్యాణంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తమ మొక్కులు చెల్లించుకున్నారు. సత్యానారయణ స్వామి వ్రత మండపంలో సత్యదేవునికి భక్తులు సామూహిక వ్రత పూజలు చేశారు. సాయంత్రం బాలాలయంలో స్వామి అమ్మవారలను వివిధ రకాల పుష్పాలతో అలంకరించి జోడు సేవలు నిర్వహించారు. కొండపైన అనుబంధ ఆలయమైన పర్వత వర్ధిన సమేత శ్రీరామలింగేశ్వరస్వామి వారి శివాలయంలో ముక్కంటికి అభిషేకం, అర్చనలతోపాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక పూజలలో పాల్గొన్న భక్తులకు అర్చకులు తీర్ధ ప్రసాదాలు అందజేసి స్వామి వారి ఆశీర్వచనం చేశారు.

ఆంజనేయస్వామికి ఆకుపూజామహోత్సవం

యాదాద్రి కొండపైన వేంచేసియున్న క్షేత్రపాలక శ్రీ ఆంజనేయస్వామి వారికి ఆకుపూజామహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మంగళవారం స్వామివారికి ప్రత్యేక మైన రోజు కావడంతో 108 తమలపాకులతో ప్రత్యేక పూజలు చేసి స్వామికి ఇష్టమైన బూరెలు, అరటి పళ్ల నైవేద్యంగా సమర్పించారు.




భద్రాద్రి రామయ్యని దర్శించుకొన్న ప్రముఖులు

- మాజీ మంత్రి చందూలాల్, ఎమ్మెల్యే వీరయ్య, ఎమ్మెల్సీ రాములు నాయక్ ప్రత్యేక పూజలు
- నూతన సంవత్సరం సందర్భంగా ఆలయంలో పోటెత్తిన భక్తులు

విజయక్రాంతి, భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతరామచంద్ర స్వామి వారిని మంగళవారం పలువురు ప్రముఖులు దర్శించుకొన్నారు. రాష్ట్ర మాజీ మంత్రి చందూలాల్ భద్రాద్రి రామయ్యని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత ఆలయ మర్యాదలతో అధికారులు మాజీ మంత్రికి స్వాగతం పలికారు. దేవాలయ పరిసరాలను పరిశీలించి ఆలయ విశిష్టత గురించి అడిగి తెలుసుకొన్నారు. కాగా ఏఐసీసీ సభ్యులు బెల్లయ్య నాయక్‌తో కలిసి భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య, ఎమ్మెల్సీ రాములు నాయక్ తదితరులు భద్రాద్రి రామయ్యని దర్శించుకొన్నారు. రామాలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా నూతన సంవత్సరం సందర్భంగా రామాలయంలో భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజలు నిర్వహించారు. న్యూ ఇయర్ వేళ ఆలయంలో భక్తజన సందడి నెలకొంది. ఇదిలా ఉండగా ఆలయ అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యల గురించి భద్రాచలం డివిజన్ కాంగ్రెస్ నాయకులు బొలిశెట్టి రంగారావు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే వీరయ్య మట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయానికి రూ 100 కోట్లు తక్షణమే విడుదలచేసి అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు. రామాలయ అభివృద్ధికి కోసం పట్టుదలతో కృషి చేస్తా అన్నారు. నియోజకవర్గ ప్రజలు తనపై ఎంతో నమ్మకంతో ఓట్లేసి గెలిపించారని, ఆ నమ్మకాన్ని వమ్ముచేయకుండా నిలబెట్టుకొంటానని అన్నారు.

బీసీ రిజర్వేషన్లను తగ్గించే హక్కు ఎవ్వరికీ లేదు

- బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లింగంగౌడ్

విజయక్రాంతి, మిర్యాలగూడ: తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు గ్రామపంచాయతీలో అమలు చేయాల్సిన రిజర్వేషన్లను తగ్గించే హక్కు ఎవరికీ లేదని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు. మంగళవారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల ఓట్లతో రెండోసారి అధికారం చేపట్టిన టీఆర్ఎస్ ప్రభుత్వం బీసీలను విస్మరించడం తగదన్నారు. రాత్రికి రాత్రి బీసీలకు 23 శాతం అంటూ ఆర్డినెన్స్ జారీ చేయడం ఉరితాడు బిగించడమేనన్నారు. ఢిల్లీ పర్యటనలో ప్రధాని మోడీకి కేసీఆర్ 16 సమస్యలపై విజ్ఞాపనలు అందించారని, బీసీ సమస్యలపై నోరు మెదపకపోవడం విచారకరమన్నారు. సమావేశంలో రమేష్, వెంకటేశ్వర్లు, రామకృష్ణ ఉన్నారు.



అందరూ నిర్దోషులే...!

సాధారణ రైల్వే ఉద్యోగి కుమారుడైన అబ్దుల్ కరీం తెల్గీ దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన దాదాపు రూ.20వేల కోట్లు విలువైన నకిలీ స్టాంప్ పేపర్ల కుంభకోణంలో ప్రధాన నిందితుడు. రాజకీయ నాయకులు, పోలీసుల సాయంతో అనేక రాష్ట్రాల్లో అక్రమ సామ్రాజ్యాన్ని విస్తరించాడు. కర్ణాటకలోని బెలగావి జిల్లా ఖానాపూర్‌కు చెందిన తెల్గీ చిన్నతనంలో రైళ్లలో కూరగాయలు, పళ్లు అమ్మేవాడు. బెలగావి కాలేజ్ నుంచి బీకాం డిగ్రీ సంపాదించాక సౌదీకి వెళ్లాడు. అక్కడ దాదాపు ఏడేళ్లు గడిపి తిరిగి ముంబైకి చేరాక అండర్ వరల్డ్ మాఫియాతో సంబంధాలు పెట్టుకున్నాడు. యువకుల ను దుబాయ్ పంపిస్తానని మోసగించిన కేసులో ముంబై పోలీసులు 1991లో తెల్గీని అరెస్ట్ చేశారు. జైలులో ఉన్నప్పుడు నకిలీ పేపర్ల కేసులో శిక్ష పడ్డ రామ్ రతన్ సోనీ నుంచి తెల్గీ ఫోర్జరీ మెళకువలు నేర్చుకున్నాడు. రాజకీయ నాయకులు, సెక్యూరిటీ ప్రెస్ అండతో 1994లో స్టాంప్ పేపర్ లైసెన్స్ సంపాదించిన తెల్గీ ముంబైలో మింట్ రోడ్డులో కార్యాలయాన్ని ఏర్పాటు చేశాడు. రెవెన్యూ శాఖ, స్టాంప్ కార్యాలయం, నాసిక్ సెక్యూరిటీ ప్రెస్‌లోని అధికారులతో స్నేహం పెంచుకున్నాడు. తనకున్న రాజకీయ సాన్నిహిత్యంతో నాసిక్ ప్రెస్‌లో యంత్రాల్ని పనికిరానివిగా ప్రకటించేలా చేసి వాటిని సొంతం చేసుకున్నట్లు ఆరోపణలున్నాయి. వాటిని కొని ముంబైలోని తన కార్యాలయంలో స్టాంపు పేపర్ల ముద్రణ ప్రారంభించాడు. నాసిక్ ప్రెస్ భద్రతా అధికారుల సాయంతో స్టాంపుల ముద్రణ రంగుల్ని సంపాదించిన తెల్గీ దేశవ్యాప్తంగా 350 మంది ఏజెంట్ల సాయంతో భారీ స్థాయిలో నకిలీ స్టాంపుల కుంభకోణాన్ని కొనసాగించాడు. అధికారంలో ఉన్న నేతలు, పోలీసు అధికారుల సహకారంతో తెల్గీ ఈ వ్యాపారాన్ని నిరాటంకంగా కొనసాగించినట్లు దర్యాప్తు సంస్థల విచారణలో తేలింది. అయితే నకిలీ స్టాంపు పేపర్ల కుంభకోణం నిందితులంతా నిర్దోషులేనని నాసిక్ సెషన్స్ కోర్టు తీర్పునిచ్చింది. సీబీఐ దర్యాప్తు చేస్తున్న ఈ కేసులో ప్రధాన నిందితుడు కరీం తెల్గీ, మరో ఏడుగురిపై అభియోగాలకు సరైన ఆధారాలు లభించలేదని పేర్కొంది. వేరే కేసులో తెల్గీ దోషిగా తేలడంతో కోర్టు 30 ఏళ్ల జైలు శిక్ష విధించింది. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న తెల్గీ గతేడాది బెంగళూరులోని జైలులో చనిపోయాడు.

'వివేక' వాణి వినదలచుకోలేదా?

వాదాలు సంవాదాలకు దారి తీయాలి, వివాదాలకు కాదు. మన దేశంలో దురదృష్టం ఏమిటంటే ఎలాంటి వివాదమూ అవసరం లేని చోట కూడా మనం వివాదాన్ని సృష్టించగలం. వివాదంతో సంవాదానికి విఘాతం కల్పించగలం. విషాదం సృష్టించగలం. ఢిల్లీలో 'మేధావుల' నెలవుగా పేరొందిన జవహర్లాల్ నెహ్రూ యూనివర్సిటీలో తాజాగా ఇలాంటి వివాదమే చెలరేగుతోంది.

భారతీయ జీవనంలోని శ్రేష్ఠతమమైన విలువలకు ప్రతీకగా నిలిచి, భారతీయ జీవన విధానపు విజయ వైజయంతిని విశ్వమంతటా ప్రకటించిన వివేకానందుడు జెఎన్ యూలో అస్పృశ్యుడు. ఆయనకు జెఎన్‌యూ మేధో 'అగ్రహారం'లో స్థానం లేదట!! ఆయన స్థానం జెఎన్‌యూ బయట 'వెలివాడ'లోనేనట!! వివేకానందుడి విగ్రహం జెఎన్‌యూ ఆవరణలో పెడితే మార్క్సిస్టు మేధోజగత్తు 'మైల' పడిపోతుందట! మళ్లీ మళ్లీ మార్క్సిజం జలాల్లో స్నానం చేసినా ఆ మకిలి, మురికి పోనే పోదట!! అందుకే ఆయన విగ్రహానికి జెఎన్‌యూ అనుగ్రహం ఉండదట!! కాదంటే ఆగ్రహమే ఉంటుందట!! ఇంతకీ వివేకానందుడు మార్క్సిస్టు మేధో మడి గుడ్డలతో గొంతులు కోసే శిక్ష పడేంతగా ఏం చేశారు? ఆయన చిర యౌవనానికి ప్రతీక! నిర్భీతికి నిలువెత్తు నిదర్శనం. పాశ్చాత్య దురహంకారంపై ఆ యువ సన్యాసి ఒక తిరుగుబాటు బావుటా. ఆయన పాశ్చాత్య సామ్రాజ్యవాదంపై ప్రళయం కురిపించారు. ఆయన కుల గజ్జిపై గళం విప్పి నిప్పులు గుప్పించారు. సమాజంలోని హెచ్చు తగ్గులపై, అవినీతిపై, రెండు నాల్కల ధోరణులపై, పేరు గొప్ప ఊరు దిబ్బ ధోరణులపై ఆయన విప్లవ ధ్వజాన్ని ఎగరేశారు. మూఢనమ్మకాలను ఆయన తూర్పార పట్టారు. పంచాంగాలు చూసుకుంటూ, మీనాలు మేషాలు లెక్కించుకుంటూ కాలం గడిపేవాళ్లను ఎండగట్టారు. అలా ప్రశ్నించడం నేర్పిన వాడికి, తిరుగుబాటు చేసిన వాడికి, ధ్వజమెత్తిన వాడికి జె ఎన్‌యూ లో స్థానం ఉండకూడదా? నిజానికి వామపక్షులు కోరుకుంటున్నది ఇదే కదా? అయినా జెఎన్‌యూలో ఆయన విగ్రహాన్ని పెట్టొద్దని పోరాటం ఎందుకు?

తమాషా ఏమిటంటే జెఎన్‌యూ పరిపాలనా విభాగమనే దేవుడు వరమిచ్చినా, జె ఎన్‌యూ ని గబ్బిలాయిల్లా పట్టుకుని తలకిందులుగా వేలాడుతున్న లిబరల్ పూజారులు మాత్రం వరమివ్వరట. వారికి వివేకానందుడి విగ్రహం వద్దే వద్దట. ఇంతకీ వారి వ్యతిరేకతకు కారణం ఏమిటంటే వివేకానందుడిని హిందుత్వ 'మతతత్వ శక్తులు' ఆరాధిస్తాయట. అందుకే ఆయన విగ్రహం వద్దట!! లిబరల్ ఆలోచన అంటే భిన్న స్వరాలను గుర్తించి, గౌరవించడం. లిబరల్ విధానం అంటే వ్యతిరేకించేవారిని కూడా వినే ఓపిక కలిగుండటం. లిబరల్ ధోరణి అంటే శంకరాచార్యులకు, మండనమిశ్రుడికి మధ్య జరిగిన సంవాదంలో మండనమిశ్రుడి భార్యే న్యాయ నిర్ణేతగా వ్యవహరించి, నిజాయితీతో కూడిన తీర్పును నిక్కచ్చిగా చెప్పడం లాంటిది. కేవలం తమకు నచ్చని ఆలోచనా విధానానికి చెందిన వారు ఆరాధిస్తున్నారన్న చవకబారు కారణంతో వివేకానందుడి విగ్రహాన్ని పెట్టనివ్వబోమనడం లిబరల్ ధోరణి అనిపించుకోదు. 'వేయి పూలు వికసించనీ, వేయి ఆలోచనలు వర్ధిల్లనీ' అన్నది కేవలం ఆకర్షణీయమైన నినాదంగా మాత్రమే మిగిలిపోకూడదు. అలా జరిగిన నాడు చదువుల అసలు లక్ష్యమే మసకబారిపోతుంది. మనసు తలుపులు తెరిచే నాలుగు గోడల తరగతి గది చీకటి కొట్టం అయిపోతుంది. జేఎన్‌యూ వంటి సుప్రతిష్ఠిత విశ్వవిద్యాలయంలో మేరు శిఖరాలుండాలి తప్ప మట్టిగుట్టలు ఉండకూడదు. మహా మానవులుండాలి తప్ప మేధో మరుగుజ్జులుండకూడదు. వివేకానందుడి విగ్రహం పెట్టకూడదని వాదించడం మరుగుజ్జుదనం తప్ప మరేమీ కాదు. త్రిపురలో గుప్పెడు మంది కుర్రాళ్లు ఒక్క అనుమతి లేని లెనిన్ విగ్రహాన్ని తొలగించినందుకు నానా గగ్గోలు పెట్టిన వారు వివేకానందుడి విగ్రహం వద్దనడం విడ్డూరం. ఇది ప్రజాస్వామ్య ధోరణి అనిపించుకోదు.

మన దేశం యువజన దినోత్సవాన్ని స్వామీ వివేకానందులవారి జన్మదినం నాడే జరుపుతోంది. ఆ యువ సన్యాసి జీవితాన్ని ఆదర్శంగా కోట్లాది మంది యువకులు భావిస్తారు. ప్రభుత్వాలు ఆయన జన్మదినాన్ని పండుగలా నిర్వహిస్తుంది. దేశమంతా ఆయన్ను హీరోగా ఆరాధిస్తుంది. కానీ కాలం చెల్లిన సిద్ధాంతాలను పట్టుకుని తలకిందులుగా వేళ్లాడే కొందరు మాత్రం చిరయౌవనానికి ప్రతీక అయిన వివేకానందుడిని కేవలం క్షుద్ర రాజకీయ కారణాలు చూపుతూ తిరస్కరిస్తున్నారు. ఇలాంటి ఆలోచనలు అప్రజాస్వామికమే కాదు, నిరంకుశత్వం కూడా! గులగ్ ఆర్చిపెలాగోలు, కాన్సన్ట్రేషన్ క్యాంపుల రోజులు గతించిపోయాయి. కంచుకోటలు, కచ్చడాల యుగాలు కరిగిపోయాయి. ఆచరణలోనూ 'వేయిపూలను వికసించనీయడమే' నేడు ఆచరణీయం. వివేక వాణిని వినబోమని చెవుల్లో సీసం పోసుకోవడం శ్రేయోదాయకం కాదు.

కొంచెం ఇష్టం.. కొంచెం కష్టం

మనం ఏం చేసినా, ఏం చేయక పోయినా కాలం మాత్రం తన పని తను చేసుకుని వెళ్ళిపోతుంది. కొన్ని సంతోషాలు కొన్ని దుఃఖాలను మాత్రం మిగిల్చుతుంది. కొత్త సంవత్సరం వచ్చిందని చాలా సంతోషంగా జరుపు కుంటాం, ఆ రోజు కాస్తాకూస్తో అందరం ఆనందంగా ఉండాలనే చూస్తాం. కాని కాలం ఏది చేయాలనుకుంటే అది చేస్తుంది. అప్పుడు కొంచెం ఇష్టం , కొంచెం కష్టంగానే గడుస్తుంది. మరి కొత్త ఆశలతో కొత్త సంవత్సరంలోకి వచ్చాం కదా , మరి గత సంవత్సరం మన కిచ్చిన ఇష్టకష్టాలేంటో ఒకసారి నెమరు వేసుకుందాం. 2018 సంతోషాలతో పాటు విషాదాలను కూడా బాగానే పంచింది. టాలీవుడ్‌లో నటుడిగా, నిర్మాతగా, దర్శకునిగా మంచి పేరు ప్రఖ్యాతలు గాంచిన దాసరి నారాయణరావు మే 30, 2018లో మృతి చెందారు. మాజీ నటుడు, రాజకీయ నేత అయిన హరికృష్ణ ఈ ఏడాదిలోనే మరణించారు. ఇటు టాలీవుడ్ అటు బాలీవుడ్‌లో తనకంటూ ఓ ప్రత్యేకత తెచ్చుకుని అతిలోకసుందరిగా పేరు గాంచిన నటి శ్రీదేవి కూడా ఈ ఏడాదే మృతి చెందారు. మనదేశ ప్రధానిగా పనిచేసిన అటల్ బిహరీ వాజ్‌పేయి, తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి, ప్రఖ్యాత శాస్త్రవేత స్టీఫెన్ హాకింగ్‌లు కూడా 2018లోనే మృతిచెందారు. 2018లో ప్రకృతి బాగానే పగబట్టింది. ఎన్నో వరదలు వరుసగా వచ్చాయి.. తిత్లీ, పెథాయి, గజ తుఫాన్, కార్చిచ్చు, సునామీలు భుకంపాలు వచ్చాయి. సెప్టెంబర్‌లో ఇండోనేషియాలో వచ్చిన భూకంపం, సునామీల వల్ల 1400 మందికిపైగా మృతి చెందారు. కేరళ రాష్ట్రంలో వచ్చిన వరదలో 500 మంది మృత్యు వాత పడ్డారు. తిత్లి, పెథాయిల ద్వారా ప్రాణ నష్టం జరగకపోయినా ఆస్తి నష్టం భారీగానే జరిగింది. ఇక తమిళనాడులో వచ్చిన గజ తుపాను వల్ల ప్రాణ నష్టంతో పాటు ఆస్తి నష్టం కూడా జరిగింది.

ఇక 2018లో న్యాయం స్థానం కూడా కాస్తముందడుగు వేసింది. అన్యాయాన్ని అరికట్టడానికి తన వంతు సాయం చేసింది. ముఖ్యంగా ముస్లీం మహిళలు ఎన్నో సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న ట్రిపుల్ తలాక్ తప్పని తేల్చిచెప్పింది. ఇక హిందూవులు ఎంతో పవిత్రంగా పూజించే శబరిమలకి ఎవరైనా వెళ్ళవచ్చు. మహిళలు, పురుషులు సమానం అంటూ తీర్పు ఇచ్చింది. యువత పెళ్ళికి తల్లి దండ్రులతో సంబంధం లేదని, ఇద్దరు వ్యక్తులకు ఒకరిమీద ఒకరికీ నమ్మకం ఉంటే పెళ్ళి చేసుకోవచ్చని ఇందులో ఎవరూ తలదూర్చ కూడదని స్పష్టం చేసింది. అంతేకాకుండా ఆధార్ కార్డు కేవలం ప్రభుత్వ పథకాలకు మాత్రమే వాడాలని, బ్యాంకు ఖాతాలకు, సిమ్ కార్డుల కోసం వాడకూడదని స్పష్టం చేసింది.

–అమీనా మహ్మద్

మానవతా విలువల ప్రాముఖ్యం పిల్లలకు తెలపాలి

మానవతా విలువలైన సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింసల యొక్క ప్రాముఖ్యం పిల్లలకు చిన్నప్పుడే తెలియజేయాలి. సత్యం అనే విద్యుత్తు, ధర్మం అనే తీగ ద్వారా, శాంతి అనే బల్బులోకి, అహింస అనే ఫిలమెంటు ద్వారా ప్రవేశించి ప్రేమ అనే కాంతిని విరజిమ్ముతుంది.

సత్యము

సత్యమే దైవ స్వరూపం. నీతి, నిజాయితీ, నమ్మకం, నిష్కపటము, విచక్షణ, త్రికరణశుద్ధి, నిర్భయం, ఆశావాదం, విశ్వాసం, అంతర్వాణిని విని ఆచరించటం, వినయం, పవిత్రత మొII అన్నీ సత్యం కిందకే వస్తాయి. మాటకు సత్యం ప్రాణం. నోటుకు వ్రాలు ప్రాణం. ప్రాణం పోవచ్చుగాని, ఆడిన మాట పోగూడదు. సత్యం చెబితే భయపడవలసిన పనిలేదు, దేనిని గుర్తుంచుకోనవసరము లేదు.

కథ : ఒక అడవిలో ఆవు మేత మేస్తుండగా, పులి చూసి ఆవు దగ్గరికి చంపాలని వచ్చింది. ఆవు మేత మేస్తూ, పులి తన దగ్గరకు వచ్చేదాకా గమనించలేదు. హఠాత్తుగా దగ్గరలో పులిని చూసి, తనకు మరణం ఖాయం అని భావించింది. కాని ఇంటి వద్ద ఉన్న తన పసి దూడను తలచుకొని పులిని ప్రాధేయ పడింది. 'తాను ఇంటికి వెళ్ళి పసి దూడకు పాలిచ్చి, బుద్ధులు చెప్పి, వీడ్కోలు పలికి వస్తానని, తన మాటలు నమ్మమని' ప్రాధేయపడింది. పులి 'నేను నమ్మను, దొరికిన ఆహారాన్ని తన కోసం వదలుకోను' అని బదులిచ్చింది. కాని ఆవు తన పదిరోజుల దూడ తనకోసం ఎదురు చూస్తుంటుందని, తాను వెళ్ళక పోతే ఎదురు చూసి, చూసి ప్రాణాలు విడుస్తుందని, తాను సత్యాన్ని దైవంగా భావించే ఉత్తమ జాతికి చెందిన దాన్నని, పలు విధాలుగా పులిని బ్రతిమాలింది. చివరకు పులి, తన పిల్లలు తన కోసం ఎలా ఎదురుచూస్తారో తెలుసు గనుక, ఆవును వెళ్ళి రమ్మంది. ఆవు ఇంటికి వెళ్ళి తన చిన్న దూడకు పాలిచ్చి, బుద్ధులు చెప్పి, తాను మళ్ళీ రానని జాగ్రత్తగా మసులుకోమని చెప్పి, పులి దగ్గరకు వచ్చి, ఇప్పుడు తనను ఆహారంగా స్వీకరించమని వినమ్రంగా పులి ముందు మోకరిల్లింది. ఇది చూసి పులికి ఆశ్చర్యం వేసింది. ఆవు మళ్ళీ రాదని అనుకుంది. అలాంటిది ఆవు తన మాటను నిలుపుకొని తిరిగి వచ్చి, తన ముందు మోకరిల్లటం చూసి పులికి నోట మాట రాలేదు. ఇంతటి నిజాయితీ పరులు లోకంలో ఉంటారా అని ఆశ్చర్య పడ్డది. ప్రాణం కంటే ఆడిన మాటకు విలువు ఇచ్చిన ఆవును చంపటానికి ఇష్టపడక ఆవును మెచ్చుకొని వెళ్ళి పొమ్మంటుంది.

ఈ కథ నిజంగా జరిగిందా లేదా అన్న విషయం వదిలేసి ప్రాణాన్ని కూడా తెగించి, సత్యమే ప్రాణంగా భావించిన వారిని చూస్తే, ఎవరికైనా హాని చెయ్యాలని పించదు అన్నది వాస్తవం. సత్యమే దైవం.

సత్య హరిశ్చంద్రుడు, బలిచక్రవర్తి ప్రాణంకంటే సత్యం ముఖ్యం అని నిరూపించబట్టే, వారి పేర్లు చిరస్థాయిగా నిలిచిపోయినవి.

ధర్మము

కర్తవ్య నిర్వహణ, పట్టుదల, ఏకాగ్రత, కృతజ్ఞత, క్రమశిక్షణ, బాధ్యత, సమయోచితము, ధైర్యము, మంచి స్వభావము, ఇతరులకు సహాయపడటం, ఆహార, ఆరోగ్య నియమాలను పాటించడం, నిగర్వము, పరిశుద్ధత, బుద్ధి కుశలత, సమయపాలన, నియమపాలన, పర ధనం మీద వ్యామోహం లేక పోవటం, తీసుకుంటున్న జీతానికి తగ్గ పని చేయటం, లంచం పుచ్చుకోక పోవటం, ఇవ్వకుండటం, తనది కాని సొమ్మును ఆశించక పోవటం – ఇవన్నీ ధర్మం కిందికి వస్తాయి.

మంచినీటి నది లాగా మనిషి స్వతహాగా మంచి వాడే. కాని వ్యక్తుల సమూహమే ఉప్పునీటి సముద్రం.

పురుషార్థ ప్రదాలయిన ధర్మ, అర్థ, కామ, మోక్షములలో మొదటిదయిన ధర్మాన్ని ఎవరు పాటిస్తారో వారిని ధర్మం రక్షిస్తుంది. ధర్మాన్ని ఎవరు ఆచరించరో వారిని ధర్మం శిక్షిస్తుంది. అందుకే అందరూ ప్రవర్తనా నియమావళి పాటించాలి. తన విధిని సక్రమంగా ఆచరించటమే ధర్మం. అందరూ ధర్మాన్ని ఆశిస్తున్నారుగాని ఆచరించటం లేదు – తమను మినహాయించుకుంటున్నారు. ధర్మాన్ని ఆచరించినపుడే ధర్మాన్ని ఆశించాలి.

ధర్మ కార్యాలు చేసేవారికి ముందు వ్యక్తిగత సంస్కరణ అవసరం. అధర్మాన్ని చూచి ఉపేక్షించటము కూడా పాపమే. నీవు చేయగల మంచిని ఎంత చెయ్యగలవో అంత చెయ్యి. లభించిన జన్మను సార్థకం చేసుకోవాలి. అందరికీ ఆదర్శంగా నిలవాలి.

సత్యం, ధర్మం తమకు తామే జయిస్తాయి. అసత్యం, అధర్మం తాత్కాలికంగా జయించినట్లు కనపడినా, చివరకు ఓడి తీరతాయి. మనం అద్దంలో చూచుకొని అలంకరణను సరి చేసుకున్నట్లు, ఎప్పటికప్పుడు ఆత్మ పరిశీలన చేసుకొని, తప్పులు సరిదిద్దుకొని ఆదర్శవంతంగా మెలగాలి. భయపడే పని చేయకు, చేసిన పనికి బాధ్యత వహించు. మనకు ఇతరులు చేసిన సహాయం మరువరాదు. వీలైనప్పుడు ప్రత్యుపకారం చేయాలి.

కథ : ఒక కట్టెలు కొట్టి అమ్ముకునే అతను ఒక రోజు నది ఒడ్డున ఎండిన చెట్టు కొమ్మలు కొడుతుండగా, గొడ్డలి జారి నదిలో పడి పోయింది. నదీ దేవత అతని నిజాయితీని పరీక్షించుదామని, అతని ముందు ప్రత్యక్షమై, బంగారు గొడ్డలిని చూపించి 'ఇది నీదేనా' అని ప్రశ్నించింది. అతను 'ఇది నాదు కాదు'అని బదులిచ్చాడు. అప్పుడు వెండి గొడ్డలి చూపించి 'ఇది నీదేనా' అని ప్రశ్నించింది. అతను 'ఇది నాదు కాదు' అని బదులిచ్చాడు. తర్వాత ఇనుప గొడ్డలిని చూపించి 'ఇది నీదేనా' అని ప్రశ్నించింది. అతను 'ఇది నాదే' అని బదులిచ్చాడు. నదీ దేవత అతని నిజాయితీకి, ధర్మ ప్రవర్తనకు మెచ్చి, మూడు గొడ్డళ్ళను, బంగారు, వెండి, ఇనుపవి అతనికి ఇచ్చింది.

ఈ కథలో కట్టెలు కొట్టే అతని నిజాయితీ, ధర్మ ప్రవర్తన అనే సద్గుణములు మనిషి బీదవాడా, ధనవంతుడా అన్న వాటిమీద ఆధారపడి ఉండవు. మనిషి నైజం పట్టి ఉంటుంది. ఈ రోజుల్లో మంచి హోదా, జీతం ఉన్నవారు కూడా లంచాలు మరిగి, నల్ల ధనాన్ని లాకర్లలో ఉంచి, పాపం పండినపుడు పట్టుబడి జైలు పాలవుతున్నారు. అలా పట్టుబడ్డ వారు కూడా రాజకీయ అండదండలతో కేసును మాఫీ చేయించుకోవటమో, లేక జైలు నుంచి విడుదల చేయించుకొని తిరిగి పదవిలో చేరటమో జరగుచున్నది. కనుక మనిషి, విలువలను చిన్నప్పుడే నేర్చుకొని, పాటిస్తున్నప్పుడే సమాజం బాగుపడుతుంది.

– వ్యాకరణం వేణుధర శాస్త్రి

విద్యార్థుల ధర్మయుద్ధానికి అండ

విద్యార్థులు ప్రారంభించిన న్యాయమైన ధర్మయుద్ధానికి అండను సమకూర్చేందుకు కొందరు బాధ్యతగల పౌరులతో ఒక సంఘమేదైనా రూపొందించేందుకు తాము కృషి చేయగలమనీ, ఏ రకంగా అవసరమనుకుంటే తమను విద్యార్థులు ఆ రకంగా ఉపయోగించుకొనవచ్చునని పత్రికా రచయితలు శ్రీ ఆదిరాజు వెంకటేశ్వరరావు, శ్రీ సంతపురి రఘువీర రావు జనవరి 22వ తేదీన విద్యార్థి నాయకులకు ఉస్మానియా విశ్వవిద్యాలయ ఆవరణలో స్పష్టం చేశారు. విద్యార్థులు కోరితే తాము తక్షణమే ఉద్యోగాలు వదలిపెట్టేందుకు కూడ సిద్ధంగా ఉన్నామని వారు తెలియచేశారు. ఆనాడు, అంతకు క్రితం రెండు రోజులు విద్యార్థులపై జరిగిన అకారణ లాఠీ ఛార్జీ వారిపై విలేఖరులకు సానుభూతిని కలుగజేసింది. లాఠీఛార్జీ బాష్పవాయు ప్రయోగం అనంతరం అనేక మంది విద్యార్థి నాయకులను ప్రభుత్వం నిర్బంధించి కేసులు బనాయించింది. ఈ కేసులలో విద్యార్థుల తరుపున వాదించిన సుప్రసిద్ధ యువ న్యాయవాది శ్రీ జి. నారాయణరావు అప్పటి నుండి ఎంతోకాలం వరకు ప్రతినిత్యం ఆయన తెలంగాణ ఉద్యమకారులతో సంబంధం ఉన్నటువంటి ఏదో కేసు సందర్భంలో ఏదో ఒక కోర్టులో హాజరుకాని రోజు లేదంటే అతిశయోక్తి కాదేమో. తర్వాత తర్వాత మరికొందరు న్యాయవాదులు కూడా ఉద్యమంతో సంబంధం ఉన్న వారి కేసులలో ప్రశంసనీయమైన పనిచేశారు. జనవరి 19 అఖిల పక్ష ఒప్పందంగా పేర్కొనబడుతున్న విలువలేని పత్రం వెలుగు చూచిన నాటి నుండి, మంత్రులు కొందరు రాజకీయ నాయకుల ఖైదీలై అంధకార బంధురాలలో కాలక్షేపం చేస్తూ తమ ఇండ్లు వదిలి ఇవతలకు రావడం మానేశారు. ప్రత్యేక తెలంగాణా వాదులైతే తప్ప శాసనసభ్యులకు తమ తమ నియోజకవర్గాలకు వెళ్ళే దమ్ము లేక పోయింది. వీరు రాజధానిలో బ్రహ్మంగారు కట్టేసిన దొడ్లో ఉంటూ ఆయన పెట్టే గడ్డి తింటూ కూర్చొని బ్రహ్మస్మరణ చేశారు. ఒకవేళ ఎవరైనా, ఎప్పుడైనా సాహసించి వెలుపలకు వస్తే ప్రజలచే మురిగిపోయిన కోడిగుడ్లు, టమాటోలు, పాత పాదరక్షలతో సత్కరించబడ్డారు. నాయకులు కాల్పులు జరిపించి పోలీసు రక్షణతో పలాయనం చిత్తగించడం ఆ రోజులలో తరచు జరిగిన పరిస్థితి.

మొదట పసిపిల్లల గొడవయనీ, తర్వాత ఏదో స్వార్థపరులైన స్వల్ప సంఖ్యాకులు సాగిస్తున్న ఉద్యమమనీ, తన ప్రత్యర్థులు తమ రాజకీయ ప్రయోజనానికి కొనసాగిస్తున్న కుట్రయనీ, ఢిల్లీ వెళ్ళినప్పుడల్లా రకరకాలుగా ప్రకటించిన ముఖ్యమంత్రి, మంత్రులు సైతం ప్రజాబలం ముందు ఎంత జంకారంటే, ఉద్యమం మొదలైన తర్వాత పది నెలల పాటు వారు తమ అధికార నివాసాలు వదలి ఎప్పుడూ ఏ బహిరంగ కార్యక్రమంలోనూ పాల్గొనలేదు.

ఢిల్లీ పోయేటప్పుడు, వచ్చేటప్పుడు అసంఖ్యాకమైన సాయుధ పోలీసుల రక్షణలోనే ఇంటికీ, విమానాశ్రయానికి ప్రయాణం చేసిన ముఖ్యమంత్రిని వీలు చూసుకొని చుట్టుముట్టేసిన ప్రజలు ఆయనకు ప్రత్యక్షంగా తమ నిరసనను తెలుపకుండా వదల లేదు. ముందుగా వేలమందిని నిర్బంధించి విమానాశ్రయంలోనికి దొంగదారి గుండా వెళ్ళిన సందర్భాలలో కూడా ప్రజలు అతనిని చుట్టుముట్టి 'ఛీ' 'ఛీ' అంటూ కోడిగుడ్లు, టమాటోలతో సత్కరించిన ఎన్నో సంఘటనలు ఉన్నవి.

రక్షణల ఉద్యమం ఉధృతంగా జరుగుతున్న రోజులలో జనవరి 8వ తేదీన ఒక ప్రతినిధి వర్గం ముఖ్యమంత్రిని కలుసుకొని ఒక విజ్ఞాపన పత్రం సమర్పించారు. శ్రీ రామమూర్తి నాయుడు, ప్రొఫెసర్ ఖాన్, యస్. రాఘవీరరావు, శ్రీ డి. రామస్వామి, సర్వోదయ కార్యకర్తలు లక్ష్మీ నారాయణ, శ్రీ జాఫర్ భాయ్ మొదలగువారు సమర్పించిన ఈ విజ్ఞాపన పత్రంపై శ్రీ బాకర్ అలీమీర్జా, శ్రీ బి.యస్. మహదేవ్ సింగ్ వంటి ప్రముఖులు కూడా సంతకం చేశారు.

ముఖ్యమంత్రి ఈ ప్రతినిధి వర్గంతో సమావేశానికి తీరికలేనట్టు నటిస్తూ అరనిమిషం సేపు నిల్చొనే మాట్లాడి వారిని వెళ్ళగొట్టారు. **(సశేషం)**

– ఆదిరాజు వెంకటేశ్వర రావు

ఓడిపోతే ఇడియట్లా..

తెలంగాణ ముఖ్యమంత్రిగా, నాలుగు కోట్ల ప్రజలకు ప్రతినిధిగా ఉన్న కేసీఆర్ ఇటీవల ప్రగతి భవన్‌లో జరిగిన పత్రికా విలేకరుల సమావేశంలో ప్రత్యక్ష ప్రసారంలో మాట్లాడిన తీరు ఆయన ఉపయోగించిన భాష, ప్రతిపక్ష పార్టీల పైన, సహచర ముఖ్యమంత్రిపైన, ఏకంగా ప్రధానమంత్రిపైన, మీడియాపైన ఆయన చేసిన వ్యాఖ్యలతో తెలంగాణ అంటే దేశంలో ఒక పలుచన భావం ఏర్పడే పరిస్థితి నెలకొంది. కేసీఆర్ తెలంగాణ ఉద్యమ సమయంలో తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా చేయడంలో జరుగుతున్న జాప్యమో, ప్రజల ఆకాంక్షలను బలంగా వినిపించే ఉద్దేశ్యమో, ప్రజలను ఉద్యమంవైపు మరింత బలంగా తీసుకుపోవాలనే తపన, తెలంగాణకు అడ్డుపడుతున్న వారిపైన ఆక్రోశంతోనో కొంత పరుష పదజాలం ఉపయోగించినా దాన్ని సమాజం స్వీకరించింది. అప్పట్లో ఉన్న పరిస్థితులను బట్టి ప్రజలు, అప్పటి ప్రభుత్వాలు కూడా తెలంగాణ కడుపు మంటను అర్థం చేసుకున్నాయి. కానీ నేడు కేసీఆర్ రెండో సారి ముఖ్యమంత్రి అయిన వ్యక్తి, ఆరు సార్లు ఎం.ఎల్.ఎగా, మూడు సార్లు ఎంపీలు, ఉమ్మడి రాష్ట్రంలో మంత్రిగా, డిప్యూటీ స్పీకర్గా, కేంద్ర మంత్రిగా, ఒక ప్రాంతీయ పార్టీ అధ్యక్షుడుగా, రెండోసారి ముఖ్యమంత్రిగా పనిచేస్తున్న వ్యక్తి, మంచి రాజకీయ అనుభవ శాలి, ఒక పరిపక్వత నేతగా ఎదగాల్సిన సమయంలో ఇలాంటి మాటలు యావత్తు తెలంగాణ సమాజాన్ని ప్రపంచం ముందు తలదించుకునేలా చేస్తున్నాయి.

బి.సి.ల రిజర్వేషన్ల గురించి మొదలు పెట్టి అనేక అంశాలపైన కేసీఆర్ ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. బీసీ రిజర్వేషన్లపైన 22 శాతం ఇవ్వడం, గతంలో 34 శాతం కంటే దాదాపు 12 శాతం తగ్గడం ఎలా సమర్థనీయం. ఇది హైకోర్టు ఆదేశాలు ఎలా అమలు చేయకుండా ఉంటామని అంటున్నారు. మరి పార్లమెంట్ సెక్రటరీల విషయంలో ప్రభుత్వం రీ పిటిషన్ వేసి తిరిగి వాటిని పొందేందుకు ప్రయత్నాలు చేయడం లేదా.. బి.సి. రిజర్వేషన్ల విషయంలో ఎబిసిడిఇ ప్రకారం కుల గణన చేసి ఎన్నికలు నిర్వహించమని కోర్టు చెప్పింది, మరి ఆ ఆదేశాలను అమలు చేయడం లేదు. లక్షా20 వేల మంది పదవులుంటాయి, ఎలా రిజర్వేషన్లను అమలు చేస్తా, ఐదేళ్ళు అవుతుందని కేసీఆర్ అంటున్నారు, అంటే అది హైకోర్టు ఉత్తర్వులను ధిక్కరించినట్టు కాదా. ఒక రోజులోనే 4 కోట్ల మంది సమగ్ర కుటుంబ సర్వే చేయించగలిగిన కేసీఆర్ ఇంత పెద్ద వ్యవస్థలో లక్షా 20 వేల పదవులకు రిజర్వేషన్ల కేటగిరి చేయలేరా.. అంటే ఇవన్నీ ఆయనకు ఇష్టం లేని పనులు, ఇక ఎవరో ఒక సర్పంచ్ కోర్టుకుపోతే అది కాంగ్రెస్ చేసిన కుట్రగా కేసీఆర్ చెబుతున్నారు. సర్పంచ్ పదవులకు రాజకీయ పార్టీల గుర్తులు ఉంటాయా ? ఒక గ్రామ సర్పంచ్ కేసు వేస్తే దాన్ని తప్పించడానికి ఇంత పెద్ద వ్యవస్థ ఏమి చేయలేదా..? చిత్త శుద్ధి ఉంటే చేయలేరా.. మరి అవన్నీ కాంగ్రెస్ మీద నెపం పెట్టి తప్పించుకోవడం ఇడియట్ పనులు కావా..?

కాంగ్రెస్ విషయంలోను, అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్ రెడ్డి విషయంలో ఇడియట్లు అని కేసీఆర్ మాట్లాడారు. ఓడిపోతే ప్రశ్నించవద్దా.. ? ఓడిపోతే ఇడియట్లు అయిపోతారా.. ? ఈ అసెంబ్లీ ఎన్నికలలో ఇవీఎంల పనితీరుపైన అనేక అనుమానాలు వ్యక్తం అయ్యాయి. ఓటర్ల తొలగింపు, ఓటర్ల నమోదు ప్రక్రియలో లోపాలు, అవకతవకలు, దాదాపు 22 లక్షల మంది ఓటర్లను తొలగించడం, దాదాపు లక్ష మంది ఓటర్లు ఆన్‌లైన్‌లో ఉన్నా ఓటు వేసే అవకాశం లేకుండా పోవడం లాంటి అనేక తప్పులు మనకు కళ్ళకు కట్టినట్టు కనిపించాయి. ఆ విషయంలో ఇ.సి. రజత్ కుమార్ స్వయంగా క్షమాపణ చెప్పారు. పోలింగ్ రోజున వేలాది ఇవిఎంలు సాంకేతిక లోపాలతో పని చేయకుండా పోయాయి. ఎన్నికల తరువాత దాదాపు 38 నియోజకవర్గాలలో పోలింగ్ ఓట్లకు, కౌంటింగ్ ఓట్లకు తేడాలున్నాయని స్వయంగా ఎన్నికల సంఘమే ఒప్పుకుంది. కేసీఆర్, కేటిఆర్ చెప్పినట్టుగానే ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్ ప్రకటించింది. కేసీఆర్ చెప్పినట్టుగానే ఆయనకు సీట్లు వచ్చాయి. వారు ఎవరు ఎన్ని ఓట్ల మెజారిటీతో గెలుస్తారో ముందుగానే చెప్పారు. కాంగ్రెస్‌లో ఉన్న ప్రముఖులు ఎవరెవరు ఓడిపోతారో ముందుగానే చెప్పారు. ఇవన్నీ అనుమానాలకు తావిచ్చేలా ఉన్నాయి. వాటిని ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రశ్నిస్తే అదేదో పెద్దతప్పులా ఇడియట్లు అని మాట్లాడడం ఏమి సంస్కృతి..

సహచర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును చాల రకాలుగా మాట్లాడారు. ఆయనను ప్రధాని నరేంద్రమోడీ సంకనాకావని, దేశంలోనే డర్టీ పొలిటికల్ లీడర్ అని అన్నారు. ఏకంగా దేశ ప్రధానిని సన్నాసి అని మాట్లాడారు. ఈ మాటలు అన్ని ఆయన ఒక ఉద్యమ నేతగా ఉన్నప్పుడు, ఉద్యమం నడుస్తున్నప్పుడు ప్రజలు అర్థం చేసుకున్నారు. కానీ నేడు నాలుగు కోట్ల జనాభా ఉన్న ఒక రాష్టానికి రెండోసారి ముఖ్యమంత్రి అయిన తరువాత కూడా ఇలాంటి బాషనే ఉపయోగిస్తే అది ఖచ్చితంగా తెలంగాణపైన దేశ ప్రజలకు ఒక చులకన భావం ఏర్పడుతుంది. దేశ రాజకీయాలలో ఒకప్పుడు నందమూరి తారక రామారావు 1989లో యునైటెడ్ ఫ్రంట్ పేరుతో ,1996లో చంద్రబాబు నాయుడు నేషనల్ ఫ్రంట్ పేరుతో క్రియాశీల పాత్ర పోషించారు. అప్పుడు వారద్దరికి కూడా హిందీ, ఇంగ్లీష్ బాషలతో సమస్యలు వచ్చాయా? ఆ రెండు సమయాలలో కేసీఆర్ ఆ పార్టీలోనే ఉన్నారు కదా.. రెండు దశాబ్దాల క్రితమే దేశంలో కీలక పాత్ర పోషించిన తెలుగు నాయకుల గురించే మనం పలుచన చేసుకునే విధంగా మాట్లాడడం బావ్యమా.. సిద్ధాంతపరమైన విభేదాలు, రాజకీయ విభేదాలుంటే వాటిని సాధారణ బాషలో వ్యతిరేకించడం కానీ, ఖండించడం కానీ చేయలేమా..? చంద్రబాబు నాయుడు ఇక్కడ రాజకీయాలు చేశారనే ఆగ్రహం కేసీఆర్‌కు ఉండడం సహజమే కానీ రాజకీయాలు ఎప్పుడు ఎటువైపు మలుపు తిప్పుతాయో తెలియదన్న విషయం మూడున్నర దశాబ్దాల రాజకీయ అనుభవం ఉన్న కేసిఆర్‌కు తెలియవా? ఒకప్పుడు 2009లో చంద్రబాబుతో పొత్తు పెట్టుకన్న సమయంలో చంద్రబాబు అపర రాజకీయ పరిజ్ఞానం ఉన్న నేత అని, రాజకీయంగా ఎంతో ముందు చూపు ఉందని, గొర్రె బెత్తెడు ఉన్న బడ్జెట్‌ను 60 వేల కోట్లకు పెంచి సంపదను సృష్టించిన మహానేత అని, ఐ.టికి పునాదులు వేసింది బాబేనని కేసీఆర్ అన్న వీడియోలు ఇంకా యుట్యూబ్లలో ఉన్న విషయం కేసీఆర్‌కు తెలియవా..? చంద్రబాబు నాయుడు ఒకసారి రాహుల్ గాంధీని, ఒకసారి మోడీని నిందించాడని కేసీఆర్ ఆగ్రహించారు. మరి అనేక సార్లు మాట మార్చి ప్రసంగాలు చేసిన కేసీఆర్ గురించి కూడా జనం అలాగే అనుకోవాలా? గజ్వేల్‌లో మిషన్ భగీరథ ప్రారంభించడానికి ప్రధాన మంత్రి వస్తే మీ హృదయంలో స్థానం ఉంటే చాలు.. మాకేమి వద్దు అని కేసీఆర్ ప్రసంగించలేదా.. మరి మొన్న పోయి 16 రకాల డిమాండ్లతో వినతిపత్రం ఇచ్చారు కదా.. ఇప్పుడు గుండెల్లో స్థానం వద్దా.. మరి? ఇవే 16 డిమాండ్లు అప్పుడే ఇచ్చి ఉంటే ఇప్పటికే చాల వరకు తెలంగాణకు వచ్చి ఉండేవి కాదా..? కాలేశ్వరం జాతీయ ప్రాజెక్టు అయి ఉంటే అప్పులు చేయడం తప్పుతుండే కదా.. కేసీఆర్ మానసపుత్రికలు అయిన మిషన్ భగీరథ, మిషన్ కాకతీయలకు కేంద్రం సహాయం అందిస్తుండే కదా.. ఇవేమి చేయకుండా రెండో సారి ముఖ్యమంత్రి అయ్యే వరకు ఎందుకు ఆగినట్టు..

కేసీఆర్ ఇచ్చిన మాటలు అన్ని నిలబెట్టుకున్నారా.. గత ఎన్నికలలో దళిత ముఖ్యమంత్రి చేయకపోతే తల నరుక్కుంటా అన్న విషయం వాస్తవం కాదా..? దళితులకు గిరిజనులకు కుటుంబానికి మూడు ఎకరాల భూమి ఇస్తామన్నది, గిరిజనులకు, ముస్లీంలకు 12 శాతం రిజర్వేషన్ ఇస్తామన్నది, లక్ష ఉద్యోగాలు ఇస్తామన్నది. హైదరాబాద్ రూరల్‌లో లక్ష ఇళ్ళ చొప్పున ఏడాదిలో రెండు లక్షల డబుల్ బెడ్ రూమ్లు కడుతా అన్నది నిజం కాదా.. ఇలా చెప్పుకుంటు పోతే చాంతాండంత లిస్టు ఉంది. అవన్నీ కేసీఆర్ మాట తప్ప లేదా.. దళితులను, ముస్లీంలను, గిరిజనులను, నిరుద్యోగులను, పేదలను అందరినీ మోసం చేసింది నిజం కాదా. మరోసారి గెలిస్తే అవన్నీ మాఫీ అయిపోనట్టేనా... రైతు బంధు పథకం వల్ల దేశంలోనే తెలంగాణకు మేలు జరిగిందని అంటున్నారు. మరి మూడున్నర దశబ్దాల అనుభవం ఉన్న కేసీఆర్‌కు ఎన్నికల ఏడాదిలో తప్ప అంతకుముందు రైతులకు పెట్టుబడి అవసరముంటుందన్న విషయం తెలియదా. గిట్టుబాటు ధరలు ఇవ్వకుండా కేవలం ఆయింట్‌మెంట్ లాంటి పెట్టుబడి పథకం వల్ల నిజమైన రైతులకు మేలు జరుగుతుందా..

బీసీలకు రిజర్వేషన్ల విషయంలో బీజేపీ అధ్యక్షుడు లక్ష్మణ్‌ను కూడా కేసీఆర్ తిట్టారు. ఏకంగా ప్రధాన మంత్రి నరేంద్రమోడీని ఓ సన్నాసి బి.సి ప్రధానిగా ఉన్నా కూడా బిసిలకు న్యాయం జరగలేదని అన్నారు. మతతత్వ రిజర్వేషన్లపైన బీజేపీ వ్యతిరేకంగా ఉంది. పార్లమెంట్లో ఆమోదం పొందితే తప్ప ముస్లీంలకు 12 శాతం రిజర్వేషన్లు ఇవ్వలేమన్న విషయం తెలిసి కూడా కేసీఆర్ ముస్లీం రిజర్వేషన్లపైన ఢిల్లీకి పంపి చేతులు దులుపుకున్నారు. మరి ఈ విషయంలో ఎవరు సన్నాసులు.. మోడీనా, కేసీఆర్‌నా? రాజకీయ ఫిరాయింపులు విషయంలో గతంలో కేసీఆర్ ఏమన్నారో రికార్డులున్నాయి. రాజకీయ ఫిరాయింపు అంటే రాజకీయ వ్యభిచారం. ఒక పార్టీలో గెలిచి ఇంకో పార్టీకి ఎలా పోతారు. రాజీనామాలు చేయకుండా పోతారా.. ఇదేనా నైతికత దీన్ని పత్రికలు ఎలా ప్రోత్సహిస్తున్నాయి. మీరు ఆ నేతలను నిలదీయండి అని విలేకరులకు సూచించారు. మరి ఇప్పుడు అదే అంశంపైన వారు వస్తామంటే మేమేమి చేయాలి, చేర్చుకోవద్దా అంటున్నారు. రాజకీయ ఫిరాయంపులపై అలా ఒక ముఖ్యమంత్రి మాట్లాడితే ఇక రాజకీయాలకు ఏమి విలువ ఉంటుంది.

విజయవాడ వార్తలు మాకు అవసరమా.. పొద్దున్నే ఆ ధరిద్రమంతా మా కేందుకు అని కేసీఆర్ ఆంధ్రా పట్ల అవమానకరంగా మాట్లాడారు. సాంకేతికంగా పరిధులు విస్తరించిన తరువాత ప్రపంచంలో జరుగుతన్న అంశాలను సెకన్లలో మనం చూస్తున్నాము. విజయవాడ వార్తలు తప్పెలా అవుతాయి. అక్కడ కూడా తెలుగు వారే ఉన్నారు. అనేక మంది ఆంధ్రా ప్రాంతం వాళ్ళు ఇక్కడ జీవిస్తున్నారు. ఇంకా చాల వరకు మీడియా సంస్థలు హైదరాబాద్ నుంచే వారి పనులను నడిపిస్తున్నాయి. అలాంటప్పుడు అక్కడి వార్తలు ఇక్కడ ప్రచురిస్తే తప్పెలా అవుతుంది. ఎన్నికల సమయంలో ఆంధ్రా వాళ్ళ కాలుకు ముల్లు గుచ్చుకుంటే తన పంటితో తీస్తానన్న కేసీఆర్ ఇలా ఎలా మాట్లాడారు. గతంలో సెటిలర్లు అని ఆంధ్రా ప్రాంతం వారిని అవమానపరచవద్దు అన్నారు. ఇక్కడ ఉన్న వారు అంతా అన్నదమ్ముల్లా ఉండాలని పిలుపునిచ్చారు. ప్రాంతాలుగా విడిపోదాం.. అన్నదమ్ముల్లా కలిసుందామన్న కేసీఆర్ ఇప్పుడెందుకు ఇలా మాట్లాడుతున్నారు. మొన్న ఎన్నికలముందు కూడా కేసీఆర్ ఆంధ్రా ఓట్ల కోసం ఎలా ప్రాధేయపడ్డారో మనం చూశాము. ఆంధ్రాలో ఉన్న విజయవాడ కనకదుర్గమ్మ మొక్కు, తిరుపతి వెంకన్న మొక్కు, విశాఖలో యాగాలు, చంద్రబాబు ఇంట్లో భోజనాలు, పరిటాల రవి ఇంట్లో విందులకు హాజరైన కేసీఆర్‌కు విజయవాడ వార్తలు అంటేనే ఎందుకు అంత అసహ్యం వచ్చింది. ఇందులో ఉన్న మతలబు ఏమిటి..? కేవలం నోటికి పనిపెట్టడం వల్ల, రాజకీయ పరిపక్వత కోల్పోయి మాట్లాడడం వల్ల తెలంగాణకే కాకుండా కేసీఆర్‌కు కూడా వ్యక్తిగతంగా చెడ్డపేరు వస్తుంది. అది తెలంగాణకు, తెలంగాణ ముఖ్యమంత్రికి మంచిది కాదు. రాజకీయాలు అంటే కేవలం పదువులు పొందడమే కాదు ప్రజాసేవ కూడా.. రాజకీయాలు అనేక సార్లు తిరగబడ్డాయి. అవన్నీ కేసీఆర్‌కు తెలియనివి కావు. ప్రధాన ప్రతిపక్షం లేకుండా పాలన చేయడం అంటే ఉప్పు కారం లేని కూడు తిన్నట్టు అని ఒక రాజకీయ విశ్లేషకుడు ప్రస్తావించారు. మరి ప్రతిపక్షం లేకుండా చేయడం ద్వారా ప్రశ్నించే వారు లేకుండా పాలన చేయాలనుకుంటే కేసీఆర్‌కు కూడా రుచి లేని తిండి లానే ఉంటుంది. ఇది గమనించి ప్రతిపక్షాన్ని గౌరవిస్తే మంచిది..

– కప్పర హరిప్రసాద్ రావు
ముఖ్య ప్రజా సంబంధాల అధికారి
తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ

శ్రీచైతన్య విద్యాసంస్థల నిర్వాహకులపై కేసు నమోదు

విజయక్రాంతి ,నిజామాబాద్‌అర్బన్: నగర శివారు లోని ఆర్మూర్ రోడ్డులోని శ్రీచైతన్య విద్యాసంస్థల యాజమా న్యంపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. నగరం లోని శ్రీముక్కా ఆయోధ్యరాం గుప్తా పాఠశాల(స్మాగ్)లో 2018– 19 విద్యా సంవత్సరంలో శ్రీచైతన్య విద్యాసంస్థను ఏర్పాటు చేశారు. పరిపాలనపరమైన అనుమతులు లేకుండానే హైదరాబాద్ ఫ్రాంఛైజీగా కార్పొరేట్ పాఠశాలను ఏర్పాటు చేశారు. సుమారు 600 మంది విద్యార్థులను పాఠశాలలో అడ్మిషన్లు అయ్యాయి. అయితే అనుమతులు మాత్రం రాక పో యినప్పటికి కార్పొరేట్ పాఠశాల పేరుచెప్పి అడ్మి షన్లను చేయ్యడమే కాకుండా అదే పేరుతో స్కూల్ పేరుతో నిర్వహణ చేస్తున్నారు. రూరల్ పోలీస్ స్టేషన్‌లో సంస్థ ప్రెన్సిపల్ శ్రీధర్, స్కూల్ ఇంచార్జీ అన్నందాన్ ప్రవీణ్‌లపై మోసం కేసు(420) ను నమోదు చేశారు.

ఘనంగా మల్లన్న ఉత్సవాలు



విజయక్రాంతి, కామారెడ్డి: కామారెడ్డి మండలం దేవునిపల్లి గ్రామంలో గల మల్లన్న దేవుని ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. గత రెండు రోజులుగా స్వామివారి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. సోమవారం స్వామివారి కల్యాణ మహోత్సవం కన్నుల పండుగగా నిర్వహించారు. కోరిన కోర్కెలు తీర్చే మల్ల న్నగా గుర్తింపు పొందిన స్వామివారిని దర్శించుకోవడానికి ప్రజలు వేలాదిగా తరలివచ్చారు. స్వామివారికి ఒడిబియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. బోనాలు తీసి చల్లంగా చూడాలని వేడుకున్నారు. ప్రతి సంవత్సరం డిసెంబర్ నెలలో మల్లన్న స్వామి ఉత్సవాలు ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఉత్స వాల సందర్భంగా ఆలయాన్ని అందంగా తీర్చిదిద్దారు. రెండు రోజుల నుంచే ఆలయం వద్ద దుకాణాల సందడి మొదలైంది. దేవునిపల్లి గ్రామస్తులే కాకుండా చుట్టుపక్క గ్రామాల నుంచి జనాలు వేలాదిగా తరలివచ్చి మొక్కులు తీర్చుకు న్నారు.మల్లన్న ఉత్సవాల సందర్భంగా ప్రతి సంవత్సరం గ్రామ దేవతలకు మొక్కు లు చెల్లించుకోవడం ఇక్కడి ఆనవాయితి. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవ త్సరం కూడా గ్రామస్తులు గ్రామ దేవతలైన పోచమ్మలకు మొక్కులు చెల్లించుకు న్నారు. పోచమ్మ ఆలయాలన్ని భక్తులతో కిటకిటలాడాయి. మిగతా గ్రామాల్లో దాదాపు ఉగాది పర్వదినాన్ని ఎడ్ల బండ్ల ఊరేగింపు ఉంటుంది. కాని దేవునిపల్లి గ్రామంలో మల్లన్న ఉత్సవాల రోజునే ఎడ్ల బండ్ల ప్రదర్శన నిర్వహిస్తారు.ఊరేగింపు అనంతరం ఆలయం వద్ద వెలిసిన దుకాణ సముదాయాల వద్ద యువతీ యువ కులు, చిన్నారులు తమకు నచ్చిన వస్తువులను, తిను బండారాలను కొనుగోలు చేసి జాతరను ఆస్వాదించారు.

కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించిన ఎమ్మెల్యే

విజయక్రాంతి, పరకాల: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకం నిర్మిస్తున్న కాళే శ్వరం ప్రాజెక్టును పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మంగళవారం సందర్శించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రాజెక్టు పనులను పర్యవేక్షించేందుకు రాగా మర్యాద పూర్వ కంగా కలిసేందుకు ఎమ్మెల్యే వెళ్లారు. ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. అనంతరం ప్రాజెక్టు పనులను నియోజకవర్గంలోని వివిధ మండలాల నాయకు లతో కలిసి సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట ఆత్మకూర్ జెడ్పిటీసి సంజీవరెడ్డి, నాయకులు రమణారెడ్డి, జాకీర్ అలీ, రమేష్, రవీందర్ పాల్గొన్నారు.

అంతిమయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే సీతక్క



విజయక్రాంతి, ములుగు: మండలంలోని జగ్గన్నపేట గ్రామానికి చెందిన ఈక పాపక్క ఈ రోజు ఉదయం అనారోగ్యంతో మృతి చెందగా విషయం తెలుసుకున్న ములుగు ఎమ్మెల్యే సీతక్క మంగళవారం చేరుకుని ఈక పాపక్క పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం పాపక్క అంతిమయాత్రలో పాల్గొని వారి కుటుంబసభ్యులను ఓదార్చారు. ఆమె వెంట కాంగ్రెస్ పార్టీ నాయ కులు పల్లె జయపాల్ రెడ్డి, మంకిడి పూర్ణ, బొమ్మకంటి రమేష్ తదితర నాయకులు ఉన్నారు.

మొబైల్ షాపు ప్రారంభించిన ఎమ్మెల్యే సీతక్క

మండల కేంద్రంలోని ప్రధాన రహదారి ఎదురుగా మంగళవారం ఎ1 మొబైల్ షాపును ములుగు ఎమ్మెల్యే సీతక్క ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లా డుతూ ములుగును జనవరిలో సమ్మక్క సారలక్క జిల్లా కాబోతుందని కనుక ములుగు వ్యాపార, వాణిజ్యపరంగా ఇంకా అభివృద్ధి చేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి నల్లెల్ల కుమారస్వామి, మొగుళ్ళభద్రయ్య, ఎండి యూనిస్, వేముల సమ్మిరెడడి, కుమార్ గౌడ్, ఎండి అహ్మద్ పాషా ఉన్నారు.

ట్రాఫిక్ సమస్యలను అధిగమించేందుకే ఈ–ఛలాన్



విజయక్రాంతి, జోగుళాంబ గద్వాల: నూతన జిల్లా కేంద్రంలో నెలకొన్న ట్రాఫిక్ సమస్యలను అధిగమించేందుకే ఈ – ఛలాన్ విధానాన్ని అమలు చేస్తున్నా మని జిల్లా ఎస్పీ లక్ష్మీనాయక్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని డీఎస్పీ కార్యాలయ ఆవరణలో ఈ–ఛలాన్ పద్ధతిని ఆయన ప్రారంభించారు. ఈ సంద ర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలను ప్రమాదాల బారి నుండి కాపాడేందుకు ఈ–ఛలాన్ దోహదపడుతుందన్నారు. ఈ విధానంతో వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ ఖచ్చితంగా పాటించే వీలుంటుందని ఆయన పేర్కొన్నారు. ట్రాఫిక్ నియమాలను అతిక్రమించిన వారికి వాహన నెంబర్లను టాబ్‌లో నిక్షిప్తం చేసి ఈ–టికెట్ ఇవ్వడం జరుగుతుందన్నారు. పెండింగ్ ఛలాన్ల వివరాలను వాహనదా రులు www.htp.gov.in లేదా www.echallan.org లో తెలుసుకునే అవకాశం ఉందన్నారు.ట్రాఫిక్ నియమాలను అతిక్రమించినట్లు ప్రజలు గుర్తించి ఆ ఫోటో లను ఫేస్‌బుక్ లేదా వాట్సాప్ నెంబర్ –9494921100 ద్వారా పంపితే అట్టివారిపై చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం పోలీసులచే ట్రాఫిక్ నియమాలపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ, ఆయా పోలీస్‌స్టేషన్ల ఎస్సైలు తది తరులు పాల్గొన్నారు.

నూతన సంవత్సర వేడుకల్లో ఇద్దరు యువకుల మృతి

విజయక్రాంతి, బాన్సువాడ: నూతన సంవత్సర వేడుకల్లో ఇద్దరు యువకులు దుర్మరణం పాలయ్యారు. డిసెంబర్ 31 అర్ధరాత్రి పొలాల్లో మద్యం సేవించి గ్రామంలోకి కిరాణ దుకాణంలోకి మోటారు సైకిలు మీద వెళుతుండగా ప్రమాదం జరిగి ఇద్దరు మృతి చెందారు. బాన్సువాడ పట్టణ సీఐ మహేష్‌గౌడ్ కథనం ప్రకారం బాన్సువాడ మండలం కోనాపూర్ గ్రామానికి చెందిన శ్రీకాంత్ అవాజ్ పల్లి గ్రామానికి చెందిన దిగంబర్ ప్రమాద స్థలంలోనే మృతి చెందాడు. మోటారు సైకిలు మీద ఉన్న మరో యువకుడు హిమకేత్ గాయాలతో ప్రాణాలతో బయట పడ్డారు. మద్యం మత్తు ఇద్దరు యువకుల ప్రాణాలు తీసిందని గ్రామస్థులు ఆవే దన వ్యక్తం చేస్తున్నారు. బాన్సువాడ సీఐ సంఘటన స్థలానికి వెళ్లి వివరాలను పరిశీలించారు.

యువత ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలి

విజయక్రాంతి, జోగుళాంబ గద్వాల: యువత ఆధ్యాత్మికతను అలవర్చుకోవా లని మాజీ మంత్రి డీకే అరుణ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని గోనుపాడు గ్రామంలోని చర్చిలో నిర్వహించిన నూతన సంవత్సర వేడుకలకు ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రజలు కలిసి ఉండి అన్ని పండగలను కలిసి మెలిసి నిర్వహించుకోవాలన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్‌చేసి ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరంలో ప్రజలు సుఖ శాంతులతో వర్ధిల్లాలని ఆమె ఆకాంక్షించారు. అనంతరం చిన్నారులకు కేక్ పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యవర్గ సభ్యుడు గడ్డం కృష్ణారెడ్డి, చర్చి పాస్టర్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు లేని ప్రైవేట్ పాఠశాలలతో
విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరం

విజయక్రాంతి, నిజామాబాద్‌అర్బన్: నగర శివా రులోని ఆర్మూర్ రోడ్‌లో శ్రీ చైతన్య పాఠశాలకు నిర్వ హణపరమైన అనుమతులు లేకుండా అడ్మిషన్లు చేసి విద్యార్థుల చేత తరగతులను నిర్వహించడంపై పోలీసులు కేసు నమోదు చేయ్యడం జిల్లాలో కలకలం సృష్టించింది. అనుమతులు లేని పాఠశాలలను విద్యా సంవత్సరం ఆరంభం లోనే గుర్తించి వాటిపై చర్యలు తీసుకోవడంలో విద్యాశాఖాధికారులు మీనమేషాలు లెక్కించడం ఇప్పుడు విద్యార్థుల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపనుంది. ప్రతి ఏడాది ఆక్టోబర్ మాసం లోనే ప్రైవేట్ పాఠశాలల రెన్యువల్స్ దరఖాస్తు చేసుకో వాల్సి ఉంటుంది. అప్పర్ ప్రైమరి పాఠశాలలకు జిల్లా విద్యాశాఖనే అనుమతులు ఇస్తుంది. ఉన్నత పాఠశా లలకు, కార్పొరేట్ విద్యాసంస్థలకు మాత్రం పాఠశాల విద్యాశాఖ సంచాలకులు అనుమతులు ఇస్తారు. ఇటీ వల తెలంగాణ ప్రభుత్వం ప్లే స్కూళ్లను కూడా అనుమతులు తీసుకుని మాత్రమే నిర్వహించాలని నిబంధనలు విధించింది. దానికి తోడు మున్సిపాల్టీ, అగ్నిమాపకశాఖ అనుమతులు రావడం కొత్త నిబం ధనల నేపథ్యంలో కఠినంగా మారింది.అయితే పాఠ శాలల నిర్వహణ అనుమతులు అనేది కఠినంగా అమ లు చేయ్యాల్సిన విద్యాశాఖ వాటిని ' మాములు'గా తీసుకోవడంతో ఈ వ్యవహారం ప్రహసనంగా మారిం ది. దానితో జిల్లాలో ఒక్క శ్రీచైతన్య పాఠశాలకే కాకుం డా చాలా పాఠశాలలకు అనుమతు లేవనేది జగమెరి గిన సత్యం.

అనుమతి ఒకదానికి నిర్వహణ మరోకటి..

జిల్లా విద్యాశాఖలో ప్రైవేట్ స్కూల్స్ నిర్వహణ అనునది అంతాపార్స్‌లాగా మారింది. ఎందుకంటే అనుమతి తీసుకునే పాఠశాలలో స్థాయిని బట్టి నిర్వ హించడంతో పాటు వాటి పేరుతో ఒకటి, రెండు అద నంగా బ్రాంచ్‌లను నడుపుతున్న ఎవ్వరికి పట్టదు. ప్రాథమిక పాఠశాల అనుమతి ఉండే అప్పర్ ప్రైమరి పాఠశాల వరకు అడ్మిషన్లు తీసుకోవడం, అప్పర్ ప్రైమరి పాఠశాలలకు అనుమతి ఉండే హైస్కూళ్లను నిర్వహించడం పరిపాటిగా మారింది. పాఠశాలలను అధికారులు క్షేత్రస్థాయిలో అనుమతులు ఉన్నది లేనిది సీఆర్‌పీలు, ఎంఆర్‌సీ కో ఆర్డినేటర్లు ఇచ్చే సమాచారంపై ఆధారపడటంతో అనుమతులు లేని పాఠశాలల గురించి ముందుగా మండల విద్యాశాఖా ధికారులకు తెలియదని వారు ఇచ్చే సమాచారంపై ఆధారపడే జిల్లా అధికారులకు తెలియదనేది నిజం. ఇంచార్జ్ మండల విద్యాశాఖాధికారులకు ప్రభుత్వ పాఠశాలలపై పూర్తి అజమాయిషీకి దిక్కులేకుండా పోవడంతో వారికి ప్రైవేట్ పాఠశాల నిర్వహణ తీరు బడి లేకుండా పోయింది. జిల్లాలో ఎక్కువ సంఖ్యలో ప్లే స్కూల్స్ ఉన్న వాటికి పెద్ద స్కూల్స్‌కు సంబంధిం చిన అనుమతి పత్రాల మీదనే నడుస్తున్న వాటిని పట్టించుకుని కట్టడి చేసేవారు లేరు.

జిల్లా కేంద్రంలోనే అనుమతులు లేని పాఠశాలలు ఎక్కువ...

జిల్లా విద్యా రంగాన్ని పరిశీలించే జిల్లా అధికా రులు కొలువైన నిజామాబాద్ అర్బన్‌లో అనుమతులు లేని పాఠశాలలు ఎక్కువ. ఎందుకంటే ఇక్కడ నిర్వహణకు సరిపడా అధికారులు లేరు. నాలుగు మండలాలకు ఒకే ఒక్క మండల ఇంచార్జీ అధికారి ఉన్నారు. 400కు పైగా ప్రభుత్వ పాఠశాల లను పట్టించుకోవాలా దానిలో సగానికిపైగా ఉన్న ప్రైవేట్ పాఠశాలలను పట్టించుకోవడం అనేది తనకు మించిన భారంగా ఉంది. విషయంపై జిల్లా అధికార యంత్రాంగానికి ఫిర్యాదులు వెళ్లిన వారు జిల్లా విద్య శాఖాధికారులకు సిఫార్సు చేయ్యడం అక్కడి నుంచి మండల విద్యాశాఖాధికారిని దానిని పురమాయించ చడం అనేది సర్వసాధారణంగా మారిందనే విమర్శలు ఉన్నాయి. పాఠశాలలకు అనుమతుల విషయం నామినల్ రోల్స్ సమర్పణలో తెలిసిన అధికారులు పట్టించుకోవడం లేదని దానిని మండల విద్యాశాఖా ధికారులు భాధ్యులని వాటికి పదోతరగతి అనుమతి లేదని అది మాపరిధిలోకి రాదని దాటవేత దోరణి కొనసాగుతుంది. ఇప్పటికైనా జిల్లా అధికార యంత్రాంగం గుర్తింపు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోకపోతే వందలమంది విద్యార్థుల భవిష్యత్తు అనేది అగమ్యగోచరం కావడం ఖాయం.

సమస్యలను సీఎంకు వివరిస్తాం



విజయక్రాంతి, నాగర్‌కర్నూల్: జిల్లాలోని పాల మూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులను త్వరి తగతిన పూర్తి చేసేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తుందని విశ్రాంత ఇంజనీర్ల బృందం నేత శ్యాం ప్రసాద్‌రెడ్డి వివరించారు. బుధవారం నాడు జిల్లాలో కొనసాగుతున్న పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులను బృందంతో కలిసి ఆయన పరిశీలిం చారు. మొదటగా నార్లాపూర్, ఏదుల, వట్టెం రిజర్వా యర్ల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏ ర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లా డుతూ పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వా రా ఉమ్మడి పాలమూరు జిల్లాలో 10లక్షల ఎకరాల కు సాగునీరు అందించే విధంగా ప్రాజెక్టు పనులను ప్రారంభించడం జరిగిందని ఆయన తెలిపారు. ప్రాజె క్టు పనులలో జాప్యం కాంట్రాక్టర్లు, ప్రజల, ఇంజనీర్ల సమస్యలను తెలుసుకునేందుకే ముఖ్యమంత్రి కేసీ ఆర్ ఆదేశం మేరకు ప్రాజెక్టు పనులను పరిశీ లించడం జరిగిందని తెలిపారు.

భూసేకరణ టర్నల్ నిర్మాణం పనులలో కొంత జాప్యం జరిగిందని తమ పరిశీలనలో ప్రజా సమస్య లను తెలుసుకుంటున్నట్లు తెలిపారు. ఐదు రిజర్వా యర్ల ద్వారా పూర్తి చేసే పాలమూరు ఎత్తిపోతల పథ కంపనులను త్వరితగతిన పూర్తిచేసేందుకు ప్రభుత్వం నుండి అన్ని చర్యలు చేపట్టడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ నెల 4న ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రాజెక్టు పనులపై సమీక్షను నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

ప్రాజెక్టు పనులలో తమ దృష్టికి వచ్చిన సమస్య లను సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి కేసీఆర్‌కు వివరించి వాటి పరిష్కారానికి వెంటనే చర్యలు తీసు కోవడం జరుగుతుందని ఆయన తెలిపారు. నార్లా పూర్ వద్ద 44 ఎకరాల భూసేకరణ అవసరం ఉంద ని , టర్నల్ నుండి తవ్వే మట్టిని డంపు చేసేందుకు ఈ భూసేకరణ అవసరం ఉందని ఇందుకు 10ఎకరాలకు సంబంధించిన రైతులు భూమినిఇచ్చేందుకు అంగీక రించారని,మిగిలిన రైతుల సమస్యలను సమీక్షలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. మహాత్మా గాంధీ ఎత్తిపోతల పథకంలో కూడా పూర్తిస్థాయిలో మోటర్ల వినియోగానికి కృషి చేస్తామని ఆయన వివ రించారు.

రెండు రోజుల పాటు జిల్లాలో పర్యటించనున్నట్లు అనంతరం కాళేశ్వరం ప్రాజెక్టు పనులను కూడా తమ బృందం సందర్శిస్తుందని తెలిపారు.

పల్లె పీఠాలు దక్కేదెవరికో?

విజయక్రాంతి, బోధన్: పంచాయితీ ఎన్నికల రిజర్వేషన్‌లు ఖరారయి ఎన్నిక లకు నోటిఫికేషన్ విడుదలయినందున గ్రామాల్లో పల్లె పీఠాల ఎన్నికల జోరు రోజు రోజుకూ పెరుగుతుంది.పల్లె పీఠాలు ఎవరికి దక్కుతాయో అనే ఉత్కంఠ నెలకొం టుంది.ఎన్నికల నగారా మోగటంతో అధికార ప్రతి పక్ష పార్టీలు తమ అభ్యర్థుల గెలుపు కోసం తమదైన వ్యూహాలు రచిస్తూ ఎన్నికల సమరంలో దూసుకుపోతున్నారు. గెలుపు తమదంటే తమదేనని అధికార ప్రతిపక్షాలు చెప్పుకొస్తున్నాయి.టీఆర్ ఎస్,కాంగ్రెస్ పార్టీల స్థానిక నేతలు ఎన్నికలకోసం హడావుడి చేస్తున్నా ఎమ్మెల్యేలు మాత్రం అభ్యర్థుల గురించి ఎలాంటి సంకేతాలు ఇవ్వటంలేదు.అధికార పార్టీనుంచి పోటీ చేస్తే గెలిచే అవకాశాలు ఎక్కువ ఉన్నందున టీఆర్‌ఎస్ పార్టీ నుండి పోటీ చేయ టానికి అభ్యర్థులు మక్కువ చూపిస్తున్నారు.అటు రూరల్ ఏరియాలలో కంగ్రెస్ పార్టీ దృఢంగా ఉన్నందున,ఎమ్మెల్యే ఎన్నికలలో కాంగ్రెస్ కు గ్రామాల్లో మంచి మెజారిటీ వచ్చినందున కాంగ్రెస్ పార్టీ నుండి సర్పంచ్‌గా పోటీ చేయటానికి అభ్యర్థులు ఆసక్తి చూపుతున్నారు.గ్రామపంచాయితీ ఎన్నికల వేల గ్రామాల్లో పార్టీలకు చోటుండదని ప్రజలకోసం పనిచేసే ఉత్తమ అభ్యర్థికే తమ ఓటు వేస్తామని గ్రామీణ ఓటర్లు అంటు న్నారు.రాజకీయ పార్టీలకు అతీతంగా గ్రామ పంచాయితీ ఎన్నికల్లో అభ్యర్థుల పలుకు బడి ,సేవాభావం చూసి ఓట్లు వేస్తామని గ్రామీణ ఓటర్లు చ్చెకొస్తున్నారు.గ్రామీణ ప్రాంతాల్లో పార్టీలకు అంతగా ప్రాధాన్యత ఉండదని,ఆయా గ్రామాలకు చెందిన నిజా యితీ గల ప్రజా సేవకులనే గ్రామీణ ప్రజలు ఎన్నుకుంటారని,అభ్యర్థి ఏపార్టీకి చెందిన వారని ప్రజలు చూడరని అభ్యర్థి స్వభావానికే పెద్దపీత వేస్తూ ప్రజలు సర్పంచ్ ఎన్ని కలలో అభ్యర్థులను ఎన్నుకుంటారని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.ఏదిఏమైనా వచ్చే పంచాయితీ ఎన్నికల్లో పల్లె పీఠాలు ఎవరికి దక్కుతాయోననే ఉత్కంఠ రోజురో జుకూ పెరుగుతుంది.

కస్తూర్బాగాంధీ విద్యాలయాలను తనిఖీ చేసిన జిల్లా విద్యాధికారి

విజయక్రాంతి, కల్వకుర్తి: కల్వకుర్తి ,ఉర్కొండ పేట కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలను ఆకస్మికంగా సందర్శించి జిల్లా విద్యాధికారి సహదేవుడు తనిఖీ నిర్వహించారు.కేజీబీవీలో ఉపాధ్యాయుల,విద్యార్థుల రిజిస్టార్లను,పరిసరాలను, విద్యార్థినిలకు వండిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.విద్యార్థులతో మాట్లా డుతూ నాణ్యమైన బోజనం కావలసిన వసతులు అమ్మాయిల అభ్యున్నితికై తెలంగాణ ప్రభుత్వం కేజీబీవిలను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందని చదువుకునే ప్రతి అమ్మాయి మంచిగా చదువుకొని భవిష్యత్తులో ఉన్నత స్థానంలో రాణిం చేలా చదవాలని ఆయన సూచించారు.

ఘనంగా అయ్యప్ప స్వాముల ఇరుముడి

విజయక్రాంతి, అచ్చంపేట: భక్తి, శ్రద్ధ అనే రెండు భాగములుగా ఇరుము డిని కట్టి దీక్ష భూనిన స్వామి తన నెత్తిపై మోస్తూ శబరిమల అయ్యప్ప స్వామి వారి చెంతకు చేర్చి తన మొక్కులను చెల్లించుకొని తన భక్తిని చాటుతాడు. ఈ సందర్భంగా అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని 41 రోజుల పాటు దీక్ష భూనిని అయ్యప్పలు మంగళవారం అయ్యప్ప దేవాలయంలో 20 మంది స్వాములు గురుస్వాములు పులిజాల రమేష్, శ్రీను స్వాముల ఆద్వర్యంలో ఇరుముడి కార్య క్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా ఇరుముడి సంధర్భంగా ఆలయా నికి చేరుకున్న దీక్ష స్వాముల బంధువులు ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజలో అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బాల్కొండకు నేడు సీఎం రాక

- శరవేగంగా ఎస్సారెస్పీ పునర్జీవ పథకం పనులు
- రెండు పంప్ హౌజ్ పనుల పరిశీలన
- ఇరిగేషన్ అధికారులతో సమీక్ష



విజయక్రాంతి,ఆర్మూర్: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ పునర్జీవ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఉత్తర తెలంగాణ వరప్రదాయిని ఎస్సారెస్పీ.ఈ ప్రాజె క్ట్‌కు ఎగువ ప్రాంతంలో మహారాష్ట్ర ప్రభుత్వం ప్రా జెక్టులు నిర్మించడంతో ఎస్సారెస్పీ ప్రశ్నార్థకంగా మా రింది.దీంతో టీఆర్‌ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ద్వారా ఎస్సారెస్పీకి నీటిని అందించడాన్నికి శ్రీరాంసాగర్ పునర్జీవన పథకంను ఏడాదిన్నర క్రితం ప్రారంభించి నది.ఈ పథకంకు ప్రభుత్వం రూ.1080 కోట్లు కేటా యించింది. ఈ పనులు 60 శాతం వరకు పూర్తి అ య్యాయి.మిగితా 40 శాతం పనులు పూర్తి కావాల్సి వుంది.కాళేశ్వరం ద్వారా నీటిని కరీంనగర్‌లోని మానే రు డ్యామ్‌లో నీటిని నింపి వాటిని వరద కాలువల ద్వారా రివర్స్ పంపింగ్‌తో శ్రీరాంసాగర్‌కు నీటిని మ ళ్లీస్తారు.మానేరు డ్యాం నుంచి వచ్చిన నీటిని ఎత్తిపో యడానికి మూడు(3) పంప్‌హౌజ్ ఏర్పాటు చేశా రు.మానేరు డ్యామ్ ద్వారా వరదకాలువ నీటిని విడు దల చేసిన తర్వాత మల్యాల మండలం రాంపూర్ గ్రామం వద్ద పంప్‌హౌజ్‌ను ఏర్పాటు చేశారు.అలాగే ఇదే జిల్లాలోని ఇబ్రహీంపట్నం మండలం రాజేశ్వర్ రావు పేట్ గ్రామంలో మరో పంప్‌హౌజ్‌ను నిర్మిస్తు న్నారు. నిజామాబాద్ జిల్లాలోని బాల్కొండ మం డలం ముప్కాల్ మండల కేంద్రంలోని ఎస్సారెస్పీ జీరో పాయింట్ వద్ద పంప్‌హౌజ్‌ను నిర్మిస్తున్నారు. ముందస్తు ఎన్నికల నేపథ్యంలో పంప్‌హౌజ్ పనులు మందకొడిగా కొనసాగాయి.ఇప్పుడు ఈ పనులను సీఎం కేసీఆర్ బుధవారం పరిశీలించనున్నారు.ఎన్ని కల అనంతరం సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన కేసీ ఆర్ పనులను పరిశీలించాలని భావించినప్పటికి వా తావరణ పరిస్థితుల మూలంగా కార్యక్రమాన్ని రద్దు చేసుకున్నారు. సీఎం పర్యటన ఖరారు కావడంతో గుత్తేదారులు(కాంట్రాక్టర్‌లు) పనులను ముమ్మరం చేస్తున్నారు.వరద కాలువ పై కొనసాగుతున్న పను లను ఈఎన్సీ ఆనిల్‌కుమార్,ఈఈ సుధాకిరణ్ పరిశీలించారు.పనులను వేగవంతం చేయడాన్నికి కాంట్రాక్టర్‌లు కూలీలను ఎక్కువ సంఖ్యలో నియమిం చారు.దీంతో పనులు వేగవంతం అవుతున్నాయి. మొదట మల్యాల మండలం రాంపూర్ గ్రామంలోగ ల పంప్‌హౌజ్‌తోపాటు ఇబ్రహీంపట్నం వద్ద గల రాజరాజేశ్వర్‌రావు పేట వద్ద గల పంప్‌హౌజ్‌లను పూర్తి చేసి మే నాటికి నీటిని ఎస్సారెస్పీలోకి అందిం చాలని ప్రభుత్వం భావిస్తుంది. వచ్చే జూన్ మాసంలో ని ఖరీఫ్‌కు ఎస్సారెస్పీ ద్వారా ఆయకట్టుతోపాటు మంచినీటిని అందించాలని ప్రభు త్వం నిర్ణయించి నట్లు తెలిసింది.

ఎస్సారెస్పీ రివర్స్‌పంపింగ్ ద్వారా రోజుకు ఒక టీఎంసీ నీటిని ప్రాజెక్ట్‌లోకి పంపానున్నారు.దీంతో శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ క్రింద ఉన్న ఆయకట్టు 6 లక్షల ఎకరాలకు ఖరీఫ్,రబీ పంటలకు నీటిని అందించే అవ కాశం ఉంది.దీనిని మే నాటికి ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సంకల్పించినట్లు తెలు స్తోంది.నేడు సీఎం కేసిఆర్ రాంపూ ర్ గ్రామంలోని పంప్‌హౌజ్‌ను పరిశీలించి ఆనంతరం రాజేశ్వర్‌రావు పేట్‌లోని పంప్‌హౌజ్‌ను పరిశీలించనున్నారు.పరిశీ లించిన అనంతరం ఇరిగేషన్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు.మే నాటికి శ్రీరాంసా గర్ పునర్జీవన పథకం పూర్తి చేసి నీటిని అంది స్తామని ఇరిగేషన్ ఆధికారులు పేర్కొన్నారు.

హైకోర్టు విభజన న్యాయవాదుల విజయం



విజయక్రాంతి, వనపర్తి: హైకోర్టు విభజన తెలంగాణ న్యాయవాదుల విజయమే నని వనపర్తి బార్ అసోసియేషన్ అధ్యక్షులు వెంకటస్వామి అన్నారు. మంగళవారం హైకోర్టు విభజన జరిగిన సందర్భంగా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వనపర్తి కోర్టు దగ్గర ఉన్న న్యాయ దేవతకు న్యాయవాదులు పూల మాలలు వేసి సంబురాలు జరుపు కున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో న్యాయవాదులు చేసిన పోరాటం మరువలేనిదన్నారు. అందు కోసమే రాష్ట్ర ముఖ్య మంత్రి కేసీఆర్ ఐదేళ్ల ముందుగానే ఉమ్మడి హైకోర్టును విభజన చేపట్టి న్యాయవా దులకు కానుకగా ఇచ్చారని ఆయన చెప్పారు. కార్య క్రమంలో వనపర్తి న్యాయవాదులు వెంకటరమణ,బక్షి చంద్రశేఖర్‌రావు, మోహన్‌కుమార్, ఉత్తరయ్య , బ్రహ్మయ్య,వెంక టేష్,జీపీలు శశిభూషన్, భరత్‌కుమార్ తదితరులు ఉన్నారు

పరకాలలో...

తెలంగాణ రాష్ట్ర హైకోర్టు అవతరణను పురస్కరించుకుని మంగళవారం పరకాల జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో న్యాయవాదులు సంబరాలు జరుపుకున్నారు. ఆంగ్ల నూతన సంవత్సరం రోజు హైకోర్టు అవతరణ కావడం సంతోష దాయకమని బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు కూనూరు సురేష్‌కుమార్, న్యాయవాదులు పెండెల భద్రయ్య అన్నారు.

మానసిక వికలాంగులతో ఎమ్మెల్యే నూతన సంవత్సర వేడుకలు



విజయక్రాంతి, వరంగల్ అర్బన్: ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్‌రావు మంగళవారం హన్మకొండలోని తన నివాసంలో నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు. నిత్యం ప్రజల మధ్య పాలనగావించే ఎర్రబెల్లి దయాకర్ రావు నూతన సంవత్సరం దినాన కాస్త సేదతీరాడు. కుటుంబ సభ్యులతో నూతన సంవత్సర వేడుకలు జరుపుకోకుండా వినూ త్నంగా వేడుకలు నిర్వహించారు. మల్లికాంబ మనోవికాస కేంద్రానికి చెందిన మానసిక వికలాంగ పిల్లలతో తన నివాసంలో జనవరి1, 2019 వేడుకలను మంగళవారం జరు పుకున్నారు. వేడుకల్లో భాగంగా ఎర్రబెల్లి దయాకర్‌రావు–ఉషా దంపతులు మానసిక వికలాంగ పిల్లలకు స్వీట్లు పంచి సంబురాలు జరుపుకున్నారు. అనంతరం మానసిక విక లాంగ పిల్లలతో కాసేపు ఉల్లాసంగా గడిపారు.

వృద్ధాశ్రమానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే

పాలకుర్తి మండలంలోని వల్మిడి గ్రామం శివారు చంద్రగార్డెన్,పార్వతిపురం లో వేల్పుల వద్ధాశ్రమానికి పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్‌రావు శంకుస్థాపన చేసినట్లు ఆశ్రమ నిర్వహాకులు,శ్రీకన్య ఎడ్యూకేషనల్ సోసైటి చైర్మన్ వేల్పుల బిక్షపతి తెలిపారు. మంగళవారం బిక్షపతిమాట్లాడుతూ కన్నబిడ్డల ప్రేమకు దూరమై ఆనాథలుజీవిస్తున్న వృద్ధులకు చేరదీసి సేవాచేయుటకు వృద్ధాశ్రమ నిర్మాణంను చేపట్ట డంజరిగిందని అన్నారు.వృద్ధాశ్రమంతో పాటు వికలాంగ పిల్లలకు నివాసం ఏర్పాటు చేసి విద్యానుఅందించడం జరుగుతుందని వివరించారు.వృద్ధాశ్రమ నిర్మాణంను మూడు నెలలో పూర్తిచేసి సేవాకార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.కార్యక్రమంలో శ్రీకన్య ఎడ్యూకేషనల్ సోసైటి ప్రధానకార్యదర్శి వేల్పుల సుహాసని,వల్మిడి ఎంపీటీసీ కత్తిసైదులు, రైతు సమన్వయ మండల కన్వీనర్ వీరమనేని యాకాంతరావు, మాజీ సర్పంచ్ రాపర్తి కోమురయ్య,మాజీ సర్పంచ్,ఎంపీటీసీ బీసులలిత, టీఆర్‌ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షులు పార్వతి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

చేతికి వచ్చిన ధాన్యం కాలిబూడిదైంది



విజయక్రాంతి, ములుగు: జయశంకర్ భూపాలపల్లి జిల్లా వెంకటాపూర్ మండల కేంద్రంలోని ఎలక్ట్రికల్ సబ్ స్టేషన్ ఎదురుగా 200 వరి ధాన్యం బస్తాలు కాలి బూడిద య్యాయి. వివరాలలోకి వెళితే వెంకటాపూర్ మండల కేంద్రానికి చెందిన నరేడ్ల జనార్ధన్ అనే రైతు ఖరీఫ్ పంట పూర్తి కావడంతో పొలంలోనే వరిధాన్యాన్ని గోని సంచిలో 200 బస్తాలను నింపి ఉంచగా 1076 పేరు గల ధాన్యాన్ని ఎవ్వరు కొనుగోలు చేయకపోవడం వలన దాదాపు నెల నుండి పొలంలోబస్తాలల్లో ధాన్యం అలాగే ఉండిపోయింది. మంగ ళవారం ఆకస్మికంగా పొలంలో మంటలు చెలరేగి వరి గడ్డి ఎక్కువ ఉండటంతో గాలి తీవ్రత ఉండటం వలన ధాన్యం పైకి మండలు చెలరేగాయి. రోడ్డు ప్రక్కన నుండి పోతున్న గ్రామస్థులు చూసి సంబంధిత రైతు జనార్ధన్ సమాచారం ఇవ్వగా అతను ఇంటి వద్ద నుండి హుటా హుటినా సంఘటన స్థలానికి చేరుకున్నప్పటికి వరిధాన్యం కాలిపోయింది. ఈ రైతును ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు. అనంతరం సంఘటన స్థలా నికి గ్రామస్థులందరు చేరుకుని గోనే సంచులతో మంటలను ఆర్పివేయడం జరిగింది. ములుగు ఫైర్ స్టేషన్‌కు ఫోన్ చేయగా ఫైర్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంట లను ఆర్పివేశారు.

అసహాయులకు అండగా నిలవాలి



విజయక్రాంతి, మహబూబ్‌నగర్: సమాజంలోని అసహాయులకు అండగా నిలవ డంలో లభించే సంతృప్తి మహోన్నతనమైనది, జీవితానికి సార్థకత కలిగించే ఇటువంటి కార్యక్రమాల పట్ల పోలీసులు ఎల్లవేళలా ముందు నిలుస్తుందని జిల్లా ఎస్పీ రెమా రాజే శ్వరి అన్నారు . పోలీస్ కార్యాలయానికి వచ్చిన బ్రహ్మ మానసిక వికలాంగులతో కలిసి ఎస్పీ కేక్‌కట్ చేసి వారితో సంతోషంగా సంభాషించారు. ఈ సందర్భంగా చిన్నారులు ఎంతో ప్రేమతో నూతన సంవత్సర శుభాకాంక్షలు అంటూ అక్కడ ఉన్న పోలీస్ అధి కారులకు చెప్పడంతో వాతావరణం మరింత ఆత్మీయంగా, ఉత్సాహంగా ఆనందకరంగా ఏర్పడింది. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు, డీఎస్పీలు సీఐలు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు .

విజయక్రాంతి క్యాలెండర్ ఆవిష్కరణ

విజయక్రాంతి, నిర్మల్: విజయక్రాంతి దినపత్రిక రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను మంగళవారం జిల్లా కేంద్రంలో ఎస్పీ శశిధర్ రాజు చేతుల మీదుగా విడుదల చేశారు. జిల్లా స్టాఫ్ రిపోర్టర్ సిరిగె రమేష్, అడ్వర్టైజ్ మెంట్ ఇన్‌ఛార్జ్ సంతోష్ ఆధ్వర్యంలో క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ శశిధర్ రాజు విజయక్రాంతి యాజమాన్యానికి న్యూ ఇయర్ శుభాకాంక్షలు తెలిపారు.


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ శశిధర్ రాజు

బాసరలో భక్తుల సందడి



విజయక్రాంతి, బాసర: నిర్మల్ జిల్లా ప్రసిద్ధ పుణ్య క్షేత్రం బాసర శ్రీ జ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయం లో మంగళవారం భక్తుల సందడితో పాటు కొత్త సంవత్సర సందడి నెలకొంది. నూతన సంవత్సరం పురస్కరించుకొని మన రాష్ట్రం నుంచే కాకుండా మహారాష్ట్ర, ఏపీ తదితర ప్రాంతాల నుంచి భక్తులు బాసరకు తరలివచ్చారు. ముందుగా పవిత్ర గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తులు తమ చిన్నారులకు అక్షరాభ్యాసాలు చేయించారు.

ఆలయ వార్షికోత్సవం

విజయక్రాంతి, ఉట్నూర్: మండల కేంద్రంలోని బోయవాడకాలనీలోని అయ్యప్ప ఆలయ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. చెన్నురుకు చెందిన వేద పండితులు రజని, ఆలయ పూజారి దిపక్‌దూపే ఆధ్వర్యంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకొని పూజ , హోమం, గణపతి పూజ, మృత్యుంజయ, నవ గ్రహపూజ, అభిషేకం, అష్టదిక్కుల శాంతి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు పూజారి తీర్థప్రసాదాలు అందించారు.

యువ-2019

విజయక్రాంతి, మంచిర్యాల: మంచిర్యాలలో యూత్ ఫర్ సేవా ఆధ్వర్యంలో యువ-2019 కార్యక్రమును వివేకానంద 157వ జయంతిని పురస్కరించుకొని నిర్వహించడం జరుగుతుందని యూత్ ఫర్ సేవా సమితిసభ్యులు తెలియజేశారు. మంగళవారం యూత్ ఫర్ సేవా సమితి సభ్యుల ఆధ్వర్యంలో యువ-2019 కరపత్రాలను విడుదల చేశారు. యువ-2019లో భాగంగా వ్యాసరచన, క్విజ్, రంగోలి, గ్రూప్‌డ్యాన్స్, గ్రూప్ సింగింగ్, కోక్కో, కబడ్డి, సాంప్రదాయ దస్తులతో ఫ్యాషన్ సెంటర్ ను విద్యార్థులకు, డిగ్రీ విద్యార్థులకు వేర్వేరుగా నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమాన్ని అన్ని కళాశాలల, పాఠశాలల యాజమాన్యాలు విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల యూత్ ఫర్ సేవా సభ్యులు వెరవెల్లి రఘునాథ్, వివిధ కళాశాలల ప్రిన్సిపాల్లు, అధ్యాపకుల, మారిశెట్టి శ్రీనివాస్, కిషోర్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డు మృతి

విజయక్రాంతి, బాసర: నిర్మల్ జిల్లా బాసర శ్రీ జ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయంలో హోంగార్డుగా పని చేస్తున్న విఠల్ (30) సోమవారం రాత్రి ప్రమాదవశాత్తు పడి మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. ఆదిలాబాద్ జిల్లాకు చెందిన విఠల్ గత కొద్ది రోజులుగా ఆలయంలో హోంగార్డుగా పని చేస్తున్నాడు. సోమవారం రాత్రి తన ద్విచక్రవాహనంపై రైల్వే స్టేషన్ వస్తున్నాడు. స్టేషన్ ముఖ ద్వారం వద్ద అదుపు తప్పి కింద పడి అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, కూతురు ఉంది. ఈ మేరకు ఎస్సై మహేష్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు.

చలి గజగజ

బయటకు వెళ్లాలంటే జంకుతున్న జనం

విజయక్రాంతి, బోథ్: జిల్లాలో రోజు రోజుకు ఉష్ణోగ్రతలు పడిపోతుండటంతో బోథ్ నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల కంటే భిన్నంగా బోథ్‌లో చలి చుక్కలు చూపెడుతుండటంతో ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఒకే రకమైన వాతావరణం నెలకొనడం చల్లని గాలులు వీస్తుండటంతో ప్రజలు చలి మాట వింటేనే జంకుతున్నారు. మరోపక్క బోథ్‌లో గతం నుండే చలి తీవ్రత ఎక్కువగా ఉంటుందని ముసలి వారి నోటి మాటగా వినిపిస్తోంది. ఏదేమైనా ఇంత గోరమైన చలిని చవి చూస్తున్న వృద్ధులు, పిల్లలు చలిని మాత్రం తట్టుకోలేకపోతున్నారు. స్వెట్టర్లు, మంకీ క్యాప్‌లు వేసుకుంటూ కాస్త ఉపశమనం పొందుతున్నారు. ఏదేమైనా ఈ చలి తీవ్రత ఇంకెన్నాళ్లు అని భయపడుతున్నారు.

రిజర్వేషన్లు ఖరారు

విజయక్రాంతి, పటాన్‌చెరు: పటాన్‌చెరు నియోజకవర్గంలో ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న గ్రామ పంచాయతీల వారీగా రిజర్వేషన్లు ప్రకటించారు. జిల్లా యంత్రాంగం రిజర్వేషన్లు ప్రకటించడంతో చాలా రోజులుగా సాగుతున్న ఉత్కంఠతకు తెరపడింది. మండలాల పరిధిలోని గ్రామపంచాయతీల రిజర్వేషన్ల వివరాలు ఇలా ఉన్నాయి.

పటాన్‌చెరు,, అమీన్‌పూర్, జిన్నారం, గుమ్మడిదల మండలాల్లో రిజర్వేషన్లు ఖరారు కావడంతో ఆశావహులు రంగంలోకి దిగారు.

హుండి దొంగలించిన వ్యక్తి అరెస్టు

విజయక్రాంతి, దుబ్బాక: దుబ్బాక నగర పంచాయతీ పరిధిలోని రేకులకుంట మల్లిఖార్జున స్వామి ఆలయంలో ఉన్న హుండిని ఇటీవల దొంగలించిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు దుబ్బాక ఎస్ఐ సుబాష్‌గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని రేకుల కుంట మల్లన్న ఆలయంలో హుండి దొంగతం జరిగిన సంఘటన విదితమే. హుండిని దొంగలించిన వ్యక్తి అయిన దుబ్బాకకు చెందిన ఎండి. రఫీ గా గుర్తించారు. హుండిని దొంగలించిన రఫిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ తెలిపారు.

లక్ష్య సాధనలో బొగ్గు ఉత్పత్తి

- సింగరేణి అధికార వర్గాల వెల్లడి
- 2017-18లో 22.9శాతం వృద్ధి

విజయక్రాంతి, రామగుండం: సింగరేణిలోని 11ఏరియాల్లో ఉన్న భూగర్భ, ఉపరితల బొగ్గు గనుల్లో ఉత్పత్తి లక్ష్య సాధన దిశలో ముందుకు సాగుతున్నదని సింగరేణి అధికారులు పేర్కొన్నారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని గోదావరిఖనిలోని ఆర్జీ-1 సింగరేణి కార్యాలయంలో అధికారులు మీడియా సమావేశాన్ని నిర్వహించారు.

జీఎం వి. విజయపాల్ రెడ్డితో పాటు ఇతర అధికారులు మాట్లాడారు. తెలంగాణ ఏర్పడక ముందు 2013-14లో వార్షిక బొగ్గు ఉత్పత్తి 504లక్షల టన్నులు సింగరేణిలో ఉండగా, ప్రతి ఏడాది ఈ లక్ష్యాలను పెంచుకుంటూ పోతున్నామన్నారు. 2017-18 నాటికి 620లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తిని సాధించామన్నారు. 22.9శాతం వృద్ధిని సాధించగలిగామన్నారు. 2013-14లో రూ. 419కోట్లు నికర లాభం సింగరేణి ఆర్జించగా గత ఏడాది రూ. 1212కోట్లు నికరలాభాలను సాధించి 190శాతం వృద్ధిని సాధించామన్నారు. ఈ నికర లాభంలో 27శాతం లాభాలను బోనస్‌గా సింగరేణీయులకు పంపిణీ చేయగలిగామన్నారు.


లక్ష్య సాధనలో ముందుకు..

ఈ ఆర్థిక సంవత్సరంలో 680లక్షల టన్నుల బొగ్గు రవాణాను లక్ష్యంగా పెట్టుకొని ముందుకు సాగుతుండగా, ఈ ఆర్థిక సంవత్సరంలోని 9నెలల కాలంలో లక్ష్య సాధన దిశలో ఉన్నామన్నారు. ఈ డిసెంబర్ నెలాఖరుకు గత ఏడాది సాధించిన బొగ్గు ఉత్పత్తిపై 9శాతం వృద్ధితో 456లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తిని సాధించామన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో గత ఆర్థిక సంవత్సరం కంటే నికర లాభాలను పెంచుకునే అవకాశం ఉందన్నారు.

దశాబ్దాల చరిత్ర కలిగిన సింగరేణికి మరింత ఉజ్వల భవిష్యత్తును చేకూర్చడానికి సమిష్టి కృషి అవసరమన్నారు. కాగా, సింగరేణిలో డిసెంబర్ నెలలో 66,38,801టన్నుల నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి లక్ష్యానికి గాను 60,38,482 టన్నుల బొగ్గు ఉత్పత్తిని సాధించి 91శాతంగా ఉన్నారు. అలాగే ఈ ఆర్థిక సంవత్సరంలో 9నెలల కాలానికి గాను 5,03, 54,900 టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని నిర్దేశించుకోగా 4,55,74,703 టన్నుల బొగ్గు ఉత్పత్తిని సాధించి 91శాతంగా ఉందన్నారు. అదే విధంగా ఆర్జీ-1 ఏరియాలో ఈ ఆర్థిక సంవత్సరంలో 9నెలలకు గాను... 46,97,000టన్నుల బొగ్గు ఉత్పత్తిని నిర్దేశించుకోగా 47,64,405 టన్నుల బొగ్గు ఉత్పత్తిని సాధించి 101 శాతంగా లక్ష్య సాధనలో ఉన్నామన్నారు. డిసెంబర్ నెలకు గాను, 5,69,000టన్నుల బొగ్గు ఉత్పత్తిని నిర్దేశించుకోగా 4,60,608 టన్నుల బొగ్గు ఉత్పత్తిని సాధించామన్నారు. ఈ సాధన 81శాతంగా ఉందన్నారు. ఈ విలేకరుల సమావేశంలో అధికారులు త్యాగరాజు, హనుమంత రావు, గంగాధర్, నవీన్, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

విజయక్రాంతి, బోథ్: బోథ్ మండలకేంద్రంలోని బస్టాండ్ నుంచి మెయిన్ రోడ్ గుండా వెళ్లే దారి గాంధీచౌక్ మూల మలుపు వద్ద సిమెంట్ రోడ్డు పగిలి రోడ్డు మధ్యలో ప్రమాదకరంగా మారింది. ఈ దారి గుండా అంబేద్కర్ కాలనీ వైపు నిత్యం వాహనాలు, ద్విచక్రవాహనాలు, పాదచారులు సంచరిస్తుంటారు. రాత్రిళ్లు ఈ గుంత ద్వారా ద్విచక్రవాహనదారులకు ప్రమాదం పొంచి ఉన్నందున సంబంధిత అధికారులు స్పందించి మార్గ మధ్యలో గుంతగా ఏర్పడ్డ గుంతను పూడ్చి రోడ్డు బాగుచేసి ప్రజా సమస్యను పరిష్కరించాలని కాలనీ వాసులు కోరుకుంటున్నారు.



మహాపడి పూజ

విజయక్రాంతి, పటాన్‌చెరు: మండల పరిధిలోని రుద్రారం గ్రామంలో గణేష్‌గడ్డ వినాయక ఆలయంలో ఘనంగా అయ్యప్ప మహా పడిపూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం రుద్రారం గ్రామ ప్రజలు, గ్రామ పెద్దలు కలిసి గణేష్‌గడ్డ ఆలయంలో అయ్యప్ప మహాపడిపూజ నిర్వహించారు. భక్తులు, ప్రజలు ప్రత్యేక పూజలో పాల్గొని స్వామివారి దీవెనలు పొందారు. తీర్థప్రసాదలు స్వీకరించారు. పడిపూజ నిర్వాహకులు శ్రీనివాస్‌గౌడ్‌ను పూలమాలలో సత్కరించి, శాలువాలతో సన్మానించారు. నూతన సంవత్సరం సందర్భంగా గణేష్‌గడ్డ వినాయకుడిని దర్శించుకునేందుకు భక్తులు, ప్రజలు పెద్ద సంఖ్యలో విచ్చేశారు. ఆలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఘనంగా న్యూ ఇయర్ వేడుకలు

విజయక్రాంతి, నిర్మల్: 2019 నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో న్యూ ఇయర్ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఎస్పీ శశిధర్‌రాజు పోలీసులతో కలిసి కేక్ కట్ చేశారు. గడిచిన సంవత్సరం పోలీసు శాఖలో ఎన్నో నూతన ఒడవడకలును, ఆధునాతన సాంకేతికతను అందించడమే కాకుండా సిబ్బంది పూర్తి స్థాయి కార్య నిబద్ధతను ప్రదర్శించడంలో ఎంతో దోహదపడిందన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు, సీఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

బోథ్‌లో కిటకిటలాడిన ఆలయాలు

న్యూయర్ వేడుకలను చిన్నా పెద్దా తేడా లేకుండా అందరు అనందంగా జరుపుకున్నారు. కొత్త సంవత్సరంలో అన్ని రోజులు తమ కుటుంబ సభ్యులతో, ఆప్తులతో సంతోషంగా ఉండాలని నియోజకవర్గ ప్రజలు దగ్గరలోని దేవాలయాలకు వెళ్లి ప్రత్యేక మొక్కులు చెల్లించుకున్నారు. బోథ్‌లోని స్థానిక ప్రసిద్ధ వేంకటేశ్వర ఆలయం, సాయిబాబా మందిరం, పాత హనుమాన్, జంగల్ హనుమాన్ మందిరాలు భక్తులతో కిటకిటలాడాయి. మరోపక్క టీఆర్ఎస్ నాయకు లు జిల్లా ఎంపీ జి.నగేష్, బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావులకు పుష్ప గుచ్చాలు అందజేసి మిఠాయిలి తినిపించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ఉట్నూర్‌లో యువత కేరింతలు

పాత సంవత్సరం వీడ్కొలు పలుకుతూ నూతన సంవత్సరనికి ప్రజలు మంగళవారం స్వాగతం పలికారు. నియోజకవర్గంలోని ఆయా మండలాల్లోని ప్రజలు పాత సంవత్సరాన్ని పురస్కరించుకొని నృత్యాలు చేశారు. ఏ వీధి చూసిన యువకుల కేరింతలతో కిక్కిరిపోయింది. అర్ధరాత్రి దాటిన తరువాత డిజే సౌండ్‌తో పాటు న్యూ ఇయర్ కేకలతో సంబరాలు చేసుకున్నారు.

పాలేరులో అంబరాన్నంటిన సంబరాలు

పాలేరు నియోజకవర్గంలో నూతన సంవత్సర సంబరాలు అంబరాన్ని అంటాయి. కష్టాల కడలికి గుడ్‌బై చెప్పి, నూతన ఒరవడిలోకి అడుగుపెట్టే సమయానా ప్రజలు, యువకులు, చిన్నారులు సందడి చేశారు. డిసెంబర్ 31 రాత్రి నుంచి జనవరి 1 సాయంత్రం వరకు నూతన సంవత్సర సంబరాలతో పల్లెలన్ని పండుగ వాతావరణంలో కనిపించాయి. యువతీ, యువకులు నూతన సంవత్సరాన్ని అద్భుతంగా నిర్వహించుకున్నారు. మహిళలు ఇండ్ల ముందు అందమైన రంగవల్లులతో నూతన సంవత్సరాన్ని స్వాగతం పలికారు. అలాగే అధికారులు ప్రభుత్వ కార్యాలయాల్లో, స్వచ్ఛంద సంస్థల్లో, యువకులు గ్రామీణ ప్రాంతాల్లో కేక్‌లు కట్ చేసి పరస్పర శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

మంచిర్యాల ఆర్కే న్యూటెక్ గనిలో

మంచిర్యాల జిల్లా నస్పూర్ మండలం శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే న్యూటెక్ గనిపై మంగళవారం ఉదయం 7 గంటలకు ఆర్కే న్యూటెక్ గనిలో పనిచేస్తున్న ఉద్యోగులకు ప్రమోషన్ పత్రాలు (ఎస్ఎల్‌పి) లను శ్రీరాంపూర్ జనరల్ మేనేజర్ సుభానీ, టీబీజీకెఎస్ సింగరేణి అధ్యక్షులు బి.వెంకట్రావు చేతుల మీదుగా అందజేశారు. ఆర్కే న్యూటెక్ గనిపై 110 మంది ఉద్యోగులు ఎస్ఎల్‌పీ ప్రమోషన్లు పొందారు. ప్రమోషన్లు పొందిన ఉద్యోగులు ఆనందం వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో మరింత ప్రతిభ కనబరుస్తామని స్పష్టం చేశారు. అదే విధంగా డిసెంబర్ 2018 మాసంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఉద్యోగులకు ప్రోత్సహక బహుమతులు కూడా అందజేశారు. సింగరేణి స్థాయి లో శ్రీరాంపూర్‌ను ఉన్నతంగా నిలపాల్సిన బాధ్యత ఉద్యోగులపై ఉందని, భూగర్భ గనులన్నీ, అదే విధంగా ఓసీపీ గని కూడా 2018-19 సంవత్సరంలో 100 శాతం ఉత్పత్తి లక్ష్యాలతో ఉండడం హర్షించదగ్గ విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో టీబీజీకెఎస్ ఏరియా ఉపాధ్యక్షులు సురేందర్‌రెడ్డి, సెంట్రల చర్చల ప్రతినిధులు ఏనుగు రవీందర్‌రెడ్డి, కె.వీరభద్రయ్య, మల్లారెడ్డి, డివై జనరల్ సెక్రెటరీ డి.అన్నయ్య, పెట్టం లక్ష్మణ్, రాజనాల రాకేష్, ఫిట్ కార్యదర్శి జి.నర్సయ్య, అధికారులు ఎస్‌వోటూజీఎం పి.వి.సత్యనారాయణ, ఎజెంట్ మధుసుధన్, డివైజీఎం(పి) పి.గోవిందరాజు, రక్షణాధికారి అజయ్‌కుమార్, మేనేజర్ వెంగళరావు, సంక్షేమాధికారి దేవేందర్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే భరోసా

విజయక్రాంతి, కాగజ్‌నగర్: ఆసిఫాబాద్ మండలం బురుగుడా గ్రామంలో సోమవారం అగ్నిప్రమాదంలో ఇండ్లు కాలిపోయిన బాధితులను మంగళవారం ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ బాధితులకు ప్రభుత్వం నుంచి వచ్చే బెనిఫిట్స్ త్వరగా వచ్చేలా చూస్తానని, తక్షణ ఆర్థిక సహాయం కింద ఒక్కొక్కరికి ఐదువేల రూపాయల చొప్పున ముగ్గురు బాధితులకు అందించారు. ఆయన వెంట వైఎస్ ఎంపీపీ బద్రి సత్యనారాయణ, మాజీ సర్పంచు మణికొండత సంతోష్, మాజీ ఎంపీటీసీ మేకార్తి శ్రీనివాస్, నాయకులు తదితరులున్నారు.

మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికలు

విజయక్రాంతి, కాగజ్‌నగర్: కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో మూడు విడతల్లో కొనసాగనున్న పంచాయతీ ఎన్నికలు మొదటి విడుతలో బెజ్జూర్, కౌటాల, చింతలమానేపల్లి, సిర్పూర్(టి), పెంచికల్‌పేట్, దహెగాం మండలాలు, రెండవ విడతలో కాగజ్‌నగర్, ఆసిఫాబాద్, తిర్యాణి, రెబ్బెన మండలాల్లో పంచాయతీల ఎన్నికలు, మూడో విడుతలో సిర్పూర్(యూ), జైనూర్, కెరమెరి, లింగాపూర్, వాంకిడి, నార్నూర్ మండలాల్లో కొసాగనున్నాయి. పంచాయతీ ఎన్నికల ప్రక్రియ మొదటి విడుత పోలింగ్ జనవరి 21, రెండో విడత జనవరి 25, మూడో విడత జనవరి 30న ఉంటాయన్నారు.

చెకుముఖికి విద్యార్థుల ఎంపిక



విజయక్రాంతి, పాలేరు: పాలేరు జవహర్ నవోదయ విద్యాలయానికి చెందిన ముగ్గురు విద్యార్థినులు రాష్ట్ర స్థాయి చెకుముఖి పోటీలకు ఎంపికైనట్లు నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ సురేందర్ పాటి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదోతరగతికి చెందిన తేజస్వి, 9వ తరగతికి చెందిన గాయత్రీ, 8వతరగతికి చెందిన త్రివేణిలు చెకుముకి పోటీల్లో జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి పొందారు. కాగా వారు రాష్ట్ర స్థాయికి ఎంపికైయ్యారు. ఈ సందర్భంగా నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ సురేందర్ విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

ఓటర్ల జాబితాపై గెజిట్ విడుదల

విజయక్రాంతి, పాలేరు: పంచాయతీ ఎన్నికల్లో భాగంగా ఓటర్ల జాబితాను ప్రభుత్వాధికారులు విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఓటర్ల సవరణ కార్యక్రమాన్ని చేపట్టగా, అందుకు గాను పూర్తి స్థాయి ఓటర్ల జాబితాను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ మేరకు నూతన సంవత్సరం సందర్భంగా జిల్లా కలెక్టర్ కర్ణన్ గెజిట్ విడుదల చేయగా, ప్రభుత్వానికి సిఫారసు చేశారు. కాగా ప్రభుత్వం ఎన్నికల సంఘానికి పంపించిన అనంతరం గెజిట్ విడుదల చేసి, తక్షణమే పంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేయనుంది. ఖమ్మం జిల్లాలో మొత్తం 41 మండలాల పరిధిలో 584 పంచాయతీలుండగా, 5338 వార్డులున్నాయి. అందులో మొత్తం 7,50,310 ఓటర్లుండగా, అందులో 3,70,987 పురుషులు, 3,79,291 మహిళలు, 32మంది ఇతరులున్నారు. కాగా ఓటర్ల జాబితాను విడుదల చేస్తూ జిల్లా కలెక్టర్ కర్ణన్ గెజిట్ చేశారు.

మండలాల వారీగా వివరాలు ఇలా

మండలం	జీపీలు	వార్డులు	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
ఖమ్మం రూరల్	26	252	20,042	20,767	1	40,810
కూసుమంచి	41	364	22,155	22,990	7	45,152
నేలకొండపల్లి	32	300	22,491	23,501	1	45,993
టి.పాలెం	40	356	22,213	22,706	1	44,920
మొత్తం	**136**	**1272**	**86,901**	**89,964**	**10**	**1,76,875**

జగదాంబా దేవి జాతర

విజయక్రాంతి, బోథ్: బోథ్ మండలంలోని పార్డి(బి) దేవులానాయక్ తాండలో ఈ నెల 3వ తారీఖున జరిగే శ్రీ జగదాంబా దేవి జాతర సందర్భంగా శ్రీ రామచంద్రసాత్ మహారాజ్, ప్రేంసింగ్ మహారాజ్ గార్ల విగ్రహ ప్రతిష్టాపన సంతోష్ శర్మ, ఓంకార్ శర్మ సమక్షంలో పూజారి రాథోడ్ లక్ష్మన్ మహారాజ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తామని గ్రామ పెద్దలు, సేవాదాస్ యూత్ సభ్యులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇట్టి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి ముఖ్య అథితులుగా జిల్లా ఎంపి జి.నగేష్, బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు, కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ నరేష్ జాదవ్, యువ నాయకులు జాదవ్ అనిల్‌లు వస్తున్నట్లు వారు తెలిపారు.

బెల్లంపల్లిలో ఆర్టీసీ డిపో కలేనా?

విజయక్రాంతి, మంచిర్యాల: జిల్లాలోనే దాదాపు 300 గ్రామాలకు కేంద్రబిందువుగా, వివిధ వ్యాపారాల నిమిత్తం ప్రతి రోజు 15 వేల నుంచి 20 వేల మంది ప్రజలు నిత్యం బెల్లంపల్లి నుంచి ఆర్టీసీ బస్సుల ద్వారా ప్రయాణం కొనసాగిస్తుంటారు. 1992లో బెల్లంపల్లి పట్టణంలోని కన్నాల బస్తి వద్ద ఆర్టీసీ బస్టాండ్‌ను అప్పటి రవాణాశాఖ మంత్రి సాంబశివరావు, చైర్మన్ సత్యనారాయణలు ప్రారంభించారు. అదే సమయంలో ఇక్కడ డిపో కూడా ఏర్పాటు చేస్తామని ప్రకటించి, అందుకోసం బస్టాండ్ ఎదురుగా గల 5 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. అప్పటి నుంచి నేటివరకూ నాటి పాలకుల, ఆర్టీసీ అధికారుల అవగాహనా లోపం, నిర్లక్ష్యానికి నిదర్శనంగా మిగిలిపోయింది. ప్రతియేటా ఆర్టీసీ బస్టాండ్‌కు నిత్యం దాదాపు 20 ఆర్టీసీ బస్సులు నైట్‌హాల్ట్‌లో ఉంటాయి. మణుగూరు, కొత్తగూడెం, గోదావరిఖని, పరకాల, హన్మకొండ, హుజురాబాద్, మహబుబాబాద్, హుస్నాబాద్, కోరుట్ల, ఆదిలాబాద్ తదితర డిపోలకు చెందిన బస్సులు ఇక్కడి నుంచే ప్రయాణం సాగిస్తుంటాయి. బెల్లంపల్లి నియోజకవర్గంతో పాటు, చుట్టు ప్రక్కల గల నాలుగు నియోజకవర్గాలకు చెందిన పలు మండలాలకు చెందిన గ్రామాలకు ప్రజలు



ఇప్పటి వరకు ఆర్టీసీ బస్సులను ఎరుగని పరిస్థితులు ఉన్నాయంటే అతిశయోక్తి లేదు. ప్రభుత్వం పల్లె పల్లెకు పల్లెవెలుగు బస్సులు అని ప్రారంభించినప్పటికీ ఇప్పటి వరకు పల్లె వెలుగు బస్సులే తెలియని పల్లెవాసులు ఉన్నారంటే అతిశయోక్తి కాదు. బెల్లంపల్లి బస్టాండ్ వద్ద డిపో ఏర్పాటుకు అన్ని అవకాశాలు, సౌకర్యాలు ఉన్నందు వలన ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్, కరీంనగర్ ఈడీలు వెంటనే ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. రెండోసారి ఎమ్మెల్యేగా గెలిచిన దుర్గం చిన్నయ్య చొరవ చూపాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యం అందాలి

- అన్ని వసతులను ఏర్పాటు చేసుకున్నాం
- ప్రభుత్వ ఆసుపత్రిలో మెకానికల్ లాండ్రి ప్రారంభం

విజయక్రాంతి, సిద్దిపేట: సకల సౌకర్యాలతో ఉన్న సిద్దిపేట సర్కార్ దవాఖానలో వైద్యసేవలు మరింత పెంచాలని త్వరలోనే సిటిస్కాన్ ఆర్థోపెడిక్ సేవలను అందుబాటులోకి తేవాలని మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు వైద్యాధికారులకు, ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బందికి సూచించారు. మంగళవారం సిద్దిపేటలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వ ఆసుపత్రి సేవలపై సమీక్ష నిర్వహించారు. కొత్త సంవత్సరం మెదటి రోజు ప్రజా ఆరోగ్య సేవలపై మెదటి సమీక్ష నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఆసుపత్రి వైద్య సేవలపై ఆరా తీస్తూ పది రోజుల్లో సిటిస్కాన్ అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. ఆర్థోపెడిక్ సేవలు పెంచే దిశగా పని చేయాలని వారం రోజుల్లో ఫ్యాక్చర్ మిషన్ అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. పాత ఎంసిఎచ్‌లో ఒక భవనం వెల్‌నెస్ సెంటర్‌గా ఉపయోగిస్తున్నామని మిగిలిన భవనాలనును వైద్యకళాశాల ఆధీనంలోకి తెచ్చుకోవాలని సూచించారు. రేడియాలజిస్టులు 24గంటలు అందుబాటులో ఉండాలి అని లేకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే పోస్ట్‌మార్టం చేయడంలో వైద్యులు నిర్లక్ష్యంగా ఉండరాదని ప్రజలకు ఇబ్బందులు కలిగించవద్దన్నారు. వైద్యకళాశాలలో పని చేస్తున్న కాంట్రాక్ట్ ప్రోఫెసర్‌ల వేతనాలు నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయని ఆ సమస్యను పరిష్కరించాలని వైద్య ఆరోగ్య ముఖ్య కార్యదర్శి శాంతకూమారితో ఫోన్‌లో మాట్లాడి చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే కళాశాలలోని పలు సమస్యలను ఆమెకు విన్నవించి వాటిని పరిష్కరించాలని కోరారు. పక్షపాతం రోగులకోసం వాడే ఆల్టిపేస్ అనే ఇంజక్షన్లను మరిన్ని తెప్పించి అందుబాటులో ఉంచాలని, అవసరమైన నిధులు ఆసుపత్రి అభివృద్ధి కమిటీ నుంచి సమకూర్చుకోవాలని సూచించారు.

మెకానిక్ లాండ్రి ప్రారంభం

ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ఆధునాతన యాంత్రీకరణ లాండ్రిని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రి కార్పొరేట్ స్థాయిలో ఉండడం వల్ల ఆ స్థాయిలోనే సేవలు అందిస్తున్నామని అన్నారు. గతంలో ఆసుపత్రికి వచ్చే రోగుల బట్టలు, బెడ్‌షిట్‌లు చెరువులో ఉతికే వారని దాని వల్ల ఇన్‌ఫెక్షన్ వచ్చేదని, మెకానిక్ లాండ్రి ఏర్పాటుతో ఆ ఇబ్బంది ఉండదన్నారు.



కోలాహలంగా మారిన ఎమ్మెల్యే నివాసం

నూతన సంవత్సరం సందర్భంగా సిద్దిపేట ఎమ్మెల్యే నివాసం కోలాహలంగా మారింది. ఉదయం నుంచే ప్రజా ప్రతినిధులు,అధికారులు, ప్రజలు, అభిమానులు, పార్టీ శ్రేణులు ఆయనను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసారు. ఆయన ను కలిసిన వారిలో ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్సీ పాతురి సుధాకర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

ఫర్నిచర్ దుకాణాలు దగ్ధం రూ.20 లక్షల ఆస్తినష్టం

విజయక్రాంతి, పటాన్‌చెరు: మండల పరిధిలోని ముత్తంగి చర్చి సమీపంలో బాణాసంచా మెరుపులు చిమ్మి ఫర్నిచర్ దుకాణాలు దగ్ధమయ్యాయని మంగళవారం పటాన్‌చెరు ఫైర్ ఆఫీసర్ జెన్యానాయక్ తెలిపారు.

సోమవారం ఆర్ధరాత్రి నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా ముత్తంగి చర్చి సమీపంలో భాణాసంచాలు కాలుస్తుండగా జాతీయ రహదారిపై ఉన్న 8 దుకాణాలలో వాటి మెరుపులు పడి మంటలు వ్యాపించాయని ఆయన పేర్కొన్నారు. దుకాణాల యాజమానులు సమాచారం ఇవ్వడంతో వెంటనే సంఘటన స్థలానికి ఫైర్‌ఇంజన్లతో వచ్చి నీటితో మంటలను అదుపు చేశామన్నారు. అప్పటికే దుకాణాలలో ఉన్న ఫర్నీచర్ మొత్తం ధ్వంసమైందన్నారు. దుకాణాల ఫర్నీచర్ మొత్తం ఆస్తినష్టం సుమారు రూ.20 లక్షల వరకు ఉంటుందన్నారు.

సమస్యలు అధిగమిస్తూ.. కొత్త ఏడాదిలోకి

విజయక్రాంతి, నిర్మల్: నిర్మల్ జిల్లాలో గత ఏడాదితో పోలిస్తే 2018 సంవత్సరం ఎన్నో సవాళ్లను ప్రశాంతంగా అధిగమించింది. పండుగలు ప్రశాంతంగా జరిగాయి. ఎన్నికలు సజావుగా ముగిశాయి. నేరాల సంఖ్య కూడా గణనీయంగా తగ్గింది. జిల్లా ఎస్పీగా శశిధర్ రాజు బాధ్యతలు స్వీకరించిన 8 నెలల్లో సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు బ్లూకోడ్ పెట్రోల్ బృందాలతో నిరంతర నిఘా ఏర్పాటు చేసి జిల్లాలో శాంతి భద్రతలకు భంగం రాకుండా చూశారు. అన్ని వర్గాల ప్రజలు ప్రశాంత వాతావరణంలో పండుగలు నిర్వహించుకునేలా పటిష్ఠ భద్రత ఏర్పాటు చేశారు. ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల్లో ప్రజలు ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకునేలా కృషి చేసి విజయం సాధించారు.

సీసీ కెమెరాల ఏర్పాటు

జిల్లాలోని పట్టణాల్లో వ్యాపార సముదాయాలతో పాటు అన్ని గ్రామాల్లో ప్రజల భాగస్వామ్యంతో సీసీ కెమెరాలు ఏర్పాటు కోసం ప్రత్యేక చొరవ తీసుకున్నారు. జిల్లాలోని 625 ప్రదేశాల్లో 1505 సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించారు. అలాగే నేను సైతం కార్యక్రమం ద్వారా జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్‌లో 880 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి ఐజీ మన్ననలు పోందారు. సామాజిక సేవా కార్యక్రమాలతో చేరువయ్యారు. జిల్లాలు మారుమూల ప్రదేశాలలో సైతం సామాజిక సేవ కార్యక్రమాలు చేపట్టి యువతకు చేరువయ్యారు. జాబ్‌మేళాలు ఏర్పాటు చేసి 2616 మందికి ఉపాధి అవకాశాలు కల్పించారు. 544 మందికి ఉద్యోగావకాశాలు దక్కాయి. పోలీస్ ఉద్యోగాల కోసం బాసర ట్రీపుల్‌ఐటీ ప్రాంగణంలో శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారు. మట్కా జూదం అరికట్టేందుకు ప్రత్యేక బృందాలతో నిరంతర నిఘా ఏర్పాటు చేశారు. గొలుసు చోరీలకు కళ్లెం పడేలా చర్యలు తీసుకున్నారు. ఎనిమిది నెలల కాలంలో ఎటువంటి కేసు నమోదు కాలేదు. అదే విధంగా నేరాల సంఖ్య తగ్గుముఖం పట్టింది.

ప్రజా రక్షణే పోలీసు శాఖ ధ్యేయం

విజయక్రాంతి, రామగుండం: రామగుండం కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లో అనుక్షణం ప్రజల రక్షణ కోసం పోలీసు శాఖ అప్రమత్తంగా ఉంటుందని, రామగుండం కొత్వాల్ వి. సత్యనారాయణ అన్నారు. కమిషనరేట్ కార్యాలయ ఆవరణలో ఈ రెండు జిల్లాల పోలీసు అధికారులతో నూతన సంవత్సర ప్రారంభోత్సవంలో భాగంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీపీ సత్యనారాయణ మాట్లాడుతూ నూతన లక్ష్యాలతో ప్రణాళికాబద్ధంగా పోలీసు శాఖ ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. కమిషనరేట్ పరిధిలోని ప్రజలందరూ శాంతియుత జీవనం సాగించే విధంగా అవసరమయ్యే పోలిసింగ్‌ను చేపట్టాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణే ముఖ్య లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. అసాంఘిక శక్తుల అక్రమ రవాణాపై అడ్డుకట్ట వేయాలన్నారు. మహిళలపై జరిగే వేధింపులను సహించకూడదని ఇందుకు గాను షీటీమ్‌లను పటిష్ఠం చేయాలన్నారు. రౌడీయిజం ఏ రూపంలో ఉన్న పోలీసు అధికారులు ఉక్కుపాదంతో అణిచివేయాలన్నారు. పీపుల్ పెండ్లీ పోలీసింగ్‌ను ప్రజా క్షేత్రంలో పటిష్ఠ పర్చాలన్నారు. ఈ సమావేశంలో పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల డీసీపీలు సుదర్శన్ గౌడ్, వేణుగోపాల్ రావు, అడిషనల్ డీసీపీ అడ్మిన్ ఎన్. అశోక్ కుమార్, అడిషనల్ డీసీపీ లాఅండ్ ఆర్డర్ ఎన్. రవికుమార్, గోదావరిఖని ఏసిపి రక్షిత కె. మూర్తి, అడిషనల్ డీసీపీ ఏఆర్. సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆహా!

బామ్మ చిట్కాలు

- వేడి నీటిలో పసుపు వేసి ఆ నీరును ఆవిరి పట్టిస్తే జలుబు నుండి కొంత ఉపశమనం కలుగుతుంది. అలా కాకుండా నిప్పులలో పసుపుకొమ్ము వేసి ఆ పొగను ఆవిరి పట్టిన అదే ఫలితం ఉంటుంది.
- తేనెతో మిరియాల పొడి, దాల్చిన చెక్క పొడి కలిపి తిన్నట్లయితే జలుబు తగ్గుతుంది.
- పరగడుపున ఒక గ్లాసు గోరువెచ్చని నీటిలో చిటికెడు జీలకర్ర పొడీ, టీస్పూన్ తేనె, టీస్పూన్ నిమ్మరసం కలుపుకొని తాగాలి. క్రమం తప్పకుండా చేస్తే జలుబుతో వచ్చిన గొంతునొప్పి తగ్గుతుంది.
- తులసి లేదా అల్లం రసాన్ని తేనెతో కలిపి తాగితే తొందరగా జలుబు నుండి ఉపశమనం కలుగుతుంది.



సాహో సాబూదాన్...



సగ్గుబియ్యం అంటే పూర్తి శాకాహారం. అందువల్లే వ్రతాల సమయంలో దీనిని ఎక్కువగా వాడతారు. సాగో అనే పేరుతో ప్రాచుర్యం పొందిన సగ్గుబియ్యం కర్ర పెండలం నుండి తీసుకోబడిన పొడి నుండి తయారుచేస్తారు. ఛౌవ్వరి, సగుదనా, అవ్వరిషి గా సగ్గుబియ్యం ప్రసిద్ధి. కార్బోహైడ్రేట్లు ఎక్కువగా లభిస్తూ కొవ్వు తక్కువగా ఉండే పదార్థం ఇది. బరువు తగ్గాలని అనుకునే వారు దీనిని ఈ ఆహారంగా తీసుకోవచ్చు. పాలు తరువాత చిన్న పిల్లలకి తినిపించదగిన ఆహార పదార్థం ఇది. అలాగే పండుగల సమయం లో కూడా వీటిని వాడతారు. స్టార్చ్ శాతం ఎక్కువగా ఉండి కృత్రిమ తీపి పదార్థాలు అలాగే రసాయనాలు లేకపోవడం వల్ల సగ్గ బియ్యానికి ఎక్కువగా ప్రాధాన్యత ఇస్తారు. అలాగే జబ్బు పడినవారికి కూడా ఇది తక్షణ శక్తి నిచ్చే ఆహార పదార్థం. ఒంట్లో వేడిని తగ్గించే లక్షణం ఇందులో సమృద్ధిగా ఉంది.



సగ్గుబియ్యం లడ్డు

కావల్సిన పదార్థాలు

సగ్గుబియ్యం: కప్పు, పచ్చికొబ్బరి: అరకప్పు, చక్కెరపొడి: ముప్పావు కప్పు, నెయ్యి: నాలుగు లేక ఐదు స్పూన్లు. జీడిపప్పు: కావల్సినంత, యాలకుల పొడి: చిటికెడు.

తయారీ విధానం

సగ్గుబియ్యాన్ని బాండీలో సన్నని మంట మీద గోధుమరంగు వచ్చేవరకూ వేయించుకోవాలి. అలాగే కొబ్బరి పొడిని కూడా కొద్దిగా వేయించుకోవాలి. నెయ్యి వేడిచేసి అందులో జీడిపప్పు వేసి వేయించి ఉంచుకోవాలి.

ఇప్పుడు సగ్గుబియ్యాన్ని పొడిగా చేసుకొని అందులో పచ్చికొబ్బరి, చక్కెర, జీడిపప్పు, యాలకుల పొడి వేసి దానికి కొద్దిగానెయ్యి కలిపి లడ్డూల్లాగా కట్టాలి. పొడిపొడిగా ఉండి లడ్డూలు చేసేందుకు వీలు కాకపోతే అందులో కొన్ని పాల చుక్కలు కలుపుకోవచ్చు.

సగ్గుబియ్యం వడలు

కావల్సిన పదార్థాలు

సగ్గుబియ్యం: 2 కప్పులు, ఆలుగడ్డ: 1, పచ్చిమిరపకాయలు: 4, కొత్తిమీర తురుము: 1 కప్పు, జీలకర్ర: 1 టీస్పూన్, నూనె, ఉప్పు: సరిపడినంత, పల్లీల పొడి: 1 కప్పు

తయారీ విధానం

సగ్గుబియ్యంలో సరిపడినన్ని నీళ్ళుపోసి రాత్రి నానబెట్టండి. పచ్చిమిరపకాయలు మెత్తగా గ్రైండ్ చేయండి. ఉడకించిన ఆలుగడ్డ, పల్లీలు పొడి, జీలకర్ర, కొత్తిమీర తురుము, సరిపడినంత ఉప్పు వేసి రాత్రి నానేసిన సగ్గుబియ్యంలో కలపాలి. ఈ మిశ్రమాన్ని ముద్దలా చేయండి. చిన్న చిన్న ఉండలు చేయండి. బాణలిలో నూనె వేడిచేసి సగ్గుబియ్యం ఉండలు వేసి వేయించండి. పెరుగుతో (తీపి ఇష్టపడేవారు పెరుగులో రెండు స్పూన్లు పంచదార బాగుంటుంది), కొబ్బరి చట్నీతోకానీ తింటే బాగుంటాయి.



సగ్గుబియ్యం పునుగులు

కావల్సిన పదార్థాలు

సగ్గుబియ్యం: 1/4కేజీ, మైదా: 100 గ్రా, బెల్లం: 1/4 కేజీ, ఏలకులు: 10, కొబ్బరి తురుము: 2 స్పూన్లు, పాలు: 1 గ్లాసు, నూనె: 1/4 కేజీ

తయారీ విధానం

సగ్గుబియ్యం పాలల్లో మూడు గంటలు నానబెట్టండి. ఏలను మెత్తగా పొడి కొట్టండి. బెల్లం కూడా సన్నగా తురమండి. మైదా పిండినా జల్లించండి. వీలన్నింటినీ సగ్గుబియ్యంలో వేయండి. కొబ్బరి తురుము వేసి సగ్గుబియ్యం మిశ్రమంలో బాగా కలపండి. పొయ్యిమీద బాణలి పెట్టి నూనెపోసి కాగనివ్వండి. సగ్గుబియ్యం మిశ్రమాన్ని నూనెలో బూరెల్లా వేసి వేయించండి. ఇవి కొద్దిగా సాగినట్లుగా ఉన్నా కూడా తింటుంటే తమాషాగా ఉంటాయి. పిల్లలు ఇష్టంగా తింటారు. ఇవి వేడిగాను, చల్లారిన తర్వాత తిన్నా రుచిగా వుంటాయి. పిల్లలకె స్నాక్స్ బాక్స్‌లో కూడా పెట్టవచ్చు. వారం రోజులు నిలవ ఉంటాయి.



హెల్త్

మద్యంతో ముప్పు...

కాలమాన పరిస్థితులు మారిపోయి ఉండొచ్చు. దాంతో పాటు మన అలవాట్లూ మారిపోయి ఉండొచ్చు. కానీ మద్యం వల్ల సంప్రాప్తించే నష్టాలు గానీ, శారీరకంగా మానసికంగా సామాజికంగా అది చేసే చేటుగానీ ఏమాత్రం మారలేదు. మారదు. కూడా.. ఎందుకంటే మద్యం మనిషికి శత్రువు. మన ఆరోగ్యానికి శత్రువు. మన శరీరంలోని చాలా అవయవాలకు శత్రువు. ముందు మద్యం మనం తాగుతున్నామనుకుంటాం. కానీ ఒక దశకు చేరిన తర్వాత అదే మనల్ని మింగేయటం ఆరంభిస్తుంది. ఒళ్లంతా కబళించడం మొదలుపెడుతుంది. ఈ అవగాహన పెరిగితే కొందరైనా మద్యానికి దూరంగా ఉండటానికి ప్రయత్నిస్తారన్న ఆశతో, మద్యం చేసే చేటును అందరికి తెలియజేయు ప్రయత్నమే ఇది.



మందు తాగడం వల్ల కలిగే ముప్పు...

ఇటీవలే మద్యంపై వైద్యపరంగా ఓ విస్తృతమైన అధ్యయనం జరిగింది. మద్యానికి బానిసలైన వేలాది మందిని పరిశీలిస్తే, సాధారణ ఆరోగ్యవంతులతో పోలిస్తే వీరిలో మరణాల రేటు చాలా ఎక్కువగా ఉన్నట్టు తేలింది.శారీరక రుగ్మతలు జబ్బులన్నింటినీ వేరు చేసి చూస్తే, చివరికి వీరిలో మరణానికి మద్యం అతి ముఖ్యకారణంగా నిలుస్తోందని తేలింది. ప్రపంచ వ్యాప్తంగా అన్ని మరణాల్లో నాలుగు శాతం అన్ని జబ్బుల్లో అయిదు శాతం కేవలం ఆల్కహాల్ వల్ల సంప్రాప్తిస్తున్నవే. దీన్ని బట్టి అర్థమయ్యేదేమంటే ఎంత తక్కువ తాగితే అంత మంచిదని,, కానీ మన దేశంలో పరిస్థితి ఇందుకు పూర్తి భిన్నంగా ఉంది. దేశంలో మద్యం వినియోగం ఏటా ముప్పై శాతం పెరుగుతోందని గొప్పగా చెప్పుకుంటున్నాం. ఈ మద్యం మార్కెట్ 1.4 లక్షల కోట్లకు చేరుతుందని ఘనంగా లెక్కలేస్తున్నాం. సామాజిక అలవాట్లు కట్టుబాట్లు మారిపోతూ మద్యం ప్రభావం నానాటికీ పెరిగిపోతుండడం ఎలాంటి పరిస్థితులకు దారి తీస్తుందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. దీనికి తోడు మితంగా మద్యం తీసుకుంటే ఆరోగ్యానికి ముఖ్యంగా గుండెకు మంచిదన్న ప్రచారంతో దీన్నో సాకుగా తీసుకొని మందు గ్లాసు పట్టుకునే వారి సంఖ్యా పెరిగిపోతుంది. కానీ మద్యం కొద్దిగా ఎక్కువైనా ఏ కొంచెం మితిమీరినా ఆరోగ్యం సంపూర్ణంగా దెబ్బతింటుంది. లివర్ ఒక్కటే కాదు. శరీరంలోని దాదాపు అన్ని అవయవాలు పడకేస్తాయి. మనల్ని ముంచేస్తాయి.




జీర్ణాశయం

ఎంత తాగితే జీర్ణవ్యవస్థలో చికాకు అంత ఎక్కువవుతుంది. కొద్దిగా తాగినా అది పెట్టే చికాకుతో జీర్ణాశయం ఆమ్లాన్ని ఎక్కువగా ఉత్పత్తి చేస్తుంది. దీనితో ఆమ్లం పైకి ఎగదన్నటమే సమస్యలే కాదు. జీర్ణాశయం పూత కూడా రావచ్చు. దీనివల్ల కడుపునొప్పి, వాంతులు, విరేచనాలు మరీ ఎక్కువగా తాగేవారిలో జీర్ణాశయంలో రక్తస్రావం కూడా అవ్వచ్చు. మద్యానికి బానిసై ఏళ్ల పాటు తాగుతుండే వారిలో ఇది జీర్ణాశయం క్యాన్సర్‌కు కూడా దారితీయొచ్చు. మద్యం తాగేవారిలో పేగుల్లో పుండ్లు పడే అవకాశమూ ఎక్కువే. బాగా తాగినప్పుడు వాంతి సాధారణమే గానీ వీటితోనూ తీవ్ర సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా సరిగ్గా స్పృహలో లేనప్పుడు వాంతి అయితే పొలమారినట్లై ఆ పదార్థం ఊపిరితితుత్తల్లోకి వెళ్లిపోవచ్చు. దగ్గుతో దాన్ని బయటకు తెప్పించలేకపోతే పరిస్థితి మరణానికి కూడా దారి తీస్తుంది. బలవంతంగా తోసుకొచ్చే వాంతులతో గొంతు చిట్లి రక్తం రావచ్చు. కొన్నిసార్లు అదీ తీవ్ర సమస్యలకు దారితీయొచ్చు. మితిమీరిన మద్యం లివర్ క్యాన్సర్ నోటి క్యాన్సర్ అన్నవాహిక క్యాన్సర్ పెద్దపేగు క్యాన్సర్ రొమ్ము క్యాన్సర్ ఇలా చాలా క్యాన్సర్లకు ఇదే మూలం. ముఖ్యంగా నోరు జీర్ణ అవయవాల్లో సంప్రాప్తించే క్యాన్సర్లకు పొగ తర్వాత ఇదే అతి ముఖ్య కారణం. ఇక మద్యం కారణంగా సంభవిస్తున్న మరణాల్లో ఇరవై శాతం వరకూ క్యాన్సర్ల రూపంలో సంప్రాప్తిస్తున్నవే. పట్టణ ప్రాంతాల్లో యువతుల్లో మద్యం అలవాటు పెరుగుతుండడం గమనించాల్సిన అంశం. ఇప్పటికే హెపటైటిస్ బి, సి వంటివి ఉన్నవారు మద్యం తీసుకుంటుంటే వారిలో లివర్ క్యాన్సర్ ముప్పు మరీ పెరుతుంది. ఒంట్లో ఈ వైరస్‌లున్న ప్రతి అయిదుగురిలో ఒకరు క్రమేపి సిరోసిస్ లివర్ క్యాన్సర్‌ల బారిన పడుతున్నారు. ఇక రోజూ తాగే ప్రతి రెండు యూనిట్ల మద్యంతో పెద్దపేగు క్యాన్సర్ ముప్పు ఎనిమిది శాతం వరకూ పెరుగుతుంని అధ్యయనాల్లో గుర్తించారు.

ఊబకాయం



మద్యం ద్వారా చాలా కాలరీల శక్తి అదనంగా వస్తుంది. కానీ ఇది అనారోగ్య హేతువు. పోషకాహారం ద్వారా వచ్చే శక్తికి పోషక విలువ ఉంటుంది కానీ దీనికి అదేం ఉండదు. అందుకే వచ్చే శక్తిని ఎంప్టీ కాలరీస్ అంటారు. రెండోది ఓ మోస్తరుగా తాగే వారు సగటున నెలకు రెండు వేల వరకూ అదనంగా కాలరీలను తీసుకుంటున్నారని అంచనా.. వైన్ బీరు వంటివన్నీ కూడా దాదాపు పిండి పదార్థాలు చక్కెరలను పుటియబెట్టడం ద్వారా తయారయ్యేవే. చక్కెరలు ఎక్కువ కాబట్టి వీటి ద్వారా కాలరీలు ఎక్కువే వస్తాయి. కొన్నింటిలో దాదాపు ఇది కొవ్వులతో సరిసమానంగా కూడా ఉంటుంది. పైగా మద్యంతో పాటే నంజుకోవడానికి చికెన్ 65, జీడిపప్పు వేయించిన చేప ముక్కలాంటి కొవ్వులు ఎక్కువగా స్నాక్స్ కూడా తినాలనిపిస్తుంది. వీటివల్లా కాలరీలు ఎక్కువ వస్తాయి. వీటన్నింటి వల్ల ఊబకాయం పెరిగిపోవడం తథ్యం. ఎన్ని వ్యాయామాలు చేసినా ఈ కాలరీలన్నీ ఖర్చువటం కష్టం ఫలితంగా ఊబకాయం, దానితో పాటే హైబీపీ మధుమేహం, గుండెజబ్బులు, మోకాళ్లు అరిగిపోవడం వంటివన్నీ తయారవుతాయి.



మందులు

మద్యం ప్రభావం మనం తీసుకునే ఇతరత్రా మందుల మీద ఉంటుంది. ముఖ్యంగా నిద్ర పట్టేందుకు ఇచ్చే వంటివి కుంగుబాటు తగ్గేందుకు ఇచ్చే ప్రొజాక్ వంటివి తీసుకునే వారు మద్యం జోలికి వెళ్లకూడదు. అలాగే మూర్ఛ, మధుమేహం వంటివాటికి దీర్ఘకాలం మందులు తీసుకునేవారు, రక్తం పల్చగా ఉండేందుకు వార్ఫరిన్ వంటివి తీసుకునేవారు మద్యం విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. కొలెస్ట్రాల్ తగ్గేందుకు ఇచ్చే స్టాటిన్స్‌పై మద్యం ప్రభావం ఉంటున్నట్టు గుర్తించారు. అలాగే కొన్ని రకాల యాంటీబయోటిక్స్ తీసుకుంటున్నప్పుడు మద్యం తాగకపోవడం ఉత్తమం. వీటి గురించి వైద్యులతో ముందే చర్చించడం అవసరం. ఈ జాగ్రత్తలతో పాటు ఇంగ్లీషు మందులు అధికంగా వాడేవారిలో తప్పక కాలేయం దెబ్బతినే అవకాశం యాభై శాతం ఉంది. కనుక ప్రతి ఒక్కరు తమ ఇండ్లలో లివర్ మెరుగుపరిచే గుణం కలిగిన పదార్థాలను అధికంగా వాడడం మంచిది.

గుండె

ప్రస్తుతం గుండె జబ్బులు విపరీతంగా పెరుగిపోతున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో రోజూ కొద్దిగా రెడ్‌వైన్ తీసుకుంటే గుండెకు మంచిదని చెప్తుంటే ఎవరికైనా గుండెజబ్బుల నివారణకు ఇదేదో తేలికైన మార్గమే అనిపిస్తుంది. రోజూ మితంగా మద్యం తీసుకోవడం గుండె జబ్బులు రాకుండా నివారించేందుకు దోహదం చేస్తున్నట్టు కొన్ని అధ్యయనాలు గుర్తించిన మాట నిజమేగానీ వాస్తవానికి ఈ లాభమన్నది కాలక్రమంలో ఎంత తాగుతున్నారన్న దానిక మీదే ఎక్కువగా ఆధారపడి ఉంటుంది. దీనికి తోడు మనం తాగే అలవాట్లు కుటుంబ చరిత్ర, వయస్సు, జన్యుపరమైన అంశాల వంటివీ కీలకమే. ముఖ్యంగా గుర్తించాల్సిందేమంటే మితిమీరి తాగితే ఇది ప్రత్యక్షంగా తయారవుతుంది. పొగతాగడం వ్యాయామం చెయ్యకపోవడంలాగే మద్యం మితి మీరి తాగడం కూడా గుండె జబ్బులకు దారి తీసే అంశమని అధ్యయనాలు స్పష్టంగా చెప్తున్నారు. చాలాకాలం విపరీతంగా తాగితే ఆరోగ్యవంతుల్లో ఉన్నట్టుండి గుండె లయ చెడిపోయే ప్రమాదం ఉంది. దీనివల్ల శ్వాస ఇబ్బందులు బీపీలో మార్పులు రావడంతో పాటు గుండెపోటు హఠాన్మరణం ముప్పు కూడా పెరుగుతుంది. ఆల్కహాల్ రక్తంలో హోమోసిస్టీన్ అనే పదార్థం స్థాయిలను ప్రభావితం చేస్తుంది. అది పెరిగితే రక్తనాళాలు మూసుకుపోయి గుండెపోటు వచ్చే రిస్కు పెరుగుతుంది.

ప్రశాంతత ఓ భ్రమ...

చాలామంది తాగితే హాయిగా ఉంటుందని ఆందోళనలన్నీ తగ్గిపోతాయని ఆత్మవిశ్వాసం పెరిగినట్లుందని బాధలన్నీ మర్చిపోయి ప్రశాంతంగా అనిపిస్తుందనీ ఇలా రకరకాల కారణాలతో తాగుతుంటారు. ఎక్కువగా తాగేవారిలో వ్యసనాలే కాదు మానసిక సమస్యలు వ్యాధులు కూడా ఎక్కువే. దీర్ఘకాలం మద్యం తాగడం వల్ల మెదడులో రసాయనాల్లో మార్పులు వస్తాయి. అతిగా తాగేవారిలో ఆందోళన కుంగుబాటు చాలా ఎక్కువ ఆత్మహత్య భావనలు తమకు తాము హాని చేసుకోవడం వంటివి ఎక్కువే. కొన్ని వారాల పాటు మితిమీరి తాగుతుంటే మానసిక భ్రాంతులు ఎవరో మనకు హాని చేయబోతున్నారన్న భ్రమల వంటివి పెరుగుతాయి. అతిగా తాగే అలవాటున్న వారు ఒక్కసారిగా మానేసినా తీవ్రస్థాయిలో మానసిక సమస్యలు తలెత్తవచ్చు. మద్యం వల్ల జ్ఞాపకశక్తి మెదడు పనితీరు కూడా దెబ్బతింటాయి. ముఖ్యంగా మెదడు 18, 19 ఏళ్ల వరకూ ఎదుగుతూనే ఉంటుంది. కాబట్టి ఈ వయసులో మద్యానికి బానిసైతే దాని ప్రభావం మరింత తీవ్రంగా ఉంటుంది.



గసగసాలతో చుండ్రుకు చెక్..

ముఖ్యంగా వెంట్రుకలకు వచ్చే సమస్యల్లో చుండ్రు తరుచూ వెంటాడే బాధ. ఈ సమస్యను వెంటనే వదిలించుకోకపోతే, జుట్టు కుదుళ్లు బలహీనపడి జుట్టు రాలిపోతుంది. చుండ్రు అట్టగట్టినట్లు అయిపోయి పొలుసులుగా, పొక్కులుగా రాలుతూ, విపరీతమైన దురదను కలిగిస్తుంది. చుండ్రు వలన వెంట్రుకల కుదుళ్లు పటుత్వాన్ని కోల్పోయి పూర్తిగా ఊడిపోవడమూ జరుగుతుంది. నల్లగా నిగనిగలాడే జుట్టు ఒక్కసారిగా పాలిపోయి, తెల్లగా మారిపోతుంది. ఫలితంగా అందవిహీనంగా తయారవుతాయి. ఈ సమస్య నుంచి ఉపశమనం పొందడానికి, కొద్దిగా గసగసాలను తీసుకుని, వాటికి పాలు చేరుస్తూ నూరుకోవాలి. తర్వాత దానిని తలకు బాగా పట్టించి, కాసేపు మర్దన చేయాలి. పూర్తిగా ఆరిన తర్వాత తలస్నానం చేయాలి. వారానికి రెండు మూడు సార్లు ఇలా చేస్తే, కొద్ది రోజుల్లోనే చుండ్రు సమస్య పూర్తిగా సమసిపోతుంది.



ఏడడుగుల బంధం బలపడాలంటే..

మూడు ముళ్ల బంధంతో, రెండు జీవితాలను ఒకటి చేసేదే పెళ్లి. అలాంటి అందమైన అపురూపమైన ఏడడుగుల అనుబంధాన్ని క్షణికావేశంతో తీసుకున్న నిర్ణయాలతో జీవితాన్ని చేజేతులారా నాశనం చేసుకుంటున్నాయి కొన్ని జంటలు. విడాకులకు పోకుండా సద్భావన, సామరస్యం పరస్పర సహకారం ఆన్యోన్య దాంపత్యంతో భార్యాభర్తలు సంతోషంగా ఉండడానికి మార్గాలేంటో చూద్దామా...

పెళ్లంటే నూరేళ్ల పంట. పెళ్లి అనేది తమలో వున్న భావనలను వ్యక్తపరుచుకుని, లోపాలను సరిదిద్దుకొని ఒకరినొకరు అర్థం చేసుకోవాలి. ఒక సమస్య ఏర్పడితే, అందుకు తగ్గ పరిష్కార మార్గాన్ని వెతికేందుకు ఒకరికొకరు సహాయంగా వుండాలి. తమకు కావాలసిన వస్తువులు, అవసరాలు, రహస్యాలను దాచిపెట్టకుండా ఒకరికొకరు సహాయంగా ఉండగలగాలి. ఆర్థికపరంగా సమస్యలు వస్తే, వాటిని అధిగమించేందుకు ఇద్దరూ ప్రయత్నించాలి. అప్పుడే ఇద్దరి మధ్య దాంపత్య బంధం గట్టిపడుతుంది.

సమయం వెచ్చించండి..

ప్రస్తుతకాలంలో వివాహం చేసుకున్న వారు కేవలం చిన్నచిన్న కారణాలకే విడాకులను తీసేసుకుంటున్నారు. తమ జీవిత భాగస్వామి తనతో ఎక్కువ సమయం కేటాయించడం లేదని లేదా స్నేహపూర్వకంగా ఉండడం లేదనే భావనతో విడాకులు తీసేసుకుంటున్నారు. అనవసరంగా అనుమానాలను పెంచుకుని తమ అన్యోన్య జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారు.

ఉద్యోగస్తులలో మరీ ఎక్కువ


సమయం కేటాయించలేని సమస్యలు ఉద్యోగస్తులైన దంపతుల మధ్యే ఎక్కువగా కనిపిస్తాయి. ఆఫీసులో సమయాన్ని గడపడం, పనిభారం ఎక్కువవడంతో ఒత్తిడికి గురై తమ భాగస్వామితో జీవితాన్ని ఆస్వాదించలేకపోతారు. ఒకరికొకరు తమ మనసులోని భావాలను వ్యక్తపరుచుకోలేకపోతున్నారు. దీంతో వారు అటు కలిసి వుండలేక, విడిపోయి వుండలేక ఏమి చేయాలో తోచక విడాకులు తీసేసుకుంటున్నారు.

చిన్నవాటికే బెదిరిపోకండి..

కొత్తగా పెళ్లయిన జంటలు కొన్నాళ్లవరకు కలిసిమెలిసి, అన్యోన్యంగా సంతోష జీవనాన్ని గడుపుతారు. కానీ కొన్నాళ్ల తర్వాత చిన్నపాటి ఇబ్బందులతో దూరంగా ఉంటున్నారు. ఇలా చిన్నవాటికే సర్దుకోకుండా విడిపోయేంత పెద్ద నిర్ణయాలు తీసుకోవడం మంచిది కాదు. సాధ్యమైనంతవరకు జీవిత భాగస్వామితో గడిపేందుకు ఆసక్తి చూపించాలి. ఆఫీసు పనులు ముగియగానే ఒకరి కోసం ఒకరు కొంత సమయం కేటాయించాలి. దాంతోపాటు ఆఫీసులోని సమస్యలను జీవిత భాగస్వామితో పంచుకుంటే ఇద్దరి మధ్య అన్యోన్యత పెరిగి దూరం తగ్గుతుంది.

కొత్త జీవితానికి ఆరంభం..

ఒకవేళ వివాహ జీవితంలో నిత్యం గొడవలు లేదా తగాదాలు ఏర్పడితే, వాటిని మర్చిపోయేందుకు మీ వివాహ జీవితాన్ని మళ్లీ కొత్తగా ప్రారంభించేందుకు ఆసక్తి చూపించాలి. ఇలాంటి ప్రణాళికలు మహిళలకే సాధ్యమవుతుంది. దంపతులు దూరంగా వుంటున్నప్పుడు తమ మధ్య ఇంతకుముందున్న మంచి విషయాలు, క్షణాల గురించి గుర్తుచేసుకోవడానికి ప్రయత్నించాలి. ఇవి ఎంతో ఆనందాన్ని కలిగిస్తాయి. అలాగే మీ జీవిత భాగస్వామి మీద మీకు ఎంత ప్రేముందో వారికి తెలియజేసేటట్లు చేయాలి. మీరు మీ హావభావాలతో వారిని ఆకట్టుకునేలా చేసుకోవాలి. అప్పుడే ఇద్దరి మధ్య వున్న దూరం తగ్గుతుంది. జీవన ప్రయాణాన్ని తిరిగి సంతోషంగా కొనసాగించవచ్చు.



ప్రేమను చిగురింపచేసుకోండి..

దంపతుల మధ్య ఏదైనా సమస్య వచ్చి తగాదాలు ఏర్పడినప్పుడు దానికి గొడవ పడకుండా ఒకరికొకరు క్షమాపణలు చెప్పుకోవడం ఎంతో ఉత్తమమైన పద్ధతి. ఇటువంటి పద్ధతిని అనుసరిస్తే.. ఒకరిమీద ఇంకొకరికి ప్రేమ చిగురిస్తుంది. అసలు ఆ తప్పు ఏమి జరిగిందో కూడా గుర్తించలేరు. ఇద్దరిలో తప్పు ఎవరు చేసినా, ఒకరికొకరు దానిని పరిష్కరించుకోవడానికి సహాయపడాలి. అప్పుడే మీ మధ్య వున్న దాంపత్య జీవితం బాగుంటుంది.

ఒత్తిళ్లకు గురవ్వకండి

మీ జీవిత భాగస్వామి స్నేహితులతో ఎక్కువ సమయం కేటాయిస్తున్నారని అనవసరంగా బాధపడకండి. లేకపోతే ఇవి తీవ్రమై మానసికంగా ఒత్తిళ్లను ఎదుర్కోవలసి వస్తుంది. అలాగే ఎవరైనా తప్పులు చేసినప్పుడు అది తమకుతామే గుర్తించుకోవాలి. దానికి తగ్గ పరిష్కారాన్ని సొంతంగా వెదుక్కోవాలి.



మొండిగా వాదించొద్దు

పెళ్లయిన ప్రతి జంట తమలో వుండే మైనస్ పాయింట్లను ముందుగా గుర్తించుకోవాలి. ఏదైనా ఒక చిన్న సమస్య వస్తే దాని గురించి అనవసరంగా మాట్లాడి టైమ్‌ని వృధా చేయకుండా పరిష్కారమార్గాన్ని వెతుక్కోవాలి. అవసరమైతే ఒకరికొకరు తమ జీవనశైలి విధానాన్ని మార్చుకోవడానికి కూడా సిద్ధపడాలి. అప్పుడే ఇద్దరి మధ్య ఉండే బంధం బలపడుతుంది. భార్యాభర్తలిరువురు ముందు తమ వైఖరిని మార్చుకోవడానికి ప్రయత్నించాలి.

నెయిల్ పాలిష్ నిల్వాలంటే...



గోళ్లు తెల్లగా పొడవుగా ఉన్నా అందంగా ఉంటాయి. వాటికి నెయిల్ పాలిష్ వేస్తే అందం మరింత రెట్టింపు అవుతుంది. నెయిల్ పాలిష్‌ల రంగులు కొన్ని కావు కదా! ఎన్నో రంగులు ఎన్నో వెరైటీలు మరి సూపర్ లుక్‌ని ఇచ్చే పాలిష్‌లు వేసుకున్న కొద్ది రోజుల్లోనే పోతే నచ్చుకోరు చాలా మంది. కొద్ది రోజుల పాటు ఉంటే బాగుండు అనుకునే వారికి ఈ నెయిల్ పాలిష్ వేసే ముందు ఏం చేయాలనే చిట్కాలను చూడండి.



గోళ్ల రంగు నేరుగా కాకుండా ముందు రఫ్‌గా వేయాలి. గోటి మీద బ్రష్‌తో మూడు స్ట్రోక్స్‌లోనే రంగును నింపేయాలి. మొదట మధ్యలో తర్వాత కుడి, ఎడమ వైపు బ్రష్‌ను రంగులో ముంచి పైనుంచి కిందకి లాగాలి.



- రంగు వేసుకునేముందు గోరు చుట్టూ ఉండే చర్మం మీద వాజిలిన్ రాసుకుంటే రంగు అంటుకోకుండా ఉంటుంది.
- వేళ్ల మధ్య కాటన్ బాల్స్ ఉంచుకుంటే వేళ్లకూ రంగు అంటుకోదు.
- నెలకోసారైనా ఓ నాలుగు రోజులపాటు ఇలా చేయాలి.
- రంగును తొలగించటానికి అసిటోన్ వాడటం మంచిది.
- గోళ్లతో లేదా నెయిల్ కట్టర్‌తో రబ్ చేసి రంగు తొలగిస్తే గోళ్లు దెబ్బ తింటాయి.
- గోళ్ల ఆరోగ్యం కాపాడుకోవాలంటే కొన్ని రోజులపాటు గోళ్లను రంగు లేకుండా వదిలేయాలి.


మాటే మంత్రం..

నీ జీవితం కళావిహీనం అయినప్పుడు నీ చుట్టూ ఉన్న వాళ్ల అసలు రంగు బయట పడుతుంది. తట్టుకొని నిలబడితే, నీ జీవితం మళ్లీ ఇంద్రధనస్సులా విరియక మానదు.



ముంగిట్లో ముగ్గు







వైయోలెట్ అందాలు.. ఆఫ్రికన్ పూలలో..



పూవ్వులంటే అందరికీ ఇష్టమే. వాటిని, ఇష్టపడని వారుండరు. పువ్వు రంగు ఎలాంటిదైనా అందరి మనసులను దోచేస్తాయి. కొన్ని పూలు ముచ్చటైన రంగుల్లో అందరినీ ఆకట్టుకుంటుంటాయి. పెరట్లో, డాబా పైన, ఇండోర్ ప్లాంట్‌గా కూడా వీటిని పెంచుకోవచ్చు. ఈ వైలైట్స్ మొక్కలని పెంచుకోవడం మాత్రమే కాదు. బంధువులకు, స్నేహితులకు బహుమతిగా కూడా ఇవ్వొచ్చు. ప్రత్యేకతని చాటుకునేవే ఆఫ్రికన్ వైలెట్లు. ఇవి వందల వెరైటీలలో దొరుకుతున్నాయి. మన దేశంలో మాత్రం ఎరుపు, గులాబీ, తెలుపు వంటి ఐదారురంగుల్లో అందరికీ అందుబాటులో ఉన్నాయి. ఇవి ఎక్కువగా నర్సరీల్లో లభిస్తాయి.

ఇంట్లోనే పెంచవచ్చు...

మన వాతావరణానికి అనుకూలంగా చక్కగా పెరుగుతుంది. పూలు త్వరగా పూస్తాయి. ఇతర పూల మొక్కలతో పోలిస్తే, ఈ మొక్క నేరుగా పడే సూర్యకాంతిని తట్టుకోలేదు. అందువల్ల వీటిని పెరట్లో పెంచుకుంటున్నా, కుండీల్లో నాటుకుని, ఇంట్లోనే పెంచుకుంటున్నా తగినంత వెలుతురు ఉండేలా చూసుకోవాలి. ముదురు రంగుల్లో గుబురుగా పూలు పూయడం ఈ మొక్క ప్రత్యేకత. బాల్కనీ, కిటికీలు, మాత్రమే కాదు, టీపాయ్, పైన, గది మూలలో ఇలా ఎక్కడైనా ఈ మొక్కను పెట్టుకోవచ్చు. వెలుతురు తక్కువగా ఉన్నప్పుడు గాలి ధారాళంగా వచ్చేలా చూసుకోవాలి. లేదంటే ఫంగల్ ఇన్ఫెక్షన్‌కు గురయ్యే ప్రమాదం ఉంది.



ఆఫ్రికన్ వైలెట్‌ను పెంచాలనుకుంటే..

తేమ ఎక్కువగా పీల్చుకునే మట్టిని ఎంచుకోవాలి. సమాన పరిమాణంలో కోకోపీట్ ఎరువుల మిశ్రమాన్ని కలిపి మొక్కను నాటాలి. లేదంటే మట్టిలో తేమ తగ్గి ఆకులు సహజ అందాన్ని కోల్పోతాయి. క్రమంగా ఎండి, రాలిపోతాయి. అందుకే ఎప్పటికప్పుడు తేమ తగ్గకుండా చూసుకుంటుండాలి. ఇలా కుదరనప్పుడు సెల్ఫ్ వాటర్ కంటైనర్‌ని మొక్క దగ్గర ఏర్పాటు చేసినా మంచిదే. దీని వల్ల నెల వరకూ దానికి తేమను తగ్గుతుందన్న భయం ఉండదు.

ఒక దాంతో మరోటి..

ఉన్న మొక్క నుంచి మరికొన్ని పెరిగేలా కూడా చేయొచ్చు. ఈ మొక్క కాండం చాలా సున్నితంగా ఉంటుంది. దాని లోపల జెల్లీ లాంటి ద్రవం ఉంటుంది. దీన్ని నాటేముందు కణుపుల దగ్గర పదునైన చాకుతో కత్తిరించి అంటుకట్టడం ద్వారా కొత్త మొక్కలను తక్కువ ఎండ తగిలే చోట ఉంచితే సరిపోతుంది.

పోషకాలూ అందించాలి..



ఈ మొక్క ఎంత సులువుగా పెరుగుతుందో అంత సున్నితమైంది కూడా. అందుకే నీళ్లు పెట్టడం నుంచి ఎరువులు వేసే వరకూ కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. ఏ నీళ్ళు పడితే అవి కాకుండా, ఫిల్టర్ నీటిని ఎంపికచేసుకోవాలి. అలాగే కొన్ని నీటిలో కరిగే ఎన్ పీకే, మైక్రోన్యూట్రీయంట్లను కలిపి నెలకోసారి చల్లాలి. ఎరువుల మోతాదు ఎక్కువైతే మొక్క మాడిపోయే ప్రమాదం ఉంటుంది. అందుకే మోతాదుని తగినంత సమానంగా తీసుకోవాలి.

ఇవన్నీ ఒకఎత్తైతే వీటికి చీడపీడల బెడద కూడా ఎక్కువే. కంటికి కనబడే ఆకులు, కాండంపై దాడిచేసే పురుగులతో పాటు, కనిపించకుండా వేళ్లను నాశనం చేసేవీ ఉంటాయి. కాబట్టి పదిహేను రోజులకోసారి వేపనూనె, వెల్లుల్లి రసం కలిపిన నీళ్లను ఆకులపై చల్లుతూ ఉండాలి. సర్ఫ్ నీళ్లతో ఆకులను తుడవాలి. ఈ జాగ్రత్తలతో పాటు యాంటీఫంగల్‌గా పరిగణించే కార్బన్‌డైజమ్‌ను నీళ్లలో కలిపి అప్పుడప్పుడూ చల్లుతుంటే, మొక్క ఆరోగ్యంగా పెరుగుతుంది.




‘మా’ పథకాలకు మెగా ప్రశంస

మూవీ ఆర్టిస్టుల సంఘం (మా) ఇటీవలే కొత్త పథకాల్ని ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆ మేరకు మా అధ్యక్షకార్యదర్శకులు శివాజీ రాజా, సీనియర్ నరేష్ ఈ పథకాల వివరాల్ని అందించారు. మా డైరీ ఆవిష్కరణలో సూపర్‌స్టార్ కృష్ణ విజయ నిర్మల, రెబల్‌స్టార్ కృష్ణంరాజు శ్యామలా దేవి దంపతులు ఈ పథకాల్ని ప్రశంసించి తమవంతు సాయాన్ని ప్రకటించిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ పథకాలకు ప్రత్యేకించి విడివిడిగా నామకరణం చేసింది మా అసోసియేషన్. ఈ పథకాలు అద్భుతంగా ఉన్నాయని, మూవీ ఆర్టిస్టుల సంఘం మంచి పనులు చేసేందుకు ప్రతిసారీ ముందుకొస్తోందని మెగాస్టార్ చిరంజీవి అభినందించారు. మా అధ్యక్షుడు శివాజీరాజా, ఇతర సభ్యుల కృషిని ప్రత్యేకంగా అభినందించారు. 2019 జనవరి 1 నుంచి మా అసోసియేషన్ తమ మెంబర్స్ కోసం ప్రవేశపెట్టిన పథకాల వివరాలివి. ‘డా.చిరంజీవి మా కళ్యాణ లక్ష్మి పథకం’ పేరుతో రూ.1,16, 000 మొత్తాన్ని పెళ్లి చేసుకునే ఆడపిల్లకు అందజేస్తారు. ‘డా.ఏఎన్నార్ మా విద్యా పథకం’ పేరుతో 80శాతం స్కోర్ చేసిన పిల్లలకు రూ.1,00,000 అందజేస్తారు. డా.విజయనిర్మల మా చేయూత పథకం పేరుతో వృద్ధులకు నెలవారీ ఫించను రూ.5000 చొప్పున అందిస్తారు. ఇదివరకూ రూ.2000గా ఉన్న ఫించనును రూ.5000కు పెంచారు. 35 మంది సభ్యులకు ఈ ఫించను అందనుంది. ‘శ్రీకాంత్ మా మానవతా ఎల్‌ఐసీ పథకం’ పేరుతో రూ.3,00,000 ఇన్సూరెన్స్ సదుపాయం మెంబర్స్ కి కలగనుంది. ఇలాంటి పథకాలు భారతదేశం లోనే వేరొక సినీపరిశ్రమలో ఎక్కడా అమలు చేయలేదని ప్రముఖులు ప్రశంసించారు.







కొత్త పోస్టర్లతో

కొత్తగా కొత్తకొత్తగా..









2018కి టాటా చెప్పి 2019కి వెల్‌కం చెప్పాం. ప్రతియేటా కొత్త సంవత్సర వేడుకల్లో టాలీవుడ్ నుంచి ట్రీట్ తప్పనిసరి. ఈసారి సెలబ్రిటీలంతా కుటుంబ సమేతంగా డిసెంబర్ 31 మిడ్‌నైట్ సెలబ్రేషన్స్‌తో చిలౌట్ చేశారు. కొందరు హైదరాబాద్‌లోనే వారి వారి ఇళ్లలోనే ఈ వేడుకలు జరుపుకుంటే, మరికొందరు బంధు మిత్రుల్ని ఇంటికి ఆహ్వానించి పార్టీలు చేసుకున్నారు. ఇంకొందరు విదేశాలకు వెళ్లి అక్కడ ఉన్న బంధుమిత్రులతో సెలబ్రేషన్స్ సాగించారు. అదంతా అటుంచితే కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకుని తెలుగు రాష్ట్రాల అభిమానుల కోసం రిలీజ్‌కి రాబోతున్న సినిమాల కొత్త పోస్టర్లను రిలీజ్ చేశారు మేకర్స్. జనవరి 1 గ్రీటింగ్ కార్డ్స్‌లా తామర తంపరగా బోలెడన్ని పోస్టర్లు రిలీజయ్యాయి.

శివాజీ.కె

కొత్త సంవత్సరం కొత్త కొత్తగా మొదలైంది. కొత్త పోస్టర్లతో 2019 కిక్ స్టార్టయ్యింది. ఈసారి బాలకృష్ణ, మహేష్, రామ్ చరణ్, విక్టరీ వెంకటేష్, కళ్యాణ్ రామ్, వరుణ్ తేజ్ ఇలా హీరోలంతా స్పెషల్ ట్రీట్ ఇచ్చారు. ఎన్టీఆర్ చిత్రంలో బసవతారకం పాత్రలో నటిస్తున్న విద్యాబాలన్ స్పెషల్ పోస్టర్లు రిలీజయ్యాయి. మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ నటించిన వినయ విధేయ రామ, సూపర్‌స్టార్ మహేష్ నటిస్తున్న మహర్షి పోస్టర్లు లైవ్‌లోకి వచ్చి అభిమానుల్లో జోష్‌ని నింపాయి. తమ అభిమాన స్టార్లను చాలా కొత్తగా కొత్త గెటప్పుల్లో చూశామని అభిమానులు మురిసి పోతున్నారు. రెండు పోస్టర్లు రిలీజైతే, ఓ పోస్టర్‌లో చరణ్ ఫక్తు ఫ్యామిలీ మ్యాన్‌గా కనిపించాడు. పైగా సంక్రాంతి పండగ తెచ్చినంత పల్లె పట్టు కుర్రాడిలా పంచె కట్టుతో తళుక్కుమన్నాడు. అన్నలు వదినలతో సెలబ్రేషన్ మోడ్‌లో ఉన్న చరణ్ మైమరిపించాడు. వేరొక పోస్టర్‌లో కియరా అద్వాణీతో రొమాంటిక్ యాంగిల్‌ని ఎలివేట్ చేశారు. ఈ పోస్టర్లకు విభిన్నంగా పూర్తి కాంట్రాస్ట్ లుక్‌తో మహేష్ పెద్ద సర్‌ప్రైజ్ ట్రీట్ ఇచ్చారు. మహేష్ అల్ట్రా మోడ్రన్ సోగ్గాడిలా, శ్రీమంతుడిలా.. సూటు బూటు వేసిన శోభన్‌బాబులా దర్శనమిచ్చారు. వీళ్లకు తోడు ఈ సంక్రాంతి బరిలోనే రిలీజ్‌కి వస్తున్న ‘ఎన్టీఆర్ బయోపిక్’ పోస్టర్లు ఆసక్తి రేకెత్తించాయి. కథానాయకుడు భోజనాల ఫోటో, బసవతారకం ఫోటో లైవ్ లీనెస్ తో ఆకట్టుకున్నాయి. అలాగే మెగాస్టార్ చిరంజీవి సహా పలువురు టాలీవుడ్ స్టార్లు నటిస్తున్న సినిమాల పోస్టర్లతో ఓ కేరళ అభిమాని రూపొందించిన కొత్త సంవత్సరం క్యాలెండర్ మైమరిపిస్తోంది. అలాగే డా.రాజశేఖర్ ‘పీఎస్‌వి గరుడవేగ’ లాంటి బ్లాక్‌బస్టర్ తర్వాత ‘కల్కి’ అనే భారీ చిత్రంలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా న్యూలుక్ రిలీజై అభిమానుల్ని ఆకట్టుకుంది. రాజశేఖర్ షో మ్యాన్‌లా అదరగొట్టారు. ప్రశాంత్ వర్మ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాని సి.కళ్యాణ్, శివానీ–శివాత్మిక సంయుక్తంగా నిర్మిస్తున్నారు. 1983 బ్యాక్‌డ్రాప్‌లో సాగే కథాంశమిది. అదాశర్మ, నందిత శ్వేత, స్కార్లెట్ కథానాయికలుగా నటిస్తున్నారు. అక్కినేని అఖిల్ నటిస్తున్న ‘మిస్టర్ మజ్ను’ కొత్త పోస్టర్ రిలీజై ఆకట్టుకుంది. నేటి సాయంత్రం 6 గంటలకు టీజర్ రిలీజ్ కానుంది. ఈ చిత్రాన్ని ఈనెల 25న రిలీజ్ చేయనున్నారు. వెంకీ అట్లూరి దర్శకత్వంలో బివిఎస్ఎన్ ప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

నందమూరి కళ్యాణ్ రామ్ 118 న్యూలుక్ ఇంప్రెస్సివ్. 2017 కళ్యాణ్ రామ్ లో ఎంత మార్పు తెచ్చిందో చూశాం. టెంపర్ నుంచి అతడి స్టైల్ పూర్తిగా మారిపోయింది. అంతకంతకు మేకోవర్‌తో గ్రిప్ పెంచుకుని కొత్త లుక్‌తో అదరగొట్టేస్తున్నారు. 118 లుక్ చాలా పెప్పీగా, ఎంతో స్టైలిష్ గా కనిపిస్తున్నారు కళ్యాణరాముడు. కొంత గ్యాప్ తర్వాత గజిని సూర్య బరిలో దిగుతున్నాడు. అతడు నటిస్తున్న సూర్య 37 త్వరలో రిలీజ్ కి రానుంది. ఈ సినిమాకి ‘కాప్పాన్’ అనే టైటిల్‌ని ప్రకటించారు. తమిళ పోస్టర్ ఆకట్టుకుంది. సూర్య గన్ చేతపట్టి కార్పొరెట్ గురూలా, గ్యాంగ్ స్టర్ లా కొత్త లుక్ లో కనిపించాడు. సూపర్ స్టార్ రజనీ కాంత్ స్టయిల్ గురించి ప్రత్యేకంగా ప్రస్థావించాల్సిన పనేలేదు. ఆయన నటించిన పేట (పెట్టా) ఈ సంక్రాంతి బరిలోనే తమిళ్, తెలుగులో రిలీజవుతోంది. తాజా గా కార్తీక్ సుబ్బరాజు టీమ్ కొత్త పోస్టర్ ని పంపింది. విక్టరీ వెంకటేష్, వరుణ్ తేజ్ నటిస్తున్న ‘ఎఫ్ 2– ఫన్ అండ్ ఫ్రస్టేషన్’ ఆడియోకి ఇప్పటికే మంచి మార్కులే పడ్డాయి. ఓ రెండు పాటలు మాస్ లో మోతెక్కుతున్నాయి. రాక్ స్టార్ దేవీశ్రీ తెచ్చిన కొత్త ఊపు ఇది. ఇకపోతే ఈ సినిమా కొత్త పోస్టర్ ని రిలీజ్ చేశారు. మిల్కీ వైట్ బ్యూటీ తమన్నా దటీజ్ మహాలక్ష్మి పోస్టర్ ఆకట్టుకుంది. తాజాగా బెల్లంకొండ కొత్త సంవత్సరం శుభాకాంక్షలు పోస్టర్ ని రివీల్ చేసింది యూనిట్. బెల్లంకొండ కొత్త సంవత్సరంలో కొత్త ప్రణాళికలతో మెప్పిస్తాడేమో చూడాలి. ఇక అక్కినేని కాంపౌండ్, నందమూరి కాంపౌండ్ హీరోలకు సంబంధించి.. మొన్న క్రిస్మస్ నుంచి ఎప్పటికప్పుడు కొత్త పోస్టర్లు వస్తూ మైమరిపిస్తూనే ఉన్నాయి. వింక్ గాళ్ ప్రియా వారియర్ ‘లవర్స్ డే’ పోస్టర్ కొత్త ఏడాది ట్రీట్ తో మైమరిపించింది. ఇంకా బోలెడన్ని పోస్టర్లు నేడు లైవ్ లోకి రానున్నాయి. ఏ ఫ్లైయింగ్ ఫ్రాగ్స్ ప్రొడక్షన్స్ సంస్థలో అల్లరి రవిబాబు దర్శకత్వంలో తెరకెక్కనున్న ‘ఆవిరి’ పోస్టర్ క్రియేటివ్ లుక్ తో ఆకట్టుకుంది. ఓఎస్.ఎం ప్రొడక్షన్స్ సంస్థ నుంచి నేను లేను కొత్త పోస్టర్ రిలీజైంది. ప్రాణం ‘దేవరాజ్’ శ్రీ భ్రమ రాంబ సమేత మల్లికార్జున స్వామి పిక్చర్స్ వైరం పోస్టర్ ఆకట్టుకుంది. చంద్ర శేఖర్ మూవీస్ కెఎస్ 100 పోస్టర్ ఆకట్టుకుంది.

వీళ్లంతా స్కిప్

ఈసారి రేసులో బన్ని, ప్రభాస్, నితిన్, రామ్, నిఖిల్ లాంటి హీరోలు కొత్త పోస్టర్లతో సందడి చేస్తారనుకుంటే స్కిప్ కొట్టి అభిమానుల్ని నిరాశపరిచారు. అల్లు అర్జున్– త్రివిక్రమ్ కాంబినేషన్ మూవీ ఈ నెలలో ప్రారంభం కానుందని ప్రకటించిన సంగతి తెలిసిందే. రామ్–పూరి జగన్నాథ్ సినిమా లాంచ్‌కి రెడీ అవుతోంది. నిఖిల్ ‘ముద్ర’ రిలీజ్‌కి రెడీ అవుతోంది.







కోడిగుడ్లు	రిటైల్ ధర (100కు)		
హైదరాబాద్	439	విజయవాడ	453
ముంబయి	494	ఢిల్లీ	460
చెన్నై	45	బెంగళూరు	445



బ్రాయిలర్ చికెన్	ఫామ్‌గేట్ ధర (కిలో) రూ.		
హైదరాబాద్	180–220	ఢిల్లీ	160
కరీంనగర్	195	ముంబయి	185
వరంగల్	190	చెన్నై	180



సెన్సెక్స్ +186.24
36,255



నిఫ్టీ +47.55
10,910

రూపాయి
₹69.68
(ఒక అమెరికా డాలర్‌కు)



పసిడి
32,635.00
(హైదరాబాద్‌లో) 10 గ్రాములకు/(రూ.)లలో

ఆరంభంలోనే అదుర్స్

- బలపడిన సెన్సెక్స్, నిఫ్టీ
- లాభంలో ఎస్‌బీఐ, భారత్ పెట్రోలియం, ఎయిర్‌టెల్ షేర్లు



ముంబయి: దేశీయ మార్కెట్లు కొత్త ఏడాది ఆరంభం అదిరింది. అంతర్జాతీయ మార్కెట్ల మిశ్రమ సంకేతాలతో ట్రేడింగ్ ఆరంభంలో సూచీలు కాస్త తడబడినా.. చివరి గంటల్లో వెల్లువెత్తిన కొనుగోళ్లు మార్కెట్లకు ముందుకు నడిపించాయి. ఫలితంగా సూచీలు లాభాలను దక్కించుకున్నాయి. సెన్సెక్స్ దాదాపు 200 పాయింట్లు ఎగబాకగా.. నిఫ్టీ మళ్లీ 10,900 పాయింట్ల స్థాయిని దాటింది.


మంగళవారం ఉదయం సూచీలు ఫ్లాట్‌గా ప్రారంభమయ్యాయి. ఐటీ, ఆటోమొబైల్ రంగాల షేర్లలో అమ్మకాల ఒత్తిడితో ఆరంభ ట్రేడింగ్‌లో మార్కెట్లు కాస్త తడబడ్డాయి. ఒక దశలో నష్టాల్లో సాగాయి. అయితే చివరి గంటల్లో బ్యాంకింగ్, వినియోగ రంగాల షేర్లలో కొనుగోళ్ల అండతో సూచీలు కోలుకున్నాయి. లాభాల బాట పట్టాయి. మార్కెట్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 186 పాయింట్లు లాభపడి 36,254 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 48 పాయింట్ల లాభంతో 10,910 వద్ద ముగిసింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 69.65గా కొనసాగుతోంది. ఎన్‌ఎస్‌ఈలో హెచ్‌డీఎఫ్‌సీ, ఎయిర్‌టెల్, ఎస్‌బీఐ, భారత్ పెట్రోలియం, భారతీ ఇన్ఫ్రాటెల్ షేర్లు లాభపడగా.. మహీంద్రా అండ్ మహీంద్రా, హిందాల్కో, ఇండియాబుల్స్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్, హిందుస్థాన్ యునిలివర్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ షేర్లు నష్టపోయాయి.

సరికొత్త ఫీచర్లతో మైక్రోసాఫ్ట్ ల్యాప్‌టాప్..

ముంబై: తమ వినియోగదారులకు అమెరికాకు చెందిన మల్టీనేషనల్ టెక్నాలజీ కంపెనీ మైక్రోసాఫ్ట్ శుభవార్త అందించింది. 4జీబీ ర్యామ్, 64జీబీ స్టోరేజ్ వేరియంట్ గల మైక్రోసాఫ్ట్ ల్యాప్‌టాప్ ప్రారంభ ధర రూ. 38,599 నుంచి మొదలవుతుందని కంపెనీ వెల్లడించింది. 8జీబీ ర్యామ్, 128జీబీ వేరియంట్ ల్యాప్‌టాప్ రూ. 50,999 లభిస్తోందని సంస్థ పేర్కొంది. 10 అంగుళాల టు ఇన్ వన్ డివైస్ మైక్రోసాఫ్ట్ సర్ఫేస్ ట్యాబ్లెట్‌ను గత సంవత్సరంలో విడుదల చేశారు. యూఎస్‌బీ టైప్‌సీ 3.1 డేటా, వీడియో చార్జింగ్, హెడ్‌ఫోన్ జాక్, మైక్రోఎస్డీ కార్డు, 5 మెగా పిక్సెల్ హెచ్‌డీ కెమెరా, 8 మెగా పిక్సెల్ హెచ్‌డీ కెమెరా, డ్యూయల్ మైక్రోఫోన్స్ ఉంటాయి



పేటీఎంకు ఊరటనిచ్చిన ఆర్‌బీఐ



- బిజినెస్ పునః ప్రారంభించుకునేందుకు ఆర్‌బీఐ గ్రీన్ సిగ్నల్
- త్వరలో పేటీఎం.. కేవైసీ ప్రాసెస్

ఢిల్లీ: 2019 కొత్త ఏడాది ఆరంభంలో పేమెంట్ సేవల సంస్థ పేటీఎం పేమెంట్స్ బ్యాంకుకు భారీ ఊరట లభించింది. గత ఏడాది నిలిచిపోయిన బిజినెస్‌ను పునఃప్రారంభించుకునేందుకు రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ–వాలెట్లను తెరుచుకునేందుకు, కొత్త కస్టమర్ల నమోదుకు అనుతినిచ్చింది. దీంతో తన బ్యాంకింగ్ సేవలను మరింత మెరుగు పరచడానికి సంబంధిత వినియోగదారుల కేవైసీ ప్రా సెస్‌ను ప్రారంభించాలని యోచిస్తోంది.వన్9 కమ్యూనికేషన్స్, విజయ్‌శేఖర్ శర్మ సహ యాజమాన్యంలోని పేటీఎం బ్యాంకులో కెవైసీ నిబంధనలు ఉల్లంఘనల ఆరోపణలతో గత ఏడాది జూన్లో కొత్త కస్టమర్లను నమోదును ఆర్బీఐ నిలిపివేసింది. అలాగే బ్యాంక్ సీఈవో రేణు సత్తిని తొలగించి, కొత్త సీఈవో, ఎండీగా సతీష్ గుప్తాను నియమించింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో దాదాపు 32 సంవత్సరాల అనుభవం కలిగిన సతీష్ గుప్తా ఒక అనుభవజ్ఞుడైన బ్యాంకరు. నేషనల్ పేమెంట్స్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా (NPCI) తో చీఫ్ ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా పనిచేసిన అనుభవం ఉంది. కాగా పేటీఎం పేమెంట్స్ బ్యాంకులో సుమారు 42 మిలియన్ల ఖాతాలుండగా, 2019 చివరి నాటికి 100 మిలియన్ల వినియోగదారులను చేరుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది.

పైపైకి పసిడి ధరలు



- కొత్త ఏడాది ఆరంభంలో రూ.200 పెరిగిన బంగారం ధర

ఢిల్లీ: కొత్త ఏడాది మొదటి రోజున బంగారం, వెండి ధరలు పైకి ఎగబాకాయి. వినియోగదారుల నుంచి డిమాండ్ పెరగడంతో ఈరోజు బులియన్ మార్కెట్లో పది గ్రాముల స్వచ్ఛమైన పసిడి ధర రూ.200 పెరిగి రూ.32,470కి చేరింది. అదే బాటలో వెండి ధర కూడా పెరిగింది. కేజీ వెండి ధర రూ.150 పెరిగి రూ.39,250గా ఉంది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి వెండికి డిమాండ్ పెరిగినట్లు మార్కెట్ వర్గాలు వెల్లడించాయి. 2018లో బంగారం ధరలు పెరిగాయి. ఏడాది మొత్తంలో పది గ్రాముల స్వచ్ఛమైన బంగారం ధరపై రూ.1870 దాకా పెరిగింది. దాదాపు 6.15శాతం పెరిగినట్లు. 2017 డిసెంబరు 30వ తేదీన పది గ్రాముల బంగారం ధర రూ.30,400గా ఉండగా 2018 చివరకు అది రూ.32,270కి చేరింది. అలాగే 2018లో కేజీ వెండి ధరపై రూ.880 దాకా తగ్గింది. అంటే దాదాపు 2.2శాతం తగ్గినట్లు. 2017 డిసెంబరు 30వ తేదీ నాటికి కేజీ వెండి ధర రూ.39,980గా ఉండగా 2018 చివరకు రూ.39,100కి చేరింది.

నవంబర్‌తో పోలిస్తే గత నెల తగ్గిన జీఎస్‌టీ వసూళ్లు



- డిసెంబర్‌లో రూ.94,726కోట్ల వసూళ్లు

ఢిల్లీ: 2018 నవంబర్ తో పోల్చుకుంటే గత నెల డిసెంబర్‌లో జీఎస్‌టీ వసూళ్లు బాగా తగ్గాయ్ అని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ వెల్లడించింది . నవంబరు నెలలో జీఎస్టీ వసూళ్లు రూ.97,637కోట్లు రాగా.. డిసెంబరు నెలలో కేవలం రూ.94,726కోట్లు మాత్రమే వచ్చాయి. డిసెంబరు 30, 2018 నాటికి దాఖలయిన మొత్తం జీఎస్టీఆర్–3బీ రిటర్న్‌ల సంఖ్య 72.44లక్షలుగా ఉన్నట్లు కేంద్ర ఆర్థికమంత్రిత్వ శాఖ ఓ ప్రకటన ద్వారా వెల్లడించింది.

కేంద్ర జీఎస్టీ కింద రూ.16,442కోట్లు వసూలు కాగా రాష్ట్ర జీఎస్టీ కింద రూ.22, 459కోట్లు, ఇంటిగ్రేటెడ్ జీఎస్‌టీ(ఐజీఎస్టీ) రూ.47,936కోట్లు, సెస్ కింద రూ.7,888కోట్లు వసూలు అయ్యాయి. ఐజీఎస్‌టీ నుంచి సీజీఎస్‌టీకి రూ.18,409కోట్లు, ఎస్ జీఎస్టీకి రూ.14,793కోట్లను ప్రభుత్వం కేటాయించింది. డిసెంబరు 2018లో వసూలైన రెవన్యూ మొత్తం మదింపు తర్వాత సెంట్రల్ జీఎస్టీ రూ.43,851కోట్లు కాగా.. రాష్ట్ర జీఎస్టీ రూ.46,252కోట్లుగా ఉంది. గతేడాది రెండు సార్లు జీఎస్టీ వసూళ్లు లక్ష కోట్ల మార్క్‌ను దాటాయి. ఏప్రిల్లో రూ.1.03లక్ష కోట్లు, మేలో రూ.94,016కోట్లు, జూన్‌లో రూ.95,610కోట్లు, జులైలో రూ.96,483కోట్లు, ఆగస్టులో రూ.93,960కోట్లు, సెప్టెంబరులో రూ.94,442కోట్లు, అక్టోబరులో రూ.1,00,710కోట్లు, నవంబరులో రూ.97,637కోట్లు వచ్చాయి.

తగ్గిన ఎంఐ స్మార్ట్ టీవీ ధరలు



ముంబై: స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌లో భారత్‌లో టాప్ నిలిచిన చైనా కంపెనీ టీవీ మార్కెట్లోకి ఎంట్రీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఎంఐ స్మార్ట్‌టీవీ పేరుతోబడ్జెట్ ధరల్లో వీటిని కస్టమర్లకు అందుబాటులోకి తీసుకొచ్చి స్మార్ట్‌టీవీల్లో కూడా నెం.1 బ్రాండ్‌గా నిలిచింది.

తాజాగా షావోమి తన కస్టమర్లకు నూతన సంవత్సర కానుకను అందించింది. ఎంఐ టీవీలపై ధరలను తగ్గించినట్టు ప్రకటించింది. ఎంఐ టీవీల ధరలను తగ్గించినట్టు షావోమి వెల్లడించింది. వెయ్యి నుంచి 2వేల రూపాయల దాకా ఈ తగ్గింపు ఉండనుంది. 32 అంగుళాల ఎంఐ టీవీ 4ఏ ధర రూ.1500 తగ్గింపుతో ప్రస్తుతం రూ.12,499లకు అందుబాటులో ఉంది.32 అంగుళాల ఎంఐ టీవీ 4సీ ప్రొ ధర. రూ.13,999గా ఉంది. రూ.2 వేలను తగ్గించింది. 49 అంగుళాల ఎంఐ ఎల్ఈడీ టీవీ 4ఏ ప్రొ రూ.1000తగ్గి రూ. 30,999లకే అందుబాటులో ఉంది.

స్పోర్ట్స్

కొత్త ఏడాదిలో వార్నర్‌కు తీపి కబురు



- మరోసారి తండ్రి కాబోతున్న డేవిడ్

సిడ్నీ: ట్యాంపరింగ్ వివాదంతో ఆటకు దూరమై 2018 సంవత్సరమంతా చేదు అనుభవాలు ఎదుర్కొన్న ఆస్ట్రేలియా క్రికెటర్ డేవిడ్ వార్నర్‌కు నూతన ఏడాది తీపి కబురుతో ప్రారంభమైంది. మరో నాలుగు నెలల్లో నిషేధం పూర్తిచేసుకోని అంతర్జాతీయ క్రికెట్‌లో పునరాగమనం చేయనున్న వార్నర్‌కు అంతకు ముందే శుభవార్త విన్నాడు. తను మరోసారి తండ్రి కాబోతున్నట్లు తన భార్య క్యాండిక్ వార్నర్ నోట వచ్చిన తీపి కబురుతో వార్నర్ కొత్త ఏడాదిని ఘనంగా ప్రారంభించాడు. ఇక వార్నర్ తండ్రి కాబోతున్నాడనే విషయాన్ని అతని భార్య క్యాండికే స్వయంగా ట్వీటర్‌లో పేర్కొంది. 'ఈ ఏడాదంతా మా వెన్నంటి నిలిచిన ప్రతీ ఒక్కరికి తెలియజేసేది ఏమంటే.. 2019లో మా కుటుంబంలోని నలుగురం కాస్త ఐదుగురు కానున్నాం. అందరికి నూతన సంవత్సర శుభాకాంక్షలు' అని తాను గర్భవతిననే విషయాన్ని ట్వీట్ చేసింది. ఇక వార్నర్ ఇప్పటికే ఇద్దరు ఆడపిల్లలకు తండ్రన్న విషయం తెలిసిందే. ట్యాంపరింగ్ వివాదంతో ఆటకు దూరమైన వార్నర్.. మరో నాలుగు నెలల్లో అతనిపై పడ్డ నిషేదం పూర్తికానుంది. ఇక వార్నర్ పునరాగమం కోసం ఆసీస్ ఆటగాళ్లు, అభిమానులు వెయ్యికళ్లతో ఎదురుచూస్తున్నారు.

శ్రీలంకకు షాక్

- టీ20 ప్రపంచకప్ సూపర్–12 కు అర్హత సాధించలేక పోయిన లంక
- బంగ్లాదేశ్‌కూ అదే పరిస్థితి
- సూపర్–12కు ఆఫ్ఘానిస్థాన్



దుబాయ్: టీ–20 మాజీ ఛాంపియన్ శ్రీలంక, పొరుగు దేశం బంగ్లాదేశ్‌కు షాక్ తగిలింది. ఈ రెండు జట్లు 2020లో జరిగే పురుషుల టీ20 ప్రపంచకప్ సూపర్–12కు నేరుగా అర్హత సాధించలేదు. తక్కువ ర్యాంకుల వల్ల గ్రూప్ దశలో పోటీ పడాల్సిందే. పాకిస్థాన్, భారత్, ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్, వెస్టిండీస్, ఆఫ్ఘానిస్థాన్ నేరుగా సూపర్12కు అర్హత సాధించాయని ఐసీసీ మంగళవారం ప్రకటించింది. మూడు సార్లు పొట్టి క్రికెట్ ప్రపంచకప్ ఫైనల్‌కు వెళ్లిన శ్రీలంక నేరుగా అర్హత సాధించకపోవడం బాధాకరం. గ్రూప్ దశలో మిగతా ఆరు జట్లతో బంగ్లా, లంకా పోరాడాల్సి ఉంటుంది. 2020 అక్టోబర్ 18 నుంచి నవంబర్ 15 వరకు టీ–20 ప్రపంచకప్ నిర్వహిస్తారు. ఐసీసీ టీ20 ర్యాంకుల జాబితాలో అగ్రస్థానంలోని ఎనిమిది జట్లు నేరుగా సూపర్–12కు అర్హత సాధిస్తాయి. గ్రూప్ దశలో అగ్రస్థానంలో నిలిచిన నాలుగు జట్లు సూపర్–12కు ఎంపికవుతాయి. శ్రీలంక అనర్హత గురించి సారథి లసిత్ మలింగ అసంతృప్తి వ్యక్తం చేశాడు. గ్రూప్ దశలో విజృంభించి ముందుకు సాగుతామని ధీమా వ్యక్తం చేశాడు. టీ20 విశ్వ విజేత వెస్టిండీస్‌పై ఈ మధ్యనే సిరీస్ విజయం సాధించామని బంగ్లా సారథి షకిబ్ అల్ హసన్ అన్నాడు. సిరీస్ రాణిస్తామని పేర్కొన్నాడు



నేషనల్ టెన్ని–కాయిట్ ఛాంపియన్‌షిప్‌కు తెలంగాణ జట్లు



విజయక్రాంతి, హైదరాబాద్: 37వ జూనియర్ నేషనల్ టెన్ని కాయిట్ ఛాంపియన్ షిప్‌లో పాల్గొనేందుకు తెలంగాణ స్టేట్ టెన్ని–కాయిట్ జట్టు హైదరాబాద్ నుండి గుజరాత్‌కు బయలుదేరింది. ఈనెల 3నుండి జనవరి 7వరకూ ఈ ఛాంపియన్‌షిప్ రాజ్‌కోట్‌లో జరగనుంది. ఈ టోర్నీకి తెలంగాణ హాట్ ఫేవరేట్‌గా బరిలోకి దిగబోతుంది. జూనియర్ నేషనల్‌లో ఆడబోతున్న ఆటగాళ్లను అసోసియేషన్ సభ్యులు అభినందించి వారికి కిట్లను ప్రదానం చేశారు. తెలంగాణ నుండి బాలుర జట్టు: ఎండీ. యాసిన్(కెప్టెన్) ఎండీ. సుజాయత్, బి. గణేష్, కె.నిఖిల్, వై. సాయి కిరణ్, ఎండీ అవెజ్, జట్టుకు కోచ్‌గా ఎస్ సద్గురు.

బాలికల జట్టు: కె. హేమలత, కె. అనిత, పి. మల్లేశ్వరీ,, కె. యాదమ్మ, డి. నాగమణి, కె. మనీషా, జట్టు కోచ్ కె. శిరీషా

మూడో టెస్ట్ పిచ్‌కూ.. అదే రేటింగ్

- మెల్‌బోర్న్ పిచ్‌కు సగటు రేటింగ్ ఇచ్చిన ఐసీసీ



మెల్‌బోర్న్: ఆస్ట్రేలియాకు ఐసీసీ మళ్లీ షాకిచ్చింది. భారత్, ఆస్ట్రేలియా మధ్య మూడో టెస్టు జరిగిన మెల్‌బోర్న్ క్రికెట్ మైదానం పిచ్‌కు 'సగటు' రేటింగ్ ఇచ్చింది. రెండో టెస్టు నిర్వహించిన పెర్త్ పిచ్‌కు సైతం సగటు రేటింగే లభించింది. గతేడాది యాషెస్‌లో భాగంగా ఎంసీజీలో ఇంగ్లాండ్‌తో మ్యాచ్ జరిగింది. అప్పుడు పిచ్ పేలవంగా ఉండటంతో మూడు డీమెరిట్ పాయింట్లు విధించారు. అప్పటితో పోలిస్తే ప్రస్తుతం కాస్త మెరుగైందని ఐసీసీ తెలిపింది. 'సగటు' రేటింగ్‌కు ఐసీసీ డీమెరిట్ పాయింట్లేమీ విధించదు. పేలవంగా ఉంటే మూడు డీమెరిట్ పాయింట్లు విధిస్తుంది. ఐదేళ్ల కాలంలో ఒక మైదానానికి ఐదు డీమెరిట్ పాయింట్లు వస్తే నిబంధనల ప్రకారం దానికి టెస్టు హోదా రద్దు చేస్తారు. మెల్‌బోర్న్‌లో బ్యాటింగ్ చేయడం చాలా కష్టమైంది. పుజారా, కోహ్లీ, మయాంక్ కష్టపడటంతో రెండు రోజులకు భారత్ 443 పరుగులు చేసింది. చివరి రెండు రోజుల్లో పిచ్ కాస్త బాగున్నట్టు కనిపించినా టీమిండియా పేసర్లు 15 –20 వికెట్లు తీశారు. మెల్‌బోర్న్ లోని పిచ్‌లు 15 ఏళ్ల క్రితం రూపొందించినవి. కొత్త పిచ్ రూపొందించాలంటే కనీసం మూడేళ్లు పడుతుంది.

ఫైన్ ఇంట్లో.. రిషబ్ పంత్



సిడ్నీ : భారత్, ఆస్ట్రేలియాల బోర్డర్ గవాస్కర్ సిరీస్ సందర్భంగా ఇరు జట్ల ఆటగాళ్ల మధ్య స్లెడ్జింగ్ తారాస్థాయికి చేరిన విషయం తెలిసిందే. తొలి టెస్టులో అంతంత మాత్రంగానే కనిపించినా.. మూడో టెస్ట్‌కు వచ్చేసరికి అది తీవ్ర రూపం దాల్చింది. ఎంతలా అంటే ఆటగాళ్లు ఒకరిపై ఒకరు వ్యక్తిగతంగా విమర్శించుకునేలా! ముఖ్యంగా ఆసీస్ కెప్టెన్ టిమ్ ఫైన్, భారత యువ వికెట్ కీపర్ రిషభ్ పంత్‌ల మధ్య నడిచిన మాటల తూటాలు తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. ఈ తరహా ఆటగాళ్ల స్లెడ్జింగ్ మరే వివాదానికి దారితీస్తుందో అని క్రికెట్ అభిమానులు కవలవరపడ్డారు. కానీ ఇదంతా ఉత్తదే.. ఆటలో భాగమేనని, మైదానం దాటితే తామంతా మంచి స్నేహితులమని పంత్ చాటిచెప్పాడు. మూడోటెస్ట్‌లో టిమ్‌ఫైన్. 'పంత్.. నా పిల్లలను ఆడించు.. నేను నా భార్యను సినిమాకు తీసుకెళ్తా!' అని సరదాగా అన్న వ్యాఖ్యలను పంత్ సీరియస్‌గా తీసుకున్నాడో ఏమో కానీ అతను అన్నట్లే ఫైన్ సతీమణి బొనీపైన్‌ను కలిసి వారి పిల్లలను ఆడించాడు. ఈ విషయాన్ని బొనీయే తన ఇన్స్‌స్టాగ్రాంలో పేర్కొంది. అంతేకాకుండా పంత్ బెస్ట్ బేబీసిట్టర్ అని కొనియాడింది. ప్రస్తుతం ఈ ఫొటో నెట్టింట హల్చల్ చేస్తోంది. ఇక మెల్‌బోర్న్ టెస్ట్‌లో పంత్ బ్యాటింగ్ సమయంలో 'పంత్.. ధోని వచ్చాడు కదా.. వచ్చి బీబీఎల్ ఆడుకో' అని ఫైన్ కామెంట్ చేయగా.. ఫైన్ బ్యాటింగ్ సమయంలో 'టెంపరరీ కెప్టెన్' అంటూ పంత్ వ్యాఖ్యానించడం తీవ్ర చర్చనీయాంశమైన విషయం తెలిసిందే.జనవరి 3 నుంచి సిడ్నీ వేదికగా చివరి టెస్ట్ ప్రారంభంకానున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మంగళవారం ఇరు జట్ల ఆటగాళ్లు ఆస్ట్రేలియా ప్రధాని స్కాట్ మొర్రిసన్‌ను కలిసారు. వీటికి సంబంధించిన ఫొటోలను బీసీసీఐ ట్వీట్ చేసింది.



ఐపీఎల్‌లో బుమ్రాకు రెస్ట్..

- కోహ్లీ సూచనకు బీసీసీఐ అమోదం..?

ఢిల్లీ: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)కు టీమిండియా బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా దూరం కానున్నాడా? ఈ ప్రశ్నకు అవుననే సమాధానం వినిపిస్తోంది. బౌలర్లను ఐపీఎల్‌కు దూరంగా ఉంచాలన్న కోహ్లీ సూచన మేరకు బీసీసీఐ ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. మేలో ప్రపంచకప్ ప్రారంభం కానున్న నేపథ్యంలో బుమ్రాకు విశ్రాంతి ఇవ్వాలని బీసీసీఐ యోచిస్తున్నట్టు తెలుస్తోంది. ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ జట్లలోని కీలక ఆటగాళ్లు కూడా ఐపీఎల్‌కు దూరం కానున్నారు.బీసీసీఐ నిర్ణయంతో బుమ్రా ముంబై ఇండియన్స్‌కు దూరం కానున్నాడు. అయితే, బుమ్రా కనుక ఫిట్‌గా ఉంటే కీలక మ్యాచుల్లో ఆడించి మిగతా మ్యాచుల్లో విశ్రాంతి ఇవ్వాలన్న యోచన కూడా ఉన్నట్టు తెలుస్తోంది. బోర్డు మాత్రం కోహ్లీ సూచనకే మొగ్గు చూపినట్టు తెలుస్తోంది.

నాలుగు ఓవర్లకు అలసి పోరు: ధోనీ

నాలుగు ఓవర్లు బౌలింగ్ చేసినంత మాత్రాన అలసిపోరు. బౌలర్లలో నైపుణ్యాలు పెరుగుతాయి. ఈ నాలుగు ఓవర్ల బౌలింగ్ అత్యుత్తమంగా రాణించడానికి ఉపయోగపడుతుంది. బౌలింగ్‌లో మెళకువలు నేర్చుకోవచ్చు.. అలాగే, ఒత్తిడిలోనూ రాణించే సామర్థ్యం వస్తుంది. బౌలర్లు అందరూ ఐపీఎల్ ఆడవచ్చని నేను భావిస్తున్నాను. అయితే, వారు తమ ఆహారం, నిద్ర విషయాల్లో మాత్రం శ్రద్ధ పెట్టాల్సి ఉంటుంది' అని వ్యాఖ్యానించాడు.'తమ నైపుణ్యాలను పెంచుకోవడంపై బౌలర్లు దృష్టి పెట్టాలి. నైపుణ్యాలను పెంచుకోవడానికి ఐపీఎల్‌లో ఆడడం గొప్ప అవకాశంగా నేను భావిస్తాను. ఇందులో ఆడితే మనకు చాలా సమయం దొరుకుతుంది. రోజులో నాలుగు గంటలు మాత్రమే ఆడతాము. జిమ్‌కు వెళ్లి వ్యాయామం చేసుకునే సమయం కూడా ఉంటుంది' అని ధోనీ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు.



Printed and Published By Chilappagari Laxmi Rajam, on behalf of Intercontinental Publications Private Limited, Printed at Intercontinental Publications Private Limited, Survey No .713/P, Dundigal Grama Panchayat, Qutubullapur Mandal, Medchal – Malkajgiri District 500043, Published at Plot No. 1267/A, Road No. 63/A, Jubilee Hills, HYDERABAD–500033, Telangana State. Editor: Chilappagari Laxmi Rajam, RNI NO: TELTEL /2018/75203, Ph: +91 40 2355 6603, Fax No. +91 4023556604, Toll Free: 1800 599 3399.